

ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక
4 అణాలు
21-7-54
ANDHRA PATRIKA


పంచతంత్రం;
లబ్ధనాశము
చిత్రరచన, నిర్వహణ: విశ్వాత్ముల నరసింహమూర్తి
పూర్వమొకప్పుడు ఒకగ్రామంలో ఉండే యుధిష్ఠిరుడను ఒక కుమ్మరి:
తప్పతాగి ఒక రోజున అతడు - తూలుతు సోలుతు పోతున్నాడు, - ఒళ్లు తెలియని మైకంలో ఒక - కుండ పెంకుపై కూలేశాడు.
మొనతేలిన కుండ పెంకతని నుదిటిని లోతుగ చీరేసింది!
గాయమైతే మానెను గానీ - అతని ముఖానా మచ్చ మాత్ర - మట్లే మిగిలింది.
కొద్ది నెలలకే ఆ ప్రాంతమునా - దుర్భర క్షామం చుట్టేసింది: - అలో లక్ష్మణా అంటూ అక్కడి - ప్రజలంతా తలోదిక్కు - వలసవెళ్లిపోయారూ
కుమ్మరి వేరొక దేశపు సైన్యంలో చేరాడూ.
సైన్యపర్యవేక్షణకు వచ్చిన ఆరాజుగారు - ఒక రోజున ఇతని ముఖము మీది మచ్చ చూచారు.
(తనలో) "ముఖము మీద మచ్చ చూస్తె - వీడెవరో మహావీరు - డై వున్నటు తోస్తుంది. - ఏదో ఒక పెద్ద యుద్ధ - మున బలాఢ్యు నెదుర్కొని - దెబ్బ తినీ యుండనోపు!"
రాజుగారి మనసులోన - ఎప్పుడు సద భిప్రాయం - కలిగెనో అప్పటినుంచీ - పెరిగెను అతనికి పొగా.
రాజకుమారులు సైతం - కుమ్మరి వానికి - జరిగె - గౌరవమును చూచి ఎంతో - ఈర్ష్య నొంద జొచ్చారు
7


సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

సంపుటము 47
సంచిక 45
21.7-54

సచిత్రవారపత్రిక


Founder : K. NAGESWARA RAO

జయ ఆషాఢ బహుళ షష్ఠి బుధవారం



"జమా ఖర్చు"

ఫోటో...శాశం. రామేశ్వరరావు, రాజమండ్రి.



మంగళవారం, జూలై 6:

—చీనా - వియత్నామ్ సరిహద్దులలో కచోట చీనా ప్రధాని చౌ ఎన్‌లీ, వియత్నామ్ అధ్యక్షుడు డా॥ హోచిమిన్ సమావేశమైనారు.

—చీనా కమ్యూనిస్టు ప్రభుత్వానికి ఐక్యరాజ్య సమితిలో ప్రవేశమివ్వవలసిన తరుణం వచ్చిందని న్యూజీలాండ్ విదేశాంగ మంత్రి క్లిఫ్టన్ వెబ్ ప్రకటించారు.

—భారతప్రభుత్వ విదేశాంగ విధానాన్ని గురించీ, ప్రపంచ వ్యవహారాలలో ఆసియా ప్రాధాన్యతనుగురించీ వివరిస్తూ పండిట్ నెహ్రూ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులకు సర్క్యులర్ పంపారు.

విషయానుక్రమణిక

ముఖచిత్రం: ప్రతిభా వారి "కేచుక్క" లో కొత్తనటి ప్రమీలా.

—ఆస్ట్రేలియాకు ఏటేటా భారతీయులు కొందరిని వలస పంపాలనే ఉద్దేశంతో ఆస్ట్రేలియా ప్రభుత్వంతో భారత ప్రభుత్వం రాయబారాలు జరపడానికి యత్నిస్తున్నదని కాన్బెర్రా వార్త.

—ఆగ్నేయాసియా రక్షణగురించి బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి, ఆస్ట్రేలియన్ సైనికాధికారులు సింగపూర్‌లో రహస్య సమాలోచనలు జరిపారు.

—భారతదేశంలో ఫ్రెంచి పరిపాలిత ప్రాంతాలగురించి తిరిగి సమాలోచనలు జరపవలసిందిగా భారత ప్రభుత్వానికి సూచించాలని ఫ్రెంచి మంత్రివర్గం నిర్ణయించింది.

—ఐ.క్యా కాలువలలోకి సట్లెజ్ నీటిని విడిచినందువల్ల పాకిస్తాన్‌కు నష్టం వాటిల్లుతుందనే మాట అబద్ధమని చెప్తూ, ఆ కాలువ నీటి పరిస్థితిని భారతప్రభుత్వం వివరించింది.

—సింహళంలో భారతీయులపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపట్ల అసంతృప్తి సూచకంగా ద్వీపమంతటా తోట కార్మికులందరూ సమ్మెచేశారు.

—ఐక్యరాజ్యసమితి అధ్యక్షురాలు విజయలక్ష్మి పండిట్ లండన్ బకింగ్ హాం పాలెస్‌లో బ్రిటిష్ రాణి ఎలిజబెత్‌ను సందర్శించారు.

—ఇండియన్ బార్ కౌన్సిల్ ఆక్ట్ (1926) 1, 2, 17, 19 సెక్షన్లు మినహా జూలై 6 నుంచి ఆంధ్ర హైకోర్టును అమలు జరుపుతూ ఆంధ్రప్రభుత్వం గెజెట్ ప్రకటన చేసింది.

—భారతీయభాషలన్నిటికీ మాతృభాష అయిన సంస్కృతం రాజభాషగా ఉండాలని తమ అభిప్రాయమైనట్లు కేంద్రం హోంమంత్రి డా॥ కట్జూ గుంటూరు సంస్కృత సమ్మేళనంలో తెలియచేశారు.

—ఆంధ్రదేశంలో పరిస్థితులను పరిశీలించడానికిగాను కేంద్ర కాంగ్రెస్ కార్యదర్శి బలవంతరాయ్ మెహతా గారు సంచారం ప్రారంభించారు.

—నీటిసరఫరా, డ్రెయినేజి మొదలైన పనులకుగాను ప్రభుత్వవద్ద ఋణాలు తీసుకునే అధికారం స్థానిక సంస్థలకు అవసరమని డా॥ కట్జూ గుంటూరులో అన్నారు.

—గుంటూరు వైద్యకళాశాల మూడో విడాది తరగతులకు ముఖ్యమంత్రి ప్రకాశం గారు ప్రారంభోత్సవం జరిపారు.

—వేరుశనగ, మిరపకాయలు మొదలైన వ్యవసాయ ఫలసాయాల ఎగుమతి గురించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాలను సంప్రదించినమీదటనే కార్యక్రమాలను నిర్ణయించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రుల సమావేశం (శ్రీనగర్)లో తాము సూచించనున్నారని మంత్రి తిమ్మారెడ్డి గారు కర్నూలులో చెప్పారు.

బుధవారం, జూలై 7:

—చీనా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఐక్యరాజ్యసమితిలో ప్రవేశపెట్టరాదని అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ పత్రికా సమావేశంలో ప్రకటించారు.

—ఇండోచీనా గురించి జెనీవా సంప్రతింపులు విఫలమయ్యే పక్షంలో తన మంత్రివర్గం రాజీనామా ఇచ్చేముందు నిర్బంధంగా చేర్చిన సైనికదళాల్ని ఇండోచీనా యుద్ధరంగానికి పంపే ఏర్పాటు చేస్తున్నట్లు ఫ్రెంచి ప్రధాని ప్రకటించారు.

—జెనీవా సమావేశంలో పాల్గొనడానికి ఫ్రెంచి ప్రధాని స్వయంగా వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు.

—జోర్డన్ నదీజలాల వినియోగంగురించి ఇస్రాయల్, సిరియా, లెబనాన్, జోర్డన్ ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది.

—ఆస్ట్రేలియాకు శ్వేతేతర జాతులవారి వలసను ప్రభుత్వం అంగీకరించబోదని కాన్బెర్రాలో వలసశాఖామంత్రి ప్రకటించారు.

—భారతీయులపట్ల సింహళప్రభుత్వ విధానం గుర్తించి నిశిత విమర్శ చేసినందుకుగాను భారత హైకమీషనర్ సి. సి. దేశాయ్‌గారిని భారతదేశానికి పంపివేయాలంటూ సింహళ రాజకీయపక్షాలు కొన్ని ఆందోళన లేవదీశాయి.

—రైతులకు ట్రాక్టర్లు, మోటార్ యంత్రాలు, ఆయిల్ ఇంజన్లు అద్దెకిచ్చే ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రభుత్వం నిర్ణయించింది.

—కార్మికుల ఆరోగ్యభీమాపద్ధతిని ప్రవేశపెట్టాలని హైదరాబాద్ ప్రభుత్వం నిశ్చయించింది.

—ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌లో నడుస్తున్న ప్రాథమిక పాఠశాలలన్నిటినీ ఎత్తివేయాలని కుప్పుస్వామి కమిటీ చేసిన సూచన తమకు నచ్చిందనీ; అందుకు తాము కృషి చేయగలరనీ విద్యామంత్రి పట్టాభిరామారావుగారు గుంటూరుజిల్లా ప్రాథమికోపాధ్యాయసమితి (బాపట్ల)లో ప్రకటించారు.

గురువారం, జూలై 8 :

—చీనా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని సమితిలో ప్రవేశపెట్టాలని ప్రయత్నిస్తే అమెరికా వీటో ప్రయోగిస్తుందని అమెరికన్ విదేశాంగమంత్రి డలెస్ ప్రకటించాడు.

—ఇండో చీనా సమాలోచనల నిమిత్తం రష్యన్ విదేశాంగమంత్రి మాలటోవ్ జినీవా వచ్చారు.

—మార్షల్ దీవులలో ఎటామిక్, హైడ్రోజన్ బాంబుల ప్రయోగాన్ని గురించి ఆ దీవుల నివాసులు ఐక్యరాజ్య సమితి ట్రస్టీషిప్ కౌన్సిల్‌కు చేసిన ఫిర్యాదును రష్యా బలపరిచింది.

—సూయజ్ కాలువ ప్రాంతం గురించి తిరిగి రాయబారాలు జరపాలని సూచిస్తూ బ్రిటిష్ ప్రభుత్వం ఈజిప్టు ప్రభుత్వానికి కొత్త ప్రతిపాదనలను పంపింది.

—గ్వాటిమాలా అధ్యక్షుడుగా విప్లవ నాయకుడు కల్నల్ కార్లోస్ ఆర్మాస్ ప్రకటించుకున్నాడు.

—బ్రఖా ప్రాజెక్టు కాలువలలోనికి సట్లెజ్ నదీజలాలను విడుదలచేశారు. ఈ సందర్భంలో పండిట్ నెహ్రూ పంజాబ్ కాలువల గురించి భారత ప్రభుత్వాభిప్రాయాన్ని వివరించారు.

—బళ్ళారి భవితవ్యం శాశ్వతంగా నిర్ణయించబడినట్లు భావించరాదనీ, ఆ సమస్యను రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘం పరిశీలించే అవకాశం ఉన్నట్లు తామింకా భావిస్తున్నారనీ, పండిట్ నెహ్రూకూడా ఇదే అభిప్రాయం లోగడ తెలిపిఉన్నారనీ డా॥ కట్జూ కర్నూలులో పత్రికా సమావేశంలో తెలియసగినారు

—మైసూరు విద్యాలయాలన్నిటిలోనూ ఇకనుంచి సర్వోదయ దినం మొదలు (జనవరి 30) విద్యాబోధన ప్రారంభించి తుదిపరీక్షలు డిసెంబర్‌లో పెట్టాలని మైసూరు ప్రభుత్వం నిర్ణయించింది.

—తెలంగాణాలోని తొమ్మిది జిల్లాలు, ఇతర భాషాప్రాంతాలలోని నిర్వివాదమైన తెలుగు ప్రాంతాలు, చాందా బస్తర్ జిల్లాలలోని (మధ్యప్రదేశ్) తెలుగు ప్రాంతాలు, తూర్పుగోదావరి జిల్లాలోని భద్రాచలం తాలూకాలో కొంత ప్రాంతం కలిపి తెలంగాణా రాష్ట్రం నిర్మించాలని హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ ఫజల్ ఆలీ కమిషన్‌కు ఇచ్చిన నివేదికలో విజ్ఞప్తి చేసింది.

—మద్యనిషేధం గురించి ఆంధ్ర శాసనసభ తీర్మానం సిఫార్సు మాత్రమేననీ, ఈ సమస్యగురించి కాంగ్రెస్ తన ఆదర్శాల ప్రకారమే వ్యవహరిస్తుందనీ కాంగ్రెస్ కార్యదర్శి బలవంతరాయ్ మెహతా కర్నూలులో అన్నారు.

శుక్రవారం, జూలై 9 :

—చీనా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని సమితిలో ప్రవేశపెట్టే ప్రతిపాదనపైన వీటో ప్రయోగం చెల్లదని సర్దార్ పణికర్ అన్నారు.

—కమ్యూనిస్టేతర ఆసియా దేశాల సంరక్షణకు గారంటీఇస్తూ ఆస్ట్రేలియా, అమెరికా, న్యూజీలాండ్ ప్రభుత్వాలు ఒక ప్రకటన చెయ్యాలని తలపెట్టినట్లు వాషింగ్టన్‌వార్త.

—హానోయ్ నగర రక్షణ పరిసరాలను వియత్మిన్ సేనలు సమీపిస్తున్నాయని వార్తలు వస్తున్నాయి.

—హొక్కైడో ద్వీపాన్ని అమెరికన్ సైన్యాలు ఖాళీచేసి, ఆద్వీప సంరక్షణను జపనీస్ 'దేశరక్షణ దళాలకు' ఈ సంవత్సరం ఒప్పగించగలరని టోక్యోలోని అమెరికన్ సైనికాధికారి ఒకరు ప్రకటించారు.

—నంగాల్ డామ్ కాలువలను తెరిచినందువల్ల పంజాబ్ కాలువల తగాదాలో కొత్త సమస్య ఏదీ రాలేదని ప్రపంచబాంక్ అధికారులు ప్రకటించారు.

—ఆంధ్రదేశంలోని విద్యాలయాలలో విద్యార్థులందరికీ హిందీ నిర్బంధంగా బోధించే విషయమై ఆంధ్రప్రభుత్వం ఆలోచిస్తున్నదని విద్యామంత్రి పట్టాభి రామారావుగారు కర్నూలులో అన్నారు.

—తిరువాన్కూర్-కొచిన్‌లోని తమిళ జిల్లాలను మద్రాసురాష్ట్రంలో చేర్చాలంటూ తిరువాన్కూరు తమిళ్నాడు కాంగ్రెస్ సత్యాగ్రహం ప్రారంభించింది.

—ఆంధ్ర బార్ కౌన్సిల్ సభ్యులను ఆంధ్రహైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేసే అవకాశం కల్పిస్తూ ఆంధ్ర గవర్నరు ఆర్డినెన్సు ప్రకటించారు.

—ఫజల్ ఆలీ కమిషన్ సమర్పించబోయే నివేదికపైన తుదినిర్ణయం చేసేబాధ్యత పార్లమెంటుదేనని డా॥ కట్జూ హైదరాబాద్‌లో అన్నారు.

—మద్యనిషేధం అమలు బరపడంలో వెనుకంజ వెయ్యడం ప్రజలను మోసగించినట్లని డా॥ కట్జూ కర్నూలులో అన్నారు.

శనివారం, జూలై, 10

—కమ్యూనిస్టు దేశాలతో వ్యాపార నిర్బంధాలను గురించి బ్రిటన్ అమెరికాల మధ్య రాజీ కుదిరిందని వాషింగ్టన్‌లో ప్రకటించబడింది. నిర్బంధాలను ఎప్పుడు సడలించాలో మాత్రం తరువాత నిర్ణయమౌతుందట.

—ఈ సంవత్సరాంతంలోగా యూరోపియన్ రక్షణ వ్యవస్థను ఆమోదించని పక్షంలో ఫ్రాన్స్ ఇటలీలకు ఆర్థిక సహాయం నిలిపివెయ్యాలని అమెరికన్ సెనేట్ తీర్మానించింది.

—జినీవా సమావేశం నిమిత్తం ఫ్రెంచి ప్రధాని జినీవా వెళ్ళారు.

—ఐక్యరాజ్య సమితిలో కమ్యూనిస్టు చీనాకు ప్రవేశం కలిగే పక్షంలో సమితి పట్ల అమెరికా వైఖరిని పరిశీలించడానికిగాను కాంగ్రెస్‌ను సంప్రదించవలసిందని అమెరికన్ సెనేట్ విదేశాంగ వ్యవహార సంఘం అధ్యక్షుడు ఐసెన్‌హోవర్‌కి ఉత్తరువిచ్చింది.

—ఫ్రెంచి ప్రధాని రష్యన్ విదేశాంగ మంత్రితో ఇండో చీనాగురించి సంప్రదించారు.

—మార్షల్ దీవులలో హైడ్రోజన్ బాంబు ప్రయోగాల గురించి ట్రస్టీషిప్ కౌన్సిల్‌లో బ్రిటిష్ అమెరికన్ తీర్మానాన్ని రష్యన్ తీర్మానాన్ని కూడా ప్రతిఘటిస్తూ అంతర్జాతీయ న్యాయసంస్థకు ఈ కేసును ఒప్పచెప్పాలని భారత ప్రతినిధి కృష్ణమీనన్ ప్రతిపాదించారు.

—సూయజ్ కాలువగురించి ఈజిప్షియన్, బ్రిటిష్ ప్రభుత్వాలమధ్య సంప్రదింపులు కైరోలో ప్రారంభమైనాయి.

—డయ్యూద్వీపంలో పోర్చుగీస్ అధికారులు విమానాశ్రయం నిర్మిస్తున్నారని బొంబాయి వార్త.

—బ్రఖా కాలువ తెరిచినందుకు పాకిస్థాన్ ప్రభుత్వం భారతప్రభుత్వానికి అధిక్షేపణ తెలిపింది.

—ఖాదీ, గ్రామపరిశ్రమల నిమిత్తం ఒక బోర్డును ఆంధ్రప్రభుత్వం స్థాపించింది.

—భారతదేశమంతటా బియ్యం, ధాన్యం రవాణా, ధరలు అమ్మకాలపై కంట్రోల్స్ రద్దు చేయబడినాయి.

—హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులుగా శ్రీ మల్లప్ప కొల్లూర్ ఎన్నుకోబడ్డారు. వీరికి 104 వోట్లు, ప్రత్యర్థి దేవిసింగ్ చౌహాన్ గారికి 71 వోట్లు వచ్చాయి.

—కోస్తా జిల్లాలలో అపారవృష్టివల్ల ఏలూరు - తాడేపలిగూడెం మధ్యనూ, పావడపల్లి - ఖమ్మంమెట్టు మధ్యనూ రైలు మార్గానికి గండ్లుపడి రైళ్ళ రాకపోకలకు ఆటంకం కలిగింది. తాడేపల్లిగూడెం తాలూకాలో వరి నాటిన చేలకు నష్టం కలిగినట్లు వార్తలు వచ్చాయి.

(49-వ పేజీ చూడండి)

కాలక్షేపం

"ఎప్పుడు దప్పులు వెదకెడు
నప్పురుషుని గొల్వగూడ-దది యెట్లన్నన్
సప్పంబు పడగనీడను
గప్ప వసించిన విధంబు-గదరా సుమతీ!"

తా॥ ఓ మంచిబుద్ధి గలవాడా! ఎల్లప్పుడు తప్పులు వెదకుచుండెడి పురుషుని కొలుచుట తగదు. అట్టి కొలువు ఎటువంటి దనగా, సర్పముయొక్క పడగనీడలో కప్ప నివసించువిధముగా నుండును.

బజారుకు వెళ్ళి రూపాయి వస్తువును రూపాయిన్నరకు కొంటే అది తప్పు — తప్పున్నర కూడా - నిజమే. కాని, దేనికైనా ముందు ఎంచి కాలు ఎంచడం మంచిదన్నారు మంచి చెడ్డలు తెలిసిన మన పెద్దలు. రాబోయే కీడు గాని, కష్టనష్టములు గాని, అనేక కారణాంతరములవల్ల కలిగే అవాంతరములు గాని, ముందుగానే సాధ్యమైనంత వరకు లెక్క చూచుకొని, అంచనా లెక్కలు తయారుచేయడం అవసరం. ఈవిధంగా ఎన్ని మదింపులు చేసినప్పటికీ, మన తలంపులకు, మించిన కష్టనష్టములు మనకు తలమున్కలుగా తలవంపులుగా తగులుతూ ఉండడంకూడా కలదు. కనుక, ఏదైనా పెద్ద పెద్ద వ్యవహారాలలోనికి దిగినప్పుడు, దైవికరాజకీయములకు లోబడి, కార్య భారమును నిర్వహించవలసివస్తుంది. మన మొకటి తలచితే దైవ మింకొకటి తలచినాడన్నట్లవుతుంది. మూడవ తరగతి టిక్కెట్టు కొని హాయిగా రైలుప్రయాణం చేయవలెనని బయలుదేరినప్పుడు మూడవతరగతి పెట్టెలన్నీ జనంతో బంగీ చేసినట్లుగా క్రిక్కిరిసి ఉండవచ్చు. అడుగుపెట్టుటకు అవకాశం లేకుండా, సూది దూర్చుటకు సందు లేకుండా, ఆ పెట్టెలలో ఊపిరి సలుపకుండా ఆ పెట్టెలలోని ప్రయాణీకు లందరూ "శ్వాసను బంధించి" ప్రాణాయామం చేస్తూ ఉండవచ్చు. రైలు గార్డుతో చెప్పినప్పటికీ, రైల్వేబోర్డుతో చెప్పినప్పటికీ, మూడవ తరగతి గతి మాది కాదంటారు. అటువంటిసమయంలో రైల్వేపరిపాలన అక్రమంగా ఉన్నదని తప్పులెంచుతూ స్టేషనులోనే కూర్చుండుటకు వీలులేదు. రైలువాళ్ల పాపాలు రైలువాళ్లే అనుభవిస్తారని నిశ్చయించి, మూడవతరగతి టిక్కెట్టును రెండవ తరగతి టిక్కెట్టుగా మార్పించి, లేదా ఇంటరు తరగతి టిక్కెట్టుగా మార్పించి, అందుకొరకైన హెచ్చు చార్జిని చెల్లించి, ఆదరాబాదరా రైలుయొక్క ఏ హైదరాబాదుకో ప్రయాణమై వెళ్ళిపోవలసివస్తుంది. అప్పుడు, తలుచుకో, తలచుకున్నంత అప్పుపుచ్చుకో అన్నట్లుగా అంచనాకు మించిన రైలుఖర్చులతో, దారిఖర్చు దప్పిఖర్చులతో తన ఊరికి తాను చేరక తప్పదు. ఇంతఖర్చు ఎందుకు చేసినామని, చింతించుటవల్ల సుంతయినా సుఖం లేదు. అంచనా లెక్కకుమించి అనేక వ్యవహారాలు వ్యయభారాలు అవుతాయి.

గిరిగీస్తే గిరిలోపల ఉండడం సులభ సాధ్యమా? గిరిలోపల ఉండడం గిరిధరునకైన, గిరి దుహిత ధవునకైన తరమా? నరులకిది కరము సులభతరమా? సీతాఅమ్మవారిని పర్ణశాలలో ఉంచి రాములవారు బయటకు పనిమీద వెళ్ళారు. ఒక గిరిగీసి, దానిని దాటివెళ్ళవద్దన్నారు. ఇంతలో రావణాసురుడు మాయవేషంలో భిక్షువస్తే అమ్మవారు ఆ గిరిదాటి వెళ్ళింది. మాయాభిక్షువు ఆమెను తక్షణం ఎత్తుకొని అక్షణంగా పారిపోయినాడు. అయ్యవారు గీసిన గిరిదాటి ప్రవర్తించడం అమ్మవారి తప్పు అవునంటారా? కాదంటారా? ఆ సంగతి అట్లా ఉంచండి. బంగారులేడి ఒకటి అడవిలో కన్పించింది. బంగారులేడి అనేది ఉండడం అసంభవం. అమాత్రపు చిన్నవిషయం రాములవారు గ్రహించవలసింది. కాని, ఆ విషయం గ్రహించలేదు. దానిని పట్టుకొనవలెనని ఆశతో దానివెంట పడ్డారు, మతిపోయిన వాని లాగున. "ప్రమాదో ధీమతా మపి" ధీమంతులకు కూడా ప్రమాదాలు సంభవిస్తాయి. మతిభ్రమిస్తూ ఉంటుంది. ఎవరైనా రైలుస్టేషనువద్ద మనకు కన్పించి, గిల్టు గుండీలను చూపించి, "నిజమైన బంగారుగుండీలు ఇవి." అని నమ్మించి, "నాకు రైలు టిక్కెట్టు కొనుటకు డబ్బు చాలలేదు—అందు చేత అవసరంగా అమ్మివేస్తున్నాను. రెండు రూపాయలిచ్చి తీసికొండి" అని మన వెంటబడితే, "బలేమంచి చౌక బేరమూ!" అని రెండు రూపాయల కంటె తక్కువ విలకు బేరమాడి రూపాయన్నరకు కొనుక్కొనినట్లయితే, రఘురాముడు కూడా మన తెలివితేటలముందర అకు రాముడవుతాడు. ఇంతకూ, అయ్యవారు ఎంత తప్పుచేశారో అమ్మగారుకూడా అంత తప్పు చేశారు. పర్ణశాలవద్ద అమ్మవారికి కాపలాగా లక్ష్మణస్వామిని ఉంచారు. మిన్నువిరిగి మీదపడినా సరే కదలవద్దని మిలిటరీ ఆర్డరు వేసి అన్నగారు మాయలేడిపై కన్ను వేసి వెళ్ళినారు. "హా! లక్ష్మణా!" అని కేక వేసింది ఆ మాయలేడి. ఆ కేకవిని, అమ్మవారు వెంటనే లక్ష్మణస్వామిని అర్జంటుగా ఆ వైపుకు వెళ్ళి చూడాలన్నారు. లక్ష్మణుడు ఆమె మాటకు అడుగు దాటకుండా, కర్ణశూలములవంటి మాటల తాకలేక, పర్ణశాల విడిచి వెళ్ళిపోయినాడు. మానవంతుడు అయినట్లయితే, రాములవారిచ్చిన మిలిటరీ ఆర్డరును మీరునా? ఆవిధంగా ఆమెను ఒంటరిగా అడవిలో విడిచి పారిపోవునా? రాములవారిమాట ఆ తమ్ముడు శిరసావహించినట్లుగా తమ్ముడు శిరసావహించలేకపోయినాడు. కనుక లక్ష్మణుడు చేసింది తప్పు అని వాదించే వకీలుంటె, ఆయనచేసింది ఒప్పు అని వాదించే వకీలుకూడా ఉంటాడు. ఏదైనప్పటికీ, గిరిగీస్తే గిరిదాటకుండా ఉండడం అమ్మవారికిగాని, మాయలేడిని చూస్తే భ్రమించకుండా ఉండడం అయ్యవారికిగాని సాధ్యం కాలేదు. మతి భ్రమిస్తుంది-పతికీ, సతికీకూడా. గజపతి బ్రోచిన జగత్పతికికూడా. /

రూల్సుప్రకారంగా మాట్లాడితే మన జీవితంలో ఇటువంటి తప్పులు ఒప్పులు తప్పవు. అందుకనే మనకు అనేక తిప్పలు అనేక అవస్థలు. తెలివి తక్కువ పనులు చేయడం అనేది ప్రత్యేకంగా ఆంధ్రుల లక్షణమే అనిన్నీ, ఆంధ్రులకంటె అన్యరాష్ట్రీలవారందరూ అనేకరెట్లు అయికమత్యం గల ఆణిముత్యాలు అనిన్నీ ఊహించి గర్వించేటటువంటి

విమర్శకాగ్రేసరశిఖామణులవిమర్శలుకూడా విమర్శింపదగినవే.

దూరపుకొండలు నున్నగాఉంటాయి. కాని మనకు దగ్గరగా ఉన్న బెజవాడ కొండలు కర్నూలు కొండలు కొరగాని బండలుగా కన్పిస్తాయి. నందికొండ విషయంలో ఆంధ్రులందరూ ఆనందించి ఏకాభిప్రాయంతో "ఆనందమానందమాయెను!" అని మేళంచేసి అక్షతలువేస్తే, నందికొండప్రాజెక్టు మిన్నందిన ప్రాజెక్టుగా, ప్రాజెక్టుల మిన్నయై వన్నెకెక్కగలదు. అయితే, ఆంధ్రులు పదిమందీ కలిసి ఇది కావాలని ఇదమిత్థమని నిర్ణయిస్తే, నందికొండఆనకట్టను నిర్మిస్తారు. ఆనకట్ట నిర్మాతలు ఆంధ్రమాతకూ జై! అంటారు. ఈ ఆనకట్ట నిర్మిస్తే ఆంధ్రుల పాడిపంటలకిక ఆనకట్ట లుండవంటే, అది గట్టిమాటగాని వట్టిమాట కాదు. "ప్రథమ పంచవర్ష ప్రణాళికలో చేర్చండి" అని ఆంధ్ర ప్రభుత్వం అడిగితే, కడుపడిగ తడవులేక తడవుకొనక పని ప్రారంభించడం తథ్యమని దేశముఖ్ గారు ఉపదేశించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఖజానా మంత్రిమాట కింకా ఆంధ్రులు ఖరీదు కట్టుటకు కలవరపడి గుసగుసలాడుతున్నారు. ఆంధ్రుల తెలివితేటలకు ఖరీదు కట్టుటకై ఖజానామంత్రి యత్నిస్తున్నాడు.

ఏ కాలు ముందు పెట్టవలెనో, ముందడుగు ఎట్లా వెయ్యవలెనో ఆలోచించి వెయ్యవలసిందే. కాని, పుణ్యకాలం వెళ్ళిపోయేవరకూ మీనమేషాలుగుణిస్తే, మన మతి తప్పక పోయినా, రైలు తప్పకుండా తప్పుతుంది. ఏ పెట్టెలో ఎక్కితే మంచిదో, ఏ పెట్టెలో బాగా చోటువున్నదో పరిపరి విధాల పరిశీలించి పరిశోధించి పరికించి శంకించి చూస్తే చివరకు సంస్థ ఇకిలించి చూస్తూ ఉండవలసివస్తుంది.

తప్పటడుగు వేస్తామేమో అని తడబడినకొలదీ, తప్పులు చేస్తామేమో అని తికమకపడినకొలదీ, తప్పక తప్పుదారిలో పడవచ్చు. కాలుపోగులు, కుండపెంకులు తగులకుండ తొలగి మెలగుచు మిగుల మెలకువతో నడచిన పూర్వాచార పూరిత పూర్వసువాసిని ఆఖరుకు అవుపేడలో అడుగు వేసింది. 1949 సంవత్సరంలో సిద్ధించవలసిన ఆంధ్రరాష్ట్రం 1952 సంవత్సరంలో సిద్ధించింది. అయితేనేం? అందువల్ల అనుపమానమైన అనుభవజ్ఞానం, అప్రయత్నంగా లభించిన అమూల్యరత్నంగా ఆంధ్రరాష్ట్రంతోబాటు ఆంధ్ర నాయకులకు సంక్రమించింది. ఈ అనుభవజ్ఞానం అమూల్యం. మానవుడు తప్పటడుగులు ఎన్ని వేస్తే మిన్న యగునో, తిరిగి తఫావతు రాకుండా తర్ఫీయతులయి తన్ను తాను తెలిసికోగలడో నూటిగా లెక్కించి రూఢిగా చెప్పలేము. మహాత్ముడు హిమాలయపర్వతం అంత తప్పులు చేశాడు. హిమాలయంఅంత తప్పులుచేసి, తాను సరియైన దారి తెలిసికొని, మనకు రహదారి చూపించాడు.

తప్పు చెయ్యడంవల్ల కలిగే ముప్పుకంటె, తప్పు చెయ్యడంవల్ల తెలివికి ముప్పుపట్టడం అనేది గొప్ప ముప్పు. తాళంచెవుల గుత్తిని ఎక్కడ పెట్టినదీ అంతుచిక్కక వెక్కిమొగం వేసినవాళ్ళు లెక్కకు మిక్కిలిగా ఉంటారు. అయితే మనకు అందువల్ల కలిగిన పెద్ద నష్టమేమిటి? అని విమర్శించుకోవాలి. తాళం చెవులుపోయిన మాట వాస్తవమే. కాని, మన జ్ఞాపకశక్తి కూడా పోయింది. కనుక, తాళంచెవులు పోయినవనే విచారంకంటె, జ్ఞాపకశక్తి పోయినదనే తత్వవిచారం చాలా అవసరం. ఈ ఆత్మవిచారణ లేకుండా తన్ను తాను మరచి ప్రవర్తించినవాడు, లోకాన్ని మెప్పించినా తప్పులో కాలువేసి తప్పుదారి త్రొక్కినాడనుట నిక్కము.

ఇతరులు మనలో చూపించినవి గొప్ప తప్పులుకావు. మనతప్పు మనం తెలిసికొనలేకపోవడమే గొప్పతప్పు. ముందంజ వేస్తున్నామనే భ్రమతో వెనుకంజ వేసినట్లవుతుంది. తాను చేసిందంతా శ్రేష్ఠం అని తలంచేవాళ్ళు యీ మహీతలంమీద బహుసంఖ్యాకులు. తాను చెప్పినదానిలో "అపశబ్ద భయం నాస్తి" అంటాడు. తాను వలచినది రంభ. తాను మునిగినది గంగ. తాను ప్లానువేస్తే సుల్తానుకూడా తప్పు పట్టలేడనే తన్మయత్వం అది. అటువంటివాళ్ళు ఎటుపోతున్నారో ఎరుగని తన్మయత్వంలో ఉంటారు. అందుకనే తన్మయత్వంలోనుంచి తన నిజతత్వంలోకి రప్పించగలవాళ్ళే కావాలి. మంత్రులు చేసినపనికి రాజులు తప్పులుపట్టడం సాగించినప్పుడు మంత్రులు రాజీనామా యివ్వడం పాతకాలపురీతి. కానికాలంతలక్రిందులైంది. ప్రభుత్వం తప్పుత్రోవలో పోతున్నదని ప్రజలు తప్పుపట్టేటటువంటి కాలం ఇది. మంత్రులు చదివే మంత్రాలలో అపస్వరం ఉండవచ్చు. అపశబ్దం ఉండవచ్చు. అటువంటి తప్పులను వెతికిపట్టి వాళ్ళు కళ్ళు తెరచి నడచేట్లుగా కళ్ళెము పట్టి, కదం త్రొక్కించే రథసారథివంటి బుధజనవిధేయులు ప్రజాప్రతినిధులైఉండడం అవసరం. వీరికే ప్రభుత్వ ప్రతికూలపక్షము వారని నామకరణం చేశాము. ప్రభుత్వ శాసనసభలో, ప్రభుత్వపునిండుకొలువులో, నిజంగా నిరతంగా

"ఎప్పుడు తప్పులు వెతకెడు
అప్పురుషులు—".

లేకపోయినట్లయితే, ధర్మం నాలుగు పాదముల నడువదని నుడువక తప్పదు.

—కాని, అది మంత్రివర్గానికి చేదుమందుగా ఉంటుంది - కటువుగా కంటకంగాఉంటుంది - ప్రభుత్వవర్గానికి ప్రాణగండంగా ఉంటుంది.

"సర్పంబు పడగనీడను
గప్ప వసించినవిధంబు - గదరా సుమతీ"

అనవచ్చు. కాని, ప్రభుత్వంలో పటుత్వంఉంటే, మంత్రివర్గం మంత్రం సరిగ్గా చదివితే, పాము మంత్రం తెలిసిన ప్రభుత్వ మంత్రివర్గం అయితే, ప్రతికూలపక్షం అనేటటువంటి సర్పంబు పడగనీడను నిర్భయంగా నిర్మలంగా నిశ్చలంగా మంత్రివర్గం అనేటటువంటి మండూకం నిండుకుండవలె తొణకకుండా తొలగకుండా వ్యవహరించవచ్చు. అప్పుడు,

"కప్పంగని పాము గడగడ వణకెన్"

అనే సమస్య పేర్పడుతుంది.

"వెంకప్పం గని పాము
గడగడ వణకెన్"


అని సమన్వయించవలసి ఉంటుంది. మంత్రజ్ఞులైన మంత్రులైతే,

"ఎప్పుడు తప్పులు వెదకెడు
నప్పురుషుల కొల్వు కూడ"

దనే మాట పాటించరు.

"కాలము తలక్రిందయ్యెను - గదరా
సుమతీ."

★





ను 19వ శతాబ్ది రష్యన్ రచయిత అంటన్ చెకోవ్ (1860 - 1904) యాభైయవ వర్ధంతి. ఆయన ఆఖరి సంవత్సరాలు క్రిమియాలోని యాల్టా పట్టణంలో గడిపాయి. వ్యాధిగ్రస్తుడై ఉన్నా, ఆయన తన రచనలలో ప్రసిద్ధి కెక్కిన కొన్నిటిని ఇక్కడే రచించాడు. ఆ రోజుల్లో ఆయన ఉపయోగించిన వ్రాతబల్లను, పరికరాలను పై ఫొటోలో చూడవచ్చును.

చెకోవ్ వర్ధంతి

← చెకోవ్ రచనలు 68 సోవియెట్ భాషలలోకి అనువదించబడినవి [illegible]

గ్రంథ మహోదయం

[చీకటి భ్రాంతిని స్ఫురింపచేసే సంగీతం.]

ప్రయోక్త:
వర్తమానకాలంలో
మారుమూల గ్రామంలో
ఒక చీకటి గదిలోపల
నవయువకుని మదిలోపల
వాంఛల మైదానమందు
వార్తల రహదారిలోన
ఊహల శృంగాటకాన
అవ్యక్తపు ఉపవీథిలోన
జరిగిన అపురూపకర
ఇది కల్పితనాటకం.

[జోలపాట సంగీత స్వరాలు]

ఆడగొంతు:
చిత్రం! విచిత్రం!
యువకుడి ఊహాచిత్రం.
అప్పుడే కాపరానికొచ్చిన నవోఢ
అతడి ఆశయాల జవరాలు. ముగ్ధ
పారేగదిలో పూలపానుపు
అతడి మనుగోవాల తొలికానుపు
వేసవిలేని వెన్నెలరేయి

ప్రయోక్త: (మెల్లగా)
ఏయ్—నోరుమూయ్!
పదు! పదు! మాటలాపవద్దు
కథానాయకుడు—

ఆడగొంతు: (ఉదాసీనతతో)
కావలసినవాడే వాడు.

ప్రయోక్త:
అయితే సవ్వడులను చేయబోకు
అతడి కర్పూరస్వప్నాలను అర్పకు
అతడి ఊహాకు చితిని పేర్చకు
నిద్రాసరోవరంలో సుడులు రేగించకు
నిష్క్రమించుము.

ఆడగొంతు: (కచ్చితంగా)
నిష్క్రమించను.
లోనికా ప్రవేశించనేలేదు. తెరదించను

ప్రయోక్త:
ఎవరు నీవు?

ఆడగొంతు:
—భావాల నవకల రాయంచను

ప్రయోక్త:
ఎవరు నీవు?

ఆడగొంతు:
—కలలు తలదాచుకొనే పంచను!

ప్రయోక్త:
ఎవరు నీవు?

ఆడగొంతు:
—కదలివచ్చిన కథానాయకుని వాంఛను.

ప్రయోక్త:
కానీ, నిదురించనిమ్ము తక్షణమే పొమ్ము
ఆలోచన దీపమ్ము. అది తీసుకుపొమ్ము
సుఖనిద్రకు మేలుకొలుపు ఇపుడిపుడే పాపకు

ఆడగొంతు:
వల్లకాదు - ఇది నిద్రకు వేళ కాదు
నవయువకులు మేల్కొనాలి. నామాట వినాలి.

[మేలుకొలుపుల స్వరాలు]

యువకుడు:
కనుమూయకముందే ఏమిటి ఈ మేలుకొలుపు?
కల విచ్చకముందే ఏమిటి ఈ సుడిగాడుపు?

ఆరుద్ర

రెండవ ఆడగొంతు:
సమరసవిత ఉదయించెను
అమరకవిత నిరవెన్నెల
అంతటితో కలమారును
నిలువెల్లా తెలవారును.
సమరసవిత సమరసవిత
సమరవిత ఉదయించెను.

[సైరన్ పట్టుకూత]

యువకుడు:
ఏ విమాన దాడికిది ద్యోతిమ ప్రకటన?
ఏ భయానక సమరానికిది ప్రస్తావన?
ఏమిటి ఈ యుద్ధఘోష? ఏమిటి ఈ సైరన్ హేష?

[విమానాలు తిరుగుతున్నాయి. శతఘ్నులు పేలుతున్నాయి. బాంబులు పడుతున్నాయి...]

యువకుడు:
ఏ దేశం ఏ దేశంపై యుద్ధం ప్రకటించింది.
ఏ రాజ్యం ఏ రాజ్యంపై కరవాలం దూసింది.
ఏమిటి ఈ యుద్ధానికి కారణం.
ఎందుకు ఎందులకీ దారుణ మారణం!

[విమానాలు వెళిపోతున్నవి]

యువకుడు:
సూర్యోదయంలాగ ఆకస్మికంగా ఎందుకీ రాకడ?
మాయంత్రంలాగ తీసుకొంటూ ఎందుకీ ప్రాణ పోకడ?

[సైరన్ విడుపు కూత]

రెండవ ఆడగొంతు:
విలేఖరులు విలోకించండి.
వినాశనాన్ని తిలకించండి.
పడిపోయిన కట్టడాలు
కాలుతున్న గోపురాలు
చీకటిపడ్డ ప్రదేశాలు
చేతులూడిన ఉత్పలమాలలు
కుళ్ళిపోయిన చంపకమాలలు
చనిపోయిన గీతాలు
చెవ్వున కేకసే భావాలు
గొల్లున రోదించే పద్యాలు
బాంబులు పడి పడిపోయే
కావ్యం అతి జాలిబొమ్మ
దాని క్రిందపడి నలిగే
వానిదే కడుయాతనాతిన
క్షణం క్రిందటి పూలతోట
క్షణం పిదప శ్మశానమా?

మొదటి ఆడగొంతు:
క్షణం క్రింద వసంతం
క్షణం పిదప హేమంతం.

రెండవ ఆడగొంతు:
కావ్యం కొనవూపిరిలో
నాగరికత చనిపోవుట,
మరణశయ్యమీదనున్న
మానవత్వమును, కనుగొని
ప్రశ్నలు మరిపించండి
ఇంటర్వ్యూ చెయ్యండి.
విలేఖరులు వీక్షించండి
వినాశనాన్ని తిలకించండి
వార్తలు ప్రసారం చెయ్యండి
ప్రజలకు తెలియచెయ్యండి.

(వైర్‌లెస్ ప్రసారం సవ్వడి)

మగగొంతు: (సాధికారంగా)
వార్తలు చేరాయా? తిద్దుమా చెయ్యండి.
మరణాన్ని మాటలలోకి మార్చెయ్యండి
ప్రమాదాన్ని అందనా వెయ్యండి
గాయాలను లెక్కపెట్టండి
అమాయక ప్రజలు గాథరాపకేటట్లు
అమానుష దర్యలు అచ్చువెయ్యండి

గ్రంథ మహాయుద్ధం

సమర్థిస్తున్న దెవరినో తెలియనీకుండా
సంపాదకీయాలు రాయండి! రాయండి!
ప్రముఖుల అభిప్రాయాలను సేకరించండి
అభిభాషణలను సంపాదించండి
ఉద్ఘాటనలను ఉటంకించండి
పతాక శీర్షికలతో యుద్ధాన్ని
ప్రపంచానికి ప్రచురించండి!

[అచ్చుయంత్రాల మ్రోత]

మగగొంతు: (పాధికారంగా)

దిన పత్రిక వెలువడిందా?
జనులంతా కొంటున్నారు.
తాజావార్తలున్నాయా?
తహతహలాడుతున్నారు.
దినపత్రిక బజారులో
వెనువెంటనే అమ్మండి.

[రహదారిలో రద్దీ - కార్లూ సైకిళ్లు]

పేపర్లమ్మేవాడు:

దైనిక సమాచారం! దైనిక సమాచారం!
వెలరెండు తిణాలు అవి రెండు అణాలు
దైనిక సమాచారం! దైనిక సమాచారం!

మగగొంతు: (అధికారంగా)

మన పత్రిక బాజా మరొక సమయంలో
వాయించు
జనసష్టం ఎలుగెత్తి ప్రకటించు! యుద్ధాన్ని
పచరించు
సమరవార్తలు కావాలంటే మన పత్రికలో
చదవమను
శాంతి కాంతి కోరుకొంటే మనపత్రికే
చదవమను
అమ్మకం అధికంగా చెయ్యకూడదురా
ఓరిమూర్ఖా
సమ్మకం కలిగేటట్లు చెయ్యాలిరా పేపర్లమ్మే
వాడా!
జనసష్టం గొంతెత్తి నినదించు! యుద్ధాన్ని
ప్రచురించు
మన పత్రిక బాజా ఈ సందర్భంగానే తొద్దిగా
వాయించు.

పేపర్లమ్మేవాడు:

దారుణ యుద్ధంగురించి దైనిక సమా
చారంలో చదవండి
మారణహోమంగురించి మా పత్రికలోనే
చదవండి
శాంతి సమావేశాలను సమగ్రంగా ప్రచు
రించాం
శాంతంగా క్రాంతి - మువ్వ సచిత్రంగా
వివరించాం
దైనిక సమాచారం! దైనిక సమాచారం!
జనావళి విచారం! విశేష ప్రచారం!
వెల రెండుతిణాలు! అవి రెండు అణాలు
దారుణ సమాచారం! దైనిక సమాచారం!

యువకుడు:

ఆపత్రిక ఒకసంచిక నాకిస్తావా?
ఈయుద్ధం కారణాలు వివరిస్తావా?

మొదటి ఆడగొంతుక:

అబద్ధాలు విరజిమ్మే ఆపత్రిక నమ్మకు

పేపర్లమ్మేవాడు:

మాపత్రిక మంచిది.

మొదటి ఆడగొంతుక:

—అయినా మాకమ్మకు.

యువకుడు:

ఒక్కసారి ఆపత్రిక ఒక్కసారి చదువుతా
ఇక్కడి ఈయుద్ధానికి కారణాన్ని చదువుతా

మొదటి ఆడగొంతుక:

చదివినచో నీ హృదయం ఒక్కుమ్మడి
పగులుతుంది

యువకుడు:

చదువని వాడజ్ఞుండగు! వేగంగా చదువుతా

పేపర్లమ్మేవాడు:

దైనికసమాచారం! దైనికసమాచారం!
అపచారం! చదువకపోతే మహాపచారం!

యువకుడు:

ఏదీ ఆపత్రిక

మొదటి ఆడగొంతుక:

అది విషపాత్రిక

యువకుడు:

అయినా అది గ్రోలుతాను

మొదటి ఆడగొంతుక:

వద్దు వద్దు వేడుతాను.

యువకుడు:

ఏమో అది చదువుతా చదివించే నమ్మతా
నీకీ జీవితమిస్తా
నాకీ పత్రికను వేగ నయముగనిమ్మ

మొదటి ఆడగొంతుక:

నీకే! నే చెప్తున్నా!

పేపర్లమ్మేవాడు:

నీకెందుకు మాదు గొడవ నేరుగపోమ్మ!

ఆడగొంతు:

కొన్నావు - విన్నావు కాదు
చదివావు - నీకు మోక్షంలేదు

మొదటి యువకుడు:

ఆఁ! ఇదేమిటీ శాపం!
పుస్తకాల కెందు కింతకోపం?
మాకవి అందుబాటులో లేకపోవడానికి
మానవులేంచేశారు, మా నవ్యులేంచేశారు.

ఇంకో ఆడగొంతు:

ఇకమీదట పుస్తకాలు—ఇలలో దొరకవ్
ఇకమీదట ప్రబంధాలు వినిపించకవ్
ఇకమీదట గ్రంథాలు అమృతం చిలకవ్
నవయువకా! నవయువకా! తెలుసుకో
నేను సంస్కృతిని, సతిని,
ఈవార్త పత్రికలో దొరకదు
ఈ వార్త నీచెవులు నమ్మవు.
మానవజాతిమీద అంటే నీమీద
మా పుస్తకాలు యుద్ధాన్ని ప్రకటించాయి.

((ప్రళయ సంగీతం - క్షణం విరామం)

[యుద్ధ సంగీతం]

ప్రయోక్త:

గ్రంథసైనిక కార్యాలయంలో
కాకలు తీరిన పుస్తక నేతలు
సమావేశమయి, సంహార వ్యూహారచన
సాగించిరి - వీరకంకణాలు ధరించిరి
గ్రంథయోధులు వీరగంధము తీసిరి
లలాటాన వీరకుంకుమ పెట్టిరి
అతిరథులు మహారథులు ఆజ్ఞలు జారీచేసిరి

గ్రంథ నేత:

గ్రంథయోధులారా! హుషారు హోషియారు!

గ్రంథాలు:

తయారు. సమరానికి మేము తయారు!

గ్రంథ నేత:

గ్రంథయోధులారా! మానవులపై విరుచుకు
పడండి
వారికి అర్థమవకండి - వారికి చిక్కకండి
కొండమైనా లొంగకండి - కించిత్తయినా
బోధపడకండి
వాక్యాలలో కర్తకర్మలను విడతియ్యండి
విరామ చిహ్నలను నిర్మూలంచెయ్యండి
సంధులను చెడగొట్టండి సాగించండిసమరం!
గ్రంథయోధులారా! హుషారుహోషియారు!

గ్రంథాలు:

తయారు. సమరానికి మేము తయారు!

గ్రంథ నేత:

తల్లీపిల్లలను విడతీసినట్టు వాగర్థాలను వేరు
చెయ్యండి
మాటలనోళ్లు కట్టెయ్యండి, సమాసాలను
సంకరం చెయ్యండి
సామాన్యులను చికాకు పర్చకండి
అసామాన్యులకు కూడా అర్థంకాకండి!
విజ్ఞానాన్ని ప్రసాదించే పుస్తకాలు వినాశ
నానికి దారితియ్యాలి
వివేకాన్ని ఇవ్వవలసిన పుస్తకాలు
అవివేకాన్ని ప్రసాదించాలి?
విద్యార్థులకి చదువుమీద ఆసక్తిని పోగొట్టాలి
గ్రంథయోధులారా! హుషారుహోషియారు.

గ్రంథాలు:

తయారు! మేము సమరానికి తయారు!

గ్రంథ నేత:

మానవులతో సమరం-మహాప్రమాద భరితం!
మనలో కొందర్ని వారు యుద్ధఖైదీలుగా
బంధింపవచ్చు
బంధింపబడిన గ్రంథాలచేత చాకిరీ చేయించు
కోవచ్చు!
అటువంటి సమయాల్లో ఆత్మగౌరవాన్ని
చంపుకోకండి

మన నాయకుల్ని మానవులు అవమానం
చేయడం మరువకండి
మానవ నేతలు మన నాయకుల్ని నిషేధించడం
మరువకండి
నియంతలు మనల్ని నిర్ధూమధామం చేయడం
మరువకండి
గ్రంథయోధులారా హుషారుహోషియారు!
కత్తులుదూయండి-కదనరంగంలోకిఉరకండి!
కనికరించకండిమానవులను!కత్తులుదూయండి
మాటల మెషిన్‌గన్నులు తీయండి - పదాల
బాంబులు వెయ్యండి
మానవులను కనికరించకుండా మన సమరం
సాగించండి.

(సమరఘోష - క్షణం విరామం)

ప్రయోక్త:
దురహంకారులైన నియంతలు
అహం పెరిగిన అధికారులు
తమచర్యల ఖండించే కృతులను
ప్రజలను మేల్కొలిపే కావ్యప్రతులను
అణచేందుకు నిషేధించిరి
అణగనిచో తగులపెట్టిరి.

రెండవ ఆడగొంతు:
అవును అందుకే మాకోపం
అవును అందుకే మాయుద్ధం.
మాలోని గొప్పతనం
పాలకులకు తెలియదు

★ గ్రంథ మహోయుద్ధం ★

మాలోని మంచితనం
మహనీయులకే తెలుసు!

ముసలిగొంతు!

ధర్మములలోన నుత్తమ
ధర్మము కావ్యము నిజంబు ధర
నెవ్వనికా
ధర్మము చేకుఱు నతడు సు
ధర్మను వసియించు బెక్కుదైవత
యుగముల్ ...

రెండవ ఆడగొంతు:

కావ్యం కాంతికి మూలం
కావ్యం క్రాంతికి సాధనం
కావ్యం భ్రాంతి విచ్ఛేదకం
కావ్యం శాంతికి సన్మార్గం
కావ్యాలను తగులపెట్టే జాతిని
కనికరించబోము మేము
కృతికన్యల నపహరించేవారికి దు
ర్గతి విధిస్తున్నాము మేము
కావ్యకాంతలను చెరబట్టినవారిపై
కరవాలం ఎత్తుతున్నాము మేము
మమ్మల్ని ఉసురుపెట్టినందుకు
మా సహాయాన్ని ఉపసంహరించుకున్నాం
మానవజాతిని చీకటిలో ముంచి
మా కోపాన్ని తీర్చుకొంటున్నాము మేము.

యువకుడు:

తగదు! తగదు!
అధికారులు చేసినదానికి
అందరిపై కినుకతగదు
నియంతల దుశ్చర్యలకి
నేను బాధ్యుణ్ణి కాను
నాకు విజ్ఞానం కావాలి
నాకు విద్య కావాలి.

ముసలిగొంతు:

విద్యయశస్సుభోగకరి విద్యగురుండు
....

యువకుడు:

పుస్తకాలు లేనిచో ఎందుకు నా బ్రతుకు
సమస్తాన్ని తెలుసుకో నేసాధనమే చదువు
చదువుచెప్పే పుస్తకాలు సమరం సాగిస్తే
బ్రదుకలేను బ్రదుకలేను మరణించుటయే
మేలు!

మొదటి ఆడగొంతు:

గ్రంథాలు లేనంతమాత్రాన జీవితాన
అందాలు లేకపోతాయా?
గ్రంథాలు లేనంతమాత్రాన కాలగతి
మందగించి ఆగిపోతుందా?
సుందర నందన మందున
మందానిలమునకూగే కుసుమాలున్నవి!
కందర్పుని రాణినిమించు
కుందనంపు బొమ్మవంటి కులుకులాడియున్నది
మందార వనాంతరాన
చందమామ ప్రతిఫలించు సరోవరమున్నది
చెందామరపూలున్నవి సుందరి నీచెంతకలదు
గ్రంథాలు లేనంతమాత్రాన జీవితాన
అందాలు లేకపోతాయా!

యువకుడు:

నీకు తెలియదు సుందరీ!
నీకు తెలియదు
అలనాడు సోమకాసురుడు
చదువులను దొంగిలించితే
జలచరమై పరమాత్ముడు
అవతరించినాడెందుకు?
ఆ ప్రళయం ఆ విలయం
మళ్ళా తలయెత్తుతోంది
ఆ చీకటి ఆ ఆపద
మళ్ళా ప్రభవించుతోంది
మత్స్యరూపమెత్తి అపుడు
మనల బ్రోచినట్టి వాడు
ఈ సమరం ఆపలేడు
శాంతిపథం చూపలేడు.

ముసలి గొంతుక:

"సాధీయో ముఖపూరితోద్యమిత
తానతోర్ధ్వ గోదన్వద
ర్ఘోథాతాంతరటత్తిమింగిలగిలప్రోద్ధా
ననిభ్యానల
ధ్యాధీశప్రభుతాన్వభాగ హారణా
ధ్యాయాయి నాథానుణ
ప్రాదాన్యాంక విలోల వాగ్ద్రాగ్బట
బ్రహ్మాంస్తుమస్త్యామునున్"

యువకుడు:

ప్రార్థించి ఏం ఫలం
ప్రయత్నాలు విఫలం
ప్రయోజనం శూన్యం
పుస్తకాలు అంతరించి
అక్షరాలు నశిస్తాయి!
అక్షరాలు నశిస్తాయి
అక్షరాలు నశిస్తాయి!

ముసలిగొంతుక:

"అక్షరంబు వలయు కుక్షిజీవనులకు
నక్షరంబు జిహ్వ కిక్షురసము
అక్షరంబు తన్ను రక్షించు గావున
నక్షరంబు లోకరక్షితంబు"

యువకుడు:

ఇప్పుడేమిటి సాధనం?
ఇపుడేమిటి సాధనం?
పుస్తకాల ప్రతినిధీ! అనుపమ దయానిధీ!
విజ్ఞాన పయోనిధీ! ఉపదేశం చెయ్యి!
నీ చెప్పిన చొప్పున నేతప్పక చరియిస్తా
ఈ యుద్ధం విరమించి ఉపదేశం చెయ్యి!

రెండవ ఆడగొంతుక:

అధికారుల అహంకారం
ఆపేందుకు నడుంకట్టు
నియంతల దౌర్జన్యం
నిలిపేందుకు ప్రయత్నించు
పుస్తకాలు నిషేధించే
శాసనాలు రద్దయితే
గ్రంథాలను తగులబెట్టు
దుశ్చర్యలు చాలిస్తే
మానవులను కనికరించి
మాయుద్ధం ఆపుతాం!

యువకుడు:

జంకువదలి శంకవదిలి
శంకణాన్ని కట్టుకొని
నియంతలను ఎదిరించనీ
భయం వదలి సాగుతా!
(వీరరస సంగీతస్వరాలు: క్షణం విరామం)

యువకుడు:

న్యాయవేత్తలారా!
అధికారిని ఆక్షేపిస్తున్నా!
పుస్తకాల భ్రూణహత్య చేసినందుకు
అభియోగం తెస్తున్నా
విచారించి తీర్పుచెప్పండి
పుస్తకాలతో సంధిచేయండి
దురహంకారుల శిక్షించండి!

శాంతమైన గొంతుక:

నియంతా! నీమీద అభియోగం వచ్చింది.
పుస్తకాలు నువ్వెందుకు కాల్చేవో మాకు
చెప్పు!

సాధికారంగా గొంతుక:

అవినీతి పుస్తకాలు, అందుకు కాల్చాను.

యువకుడు:

కాదు అవి నీతిపుస్తకాలు.

అధికారంగా గొంతుక:

పేదప్రజల రెచ్చగొట్టుపుస్తకాలు నిషిద్ధాలు

యువకుడు:

రెచ్చినవారిని, రెచ్చి హద్దులు మీరినవారిని
శిక్షించేందుకు
వేరే శిక్షాస్మృతి ఉందికదా!

సాధికారంగా గొంతుక:

కాకవులవిరచితాలు కాల్చేయుట తప్పు
కాదు.

యువకుడు:

కుకవులకు నిర్వచనం ఏమని తమ ప్రవచనం?

సాధికారంగా గొంతుక:

జల్లి పదములు నాలుగు సంతరించి
గురువు విడుచోట లఘువులు గొన్ని గూర్చి

రతిగూడక మీదులు వెదకికొనుచు
చ్చుపొల్లులపై నుంచునతడు కవియా?

యువకుడు:
అట్టివారి పుస్తకాల కాదరణే ఉండదు.
పట్టుకొన్న వెంటనే ప్రజ లవి నిరసింతురు.

అధికారంగా గొంతుక:
కొన్ని కొన్ని పుస్తకాలు కొరకరాని కొయ్యలు

యువకుడు:
అంటే దానికి అర్థం ఏమిటి విశదీకరించు

అధికారంగా గొంతుక!
ప్రజలకు ఆపుస్తకాలుసులభంగాబోధపడవు.

యువకుడు:
బోధపడని పుస్తకాలు ప్రజలెపుడూ చదవరు.
ప్రయోజనంలేనిదాన్ని ప్రజ లెప్పుడూ చదవరు.
ప్రజచదవనిపుస్తకాలునిషేధించడంఎందుకు
ప్రతీతిలేని ప్రబంధాలు తగలెట్టడమెందుకు?

సాధికారంగా గొంతు:
జాతిని నిర్వీర్యపరుచు గ్రంథాలున్నాయి
వాటిని అంతంచేస్తే అందరికీ మంచిది.

యువకుడు:
జాతిని నిర్వీర్యపరుచు గ్రంథాలున్నపుడు
జాతిని ఉత్తేజపరచు గ్రంథాలే విరుగుడు.

సాధికారంగా గొంతుక:
శృంగారం పెచ్చురేగి విహారంచేస్తే?

యువకుడు:
జీవితాన శృంగారం అరీతిగ లేదా?

సాధికారంగా గొంతుక:
సభ్యత కభ్యంతరమైతే

యువకుడు:
న్యాయవేత్తలే తేల్తురు.

[క్షణం విరామం]

యువకుడు:
న్యాయవేత్తలారా! మా వాదన విన్నారు.
పుస్తకాలు పరీక్షించి మీతీర్పును తెల్పుడు.

[ట్రంపెట్ మోత]

తీర్పు: "విషముష్టి విత్తులు, నాభి, నల్లమందు ఉల్లిపాషాణము ఎట్టి చెట్టవస్తువులో ఇవికూడ నట్టి చెట్ట పుస్తకములే యనదగును. వస్తు పరిజ్ఞానము చాలనివారు, వాడవలసిన వరుస నెఱుగనివారు, దురుద్రేకములకు నురియువారు, ధర్మాభిరతి లేనివారు, బాలురు, పామరులు, మూఢులు నట్టి వస్తువులను ముట్టరాదు. ఇట్టి పుస్తకములను గూడ జేతబట్టరాదు. అట్టివారికివి యట్లే నేని యనర్థములు గల్గినను గల్గవచ్చును. ఇక నిట్టి చెట్టతనముగల వస్తువులను, పుస్తకములను జెత్తకుప్పలో జేర్పక యంగళ్ళకు దెచ్చుటేల యమ్మత్తించుటేల అని యాక్షేపమేని యిదిగో సమాధానము. అవియును నివియును గొంత యపాయకరములే యయినను నెక్కువగా నారోగ్యవర్ధకములు, ఆనందదాయకములు నగుచున్నవి. విరుద్ధోపయోగమున విషములే కాని యనోపయోగమున నివి యమృతములు. పండితులా వస్తువులను, నీ పుస్తకములను శుద్ధిచేసి దోషముల దొలగించి వికారము లెసరేగకుండునట్లును, ఆరోగ్యము నానందము నలవడునట్లును వాడుదురు. నాడీశక్తి వశమై నీరసించుచున్న రోగుల నెందఱనో సద్వైద్యులు విషముష్టి విత్తులు మొదలగువానిని వాడదగునట్లు వాడి యుత్సాహబలోపేతుల గావించి యుజ్జీవింప చేయుచున్నారు. వాడి, సముచిత ప్రయోగమువలన శాస్త్రసిద్ధాంత విశేషముల జాలగా గుర్తించుచున్నారు. వాని వినాశమునకు వైద్యులంగీకరింపరు. అట్లే అనుపమాన కవితాహ్లాదమును గల్పించుచు, ననేక ప్రాచీన చరిత్రవిషయముల నెఱింగించుచు, నింక ననేకాపూర్వ శబ్దార్థరహస్యముల నిరూపించుచు, సహృదయ హృదయాహ్లాదకములైన యిట్టి చతురకృతులుగూడ బండితలోకమునకు బహూపకారముగా నున్నవి. వీని నాశపరుచుటకు సరసులగు విద్వాంసులును సమ్మతింపరు."

"నాభి నల్లమందు మొదలగు వస్తువులవలని యనర్థమడగుటకై దొరతనమువారు వాని యుత్పత్తిని మిక్కిలి తక్కువగాను వాని విలువను మిక్కిలి యెక్కువగాను గావించుచున్నారు. కట్టుదిట్టములు నిట్టుగల్పించి యనర్హులచేతికి వాని నందకుండ జేయుచున్నారు" అట్లే ఈ గ్రంథములను గూడ జేయవలయును. *

* వేటూరి ప్రభాకరశాస్త్రి గారు క్రీడాభిరామానికి వ్రాసిన పీఠికనుండి.

[విజయఘంటలు శంఖధ్వని]

యువకుడు:
ఒక ప్రాణిని చంపుట ఎంత పాపకృత్యమో
ఒక గ్రంథము కాల్చుట అంతపాపకృత్యమే
యుక్తాయుక్త వివేచన శక్తులున్న
వ్యక్తులతో సంఘము వర్ధిల్లినచో
గ్రంథహింసయే జరగదు.
అటువంటి సమాజ రచన
అధికారుల కర్తవ్యం.
ఆగమ్యం చేరేందుకు
గ్రంథమే సోపానం.

ఆడగొంతుక:
పుస్తకాల ప్రతినిధీ — నీదే విజయం.
మీ యుద్ధం విరమిస్తే మాదే విజ్ఞానం.


రెండవ ఆడగొంతుక:
దించు లంగరు దీర్ఘయుద్ధము
ధర్మపతాకము ముల్లు చూపెను.

("పవమానా సుతుడు పట్టు" స్వరాలు,)

ప్రయోక్త:
వర్తమాన కాలంలో
మారుమూల గ్రామంలో
ఒక చీకటి గదిలోపల
నవయువకుని మదిలోపల
ఊహాల శృంగాటకాన
అవ్యక్తపు టడవిలోన
జరిగిన అపురూపకం
ఈ కల్పిత నాటకం.

(ఆలిండియా రేడియో ప్రసారితం)

★



సీరియల్

"శారద"

38

పద్మ బందరువచ్చి నాలుగు నెలలు దాటింది. ఆమె కిప్పుడు ఏడో నెల. నెలలు గడిచినకొద్దీ వీరయ్య మోజూ తగ్గిపోతూ వుంది. ఇప్పటికే అతనికి నాలుగువందల రూపాయలు వొదిలి పోయ్యాయి. ఎటుపోయి ఎటువస్తుందో అని పద్మ డబ్బువిషయం జాగ్రత్తపడుతోంది. వీరయ్యని వొదిలి ఎటన్నా వెళ్ళాలనే భావనే రావటం లేదామెకి. అప్పటికే ముట్టుపక్కల కొందరు నారమ్మ ద్వారా పరిచయమైనారు. వాళ్లూ ఏవేవో కారణాలవల్ల ఒళ్లమ్ముకుంటేగాని జీవించలేని స్థితిలో పడ్డవాళ్లే. ఎందువల్లో గాని వాళ్లల్లో ఒక నిర్లక్ష్యభావం ప్రబలిపోయింది. వాళ్ల ప్రతి కదలికలోనూ ఆ నిర్లక్ష్యం గోచరిస్తుంది. మాటలో మాత్రం అతిజాగ్రత్త, భయం కనపడతాయి. మొగవాళ్లని ఆకర్షించటంకోసమే సింగారించుకుంటారు. అందుకోసమే కులుకుతారు, నవ్వుతారు. వాస్తవమైన హృదయానుభూతి మాత్రం ఈ సింగారింపులో, కులుకులో—నవ్వుల్లో కనపడదు.

పద్మకు ఇంకా ఇలాంటి నిర్లక్ష్యభావం అబ్బలేదు. ఆమె ఇంకా వీరయ్యనే అంటిపెట్టుకుని వుంటున్నందువల్ల ఇతరుల్ని డబ్బుకోసం ఆకర్షించాల్సిన అగత్యం లేకపోయింది. కాని వీరయ్య—ఒకనాడు వున్నట్టుండి ఆమె దగ్గరకి రావటం మానేశాడు. నారమ్మే చెప్పింది, 'బావ ఇంక యానాం పోతున్నా'డని. ఆమె నిట్టూర్చింది. ఇప్పుడామెవున్న ఇంటికి అద్దె యివ్వాల్సివచ్చింది! మిగతా ఖర్చులూ మెత్తిపడ్డాయి. మళ్ళీ దిగులుపడిపోయింది. ఆమె దిగులు కనిపెట్టింది పొరుగామె.

"ఎందుకమ్మా అలా కుంగిపోతున్నావు! వీడు కాకపోతే పోయిందా? ఇంకోడూ!" అంది.

పద్మకి పూర్తిగా అర్థమైపోయింది— తనకిక పడుపు వృత్తి తప్ప మరోగతి లేదని. ఆమె నిలవచేసుకున్న డబ్బు కరిగిపోతోంది. పైగా ప్రసవం వుంది. దానికెంతో తతంగంవుంది; డబ్బూ కావాలి.

"మరి నేను నీళ్ళాడి తెరిపపడ్డాక కదా, ఇంకో దారి" అందామె. ఇప్పటి కామెకి అక్కడి వాతావరణం అర్థం కావటమే కాక, అక్కడి భాషకూడా వచ్చేసింది. అది తెలుగే; అయినా ఆ వృత్తికి సంబంధించిన ప్రత్యేక పరిభాష అది.

"అన్నిటికీ వొప్పుకుంటేనే వస్తారు లేద్దూ, కంగారు పడకు". అంది అవతలామె, ధైర్యంగా, నిర్లక్ష్యంగా.

"మరి అందాకా, కూడూ?"


స్నేహితురాలు ఏదో జ్ఞాపకం తెచ్చుకుంది. "మరిచిపోయి నాను. వస్తాదు ఒకడు మా ఇంటిముందునుంచి ప్రతిరోజూ తిరుగుతున్నాడు. సాయంత్రం, కిటికీలోనుంచి చూడు. వంటరే వస్తాడు. దిట్టంగా లావు. ఒక్కడే అయిపోతాడు" అంది. పద్మ ఆలోచనలో పడింది.

ఆమెకి అప్పుడప్పుడు దిగులుతో ఏడుపు వస్తూవుంటుంది. తను అధోగతిపాలయింది. తప్పు చేస్తోంది, సరే, తెలిసే చేస్తోంది. కాని ఆ తప్పువల్లనైనా తను మనసార వలచినవాడు దక్కలేదు. తను ఎంతో అసహ్యించుకునే దౌర్భాగ్యులకు శరీరాన్నమ్ముకో వల్సి వస్తోంది. ఇదొక విషవలయంలాగుంది. ఒకడుపోయి ఇంకొకడు. మోజుతీరగానే పాతవాళ్ళు విసర్జించినంత నిర్లక్ష్యంగా వొదిలేసిపోతారు. ఆమెకి కోపం అసహ్యం కలుగుతోంది. వీళ్లని కాలికింద చీమల్లా నలిపి పారెయ్యాలి. గుప్పిట్లో పెట్టుకుని కోతుల్ని ఆడించినట్టు ఆడించాలి. తన సౌందర్యానికి గల శక్తిని కసిగా ఇలా అన్నా వుపయోగించుకోవాలి! కిటికీదగ్గిర నిలబడి తల దువ్వుకుంటూ రోడ్డువేపు చూసింది. దక్షిణపు గాలికి జుట్టు వొయ్యారంగా ఎగురుతోంది మెల్లిగా. రోడ్డు విశాలమైంది కాదు. సన్నని ఇరుకుసందు. ఎదురుగుండా కాంపౌండ్ గోడమీద సినిమా పోస్టర్లు, [illegible] మాత్రల ప్రకటన కనపడుతున్నాయి.

వస్తాదు గోవిందు వచ్చాడు. "వీరయ్య ఎల్లిపోయాడంటగా!" అన్నాడు; ఆమెను ఎగాదిగా చూశాడు. అతనికి అర్థమైంది ఆమె స్థితి. "పాపం-" అనికూడా అనిపించింది, అతనిలో ఏకొద్దిగానో మిగిలివున్న మానవత్వం.

"ఆస్పత్రిలో చేరిస్తే సరిపోదూ—నాలుగురోజుల భాగ్యం! దీనికి జడిసి పారిపొయ్యాడూ వీరయ్య! మరేం కంగారుపడకు" అన్నాడు.

మరో రెణ్ణెల్లకి ఆమె ఆస్పత్రిలో చేరింది. ఒకరోజు



బొంబాయి
—ఫొటో: పి. సి. యమ్. ఈశ్వరబాబు.

రాత్రిపదకొండింటికి ఆడపిల్లను కన్నది. వస్తాగేరోజ్దైలనీ, కాఫీలనీ ఆమెకి కావల్సినవన్నీ సప్లై చేస్తున్నాడు. పద్మ పసిపాపని చూసుకుని మురిసిపోయింది. చిన్ని చేతులూ, ధగధగ మెరిసే కళ్లు, జుట్టూ, ముక్కూ, నోరూ అంతా ఆ డాబావాడి పోలికే. పాపకి పాలిస్తూవుంటే ఆమెకి, ఈ లోకాన్నంతా ఏలే చక్రవర్తినికుండే అంత సంతోషం కలుగుతోంది. పదోరోజే ఆస్పత్రినుంచి పంపేశాక వస్తాదు సుబ్రహ్మణ్యంపిమోద ఆమెని మినర్వాటాకీసుదగ్గిర డాబాలోకి తీసుకెళ్లాను. చెప్పొచ్చాడు; పద్మ స్నేహితురాలు సత్యవతి. ఆమె కెంతో సహకారంగా వుంటోంది.

ఆమెకి ఈ మనుషులదయ చూస్తూవుంటే, ఎంతో ఆశ్చర్యం వేస్తోంది. సత్యవతి కూడా ఏరోజు కారోజు శరీరం తాకట్టుపెడితే గాని జరుగుబాటు లేని 'పతిత'. అయితే ఏం? ఆమె మనస్సులో మృదుత్వం దయాదాక్షిణ్యాలు పోలేదు; మానవత్వం నశించలేదు. వస్తాదు ఆర్నెల్లుగా తనను భరిస్తున్నాడు వీరయ్యపైన అతనికి జలసీకూడా లేదు. ఆమెపైన అపనమ్మకం లేదు; ఆమె ఎవరు ఎట్లాంటిది అన్న ప్రశ్న ఉదయించదు అతనికి. ఈ వాడలో మొగవాళ్ళందరూ అంతేనేమో!

39

భాస్కర్రావు మామగారున్న ఇంట్లోనే కాపరం పెట్టాడు. మామా అల్లుడూ తెచ్చే సంపాదన రెండుకుటుంబాలూ సమష్టిగా పంచుకుని సర్దుకుంటున్నాయి. భాస్కర్రావు అరుణల దాంపత్యం వారి చిలిపితగాదాలు చూసి సుందరంగారు పరమానందభరితుడౌతున్నాడు. ఎప్పుడూ తగాదాలేకుండా వుండాలని భాస్కర్రావు ప్రయత్నిస్తాడు. అరుణ నోరుమాత్రం కొంచెం పెద్దది. అయితే ఈచిల్లర తగాదాలు ఉభయులమధ్య ప్రేమను అడ్డరావు

"మేస్తారూ" అంటుంది అరుణ, వెటకటిమ్లోనే.

"ఏం ఏంపనొచ్చిందిప్పుడు?"—భాస్కర్రావు

"మరేమీ లేదండి. మన పెళ్లయి ఎన్నాళ్లయిందో తెలుసా?"

"బాగా గుర్తుంది ఏణ్ణర్థం అవుతుంది"

"ఇంతకాలంనించీ ఒక్కసినిమాకన్నా తీసుకెళ్లారూ?" నేరస్థుణ్ణి విచారించే జడ్జీలా అడిగింది

"మన ఆర్థికస్థితిగతులలో..." భాస్కర్రావు వివరణ చెప్పబోతున్నాడు.

"మన ఆర్థికస్థితి ఇంకెప్పుడు బాగుపడుతుందంటారు మేష్టారూ?" నిలవేసింది భార్య.

భాస్కర్రావు నవ్వాడు. 'ఏం ప్రశ్న అరుణా? మన ఆర్థికస్థితి బాగుపడ్డం అంటూ ఒకటివుందా? ఎల్లకాలం ఇలాగేవుంటుంది. అంటే మన జీవితంలో నని అర్థం!"

"ఎందుకనండి? దాన్ని మార్చటానికి మీ రెందుకు ప్రయత్నం చెయ్యకూడదు?"

"మార్చటమా? ఎవరివశం? సమాజేదుసంచార కంట్రోలు రేటుకు సంపాయిస్తే, అక్కడికి నేను సోషలిజం సాధించినంత పనవుతోంది. అందరూ ఎనిమిది గంటలుపని చెయ్యాలని రూలుంది.

కాని అమలు చేసేవాడెవరు? ఆదివారాలైనా, షాపుకొట్లకు విశ్రాంతి కావాలిగనక మాకూ శెలవ ఇస్తున్నారు. ఇంక ఈ లక్షణంలో నేను సమాజాన్ని మార్చేదేమిటి? నా ముఖం!"

"ఎబ్బే! వీరుల లక్షణం ఇది కాదుసుమండీ!..." నవ్వింది అరుణ.

"నవ్వుతావు అరుణా! అందరూ కలిసి వీ ఉద్యమం తెచ్చినా, దాన్లో చేరటానికి నేనూ సిద్ధమే. నా సంగతి తెలియదూ."

"నాకు తెలియకపోవట మేమిటండీ? ఇంతకీ ఆ సినిమాకి ఇవ్వాళ ఎలాగైనా వెళ్ళాలండి!"

"ఎట్లా?"

"ఎట్లాగో—నా కట్లా తెలుస్తుంది!"

"నీకు అట్లాంటివి ఎందుకు తెలుస్తాయి? సినిమాకు పోవడం, కొత్త చీరెలు కట్టడం తెలుస్తాయిగాని."

"అయితే ఆడవాళ్ళుకూడా సంపాదించడం నేర్చుకోవా లంటారా ఏం?"

"తప్పేమిటి? అట్లా కాక పోబట్టిగాదూ, మనబోటి కుటుంబాలింత దుర్గతిలో వుండటం? ఒక్క మొగవాడి సాహేతీన్ సంపాదనమీద పలుగురూ ఆధారపడడం, రెండు రోజులు ఏకాదశీ, నొక్కపూట ద్వాదశీ కావటమూనా! అలా కాకుండా, ఆడవాళ్ళూ భాగస్వాములుగా సంపాయించటం అంటూ ఏర్పడితే........" భాస్కర్రావు ముగించకముందే, అరుణ అడ్డం వచ్చింది.

"ఆడవాళ్ళే సంపాయించటం మొదలెడితే, ఇక మొగవాళ్ళు వంటే మా చేస్తారుగా! నాస్తారూ! ఈ కబుర్లకేం గానీ, ఇంతకీ ఇవ్వాళ సినిమా వుందా లేదా?"

"తీసుకెళ్తాలే! ఊరికే పొడియం వేసినట్టు వేపకు నన్ను" అంటూ భాస్కర్రావు లేచిపోయినాడు. సినిమా అంటే మాటలా! రెండు రూపాయలు వొదిలిపోతాయి. ఈ సంవత్సరన్నరబట్టి కాపరం చేస్తుంటే, దుబారాగా ఒక్క కానీ ఖర్చు చెయ్యకుండా నెట్టుకొస్తూ వుంటేనే, పరువుగా కాలం వెళ్ళడం కష్టంగా వుంది. అందుకనే తను అప్పుడప్పుడు కాల్చే సిగరెట్లుకూడా మానేశాడిప్పుడు. కాని భార్య సరదాల్ని అతడేమీ నిరసించటం లేదు—నెరవేర్చే తాహతు లేకగాని. ఇంకో నాలుగు నెలలకల్లా, తన భార్య ప్రసవిస్తుంది. ఆమె కోర్కెలు తీర్చటం అవసరం. మామగారికి చెబితే సరి. ఇది ఉమ్మడి కుటుంబమాయె. తన చేతిలో కానీ లేదు.

మధ్యాహ్నం మామగారితో సినిమాప్రస్తావన తెచ్చాడు భాస్కర్రావు. కూతురు అదివరకే అప్లికేషన్ పెట్టివుండటంతో, "వెళ్ళండి నాయనా. నన్నడిగే దేమిటి? ఇదిగో, ఈ రెండురూపాయలూ తీసుకెళ్లు. దాన్ని వదిలించకు. సరా." అన్నా డాయన.

మొదటాటకు భాస్కర్రావు, అరుణ, అరుణ తమ్ముళ్లిద్దరూ కలిసి బయల్దేరారు. గుర్రబ్బండిమీద దుర్గాకళామందిరానికి వెళ్లారు. భాస్కర్రావు పెద్ద బావమరిదికి డబ్బులిచ్చి టిక్కెట్లు తెమ్మని పంపి, తను జనసమూహంకేసి చూస్తూ నుల్చున్నాడు. జనసమూహంకనపడితే ఎప్పుడూ పిన్నికోసం వెతకటం అలవాటయిందతనికి. పిన్ని ఆరోజు కృష్ణకి వెళ్ళినప్పుడు ఎలావుందో, అలాగే గుర్తు పెట్టుకున్నా డతను—జుట్టు వొదులుగా ముడేసుకుని, ఆకుపచ్చంచు రంగుగల చీర, వొంటికి బాగా అంటేట్టు కట్టుకుని, దిగులుగావున్న పిన్ని ముఖవర్చస్సు, స్వరూపం అతనికి బాగా గుర్తు.

టిక్కెట్లు వచ్చాయి. అరుణ, చిన్నబ్బాయి, ఆడవాళ్ళ



బొంబాయి

—ఫోటో: పి. సి. యమ్. ఈశ్వర బాబు.

గేటుగుండా లోపలికి వెళ్లారు. భాస్కర్రావు, పెద్ద బావమరిదీ థియేటర్ లోకి వెళ్ళి కూర్చున్నారు. భాస్కర్రావు చిత్రంలో లీనమైపోయినాడు. ఇంటర్వల్లో చుట్టూ చూశాడు భాస్కర్రావు. ఆడవాళ్ళకేసి మరీ పరీక్షగా చూశాడు. తన పిచ్చిగాని, పిన్ని ఇంకా బతికేవుందా! అయినా చచ్చిపోయిందీ అని నికరంగా తెలియనంతవరకూ ఆశ వదల్దు.

తిరిగీ థియేటరులో చీకటి ఆవరించబోతూవుంది. టీ, కాఫీల కేకలు తగ్గుతున్నాయి. భాస్కర్రావు తనవెనక రిజర్వుసీట్లలోకి చూశాడు;......అక్కడ...ఆమె...పిన్నే! కాని...నిజమేనా! పరిగెత్తుకెళ్ళి అడుగుదామా, అనుకున్నాడు. ఇంతలో దీపా లారిపోయాయి. భాస్కర్రావు వూపిరి బిగబట్టుకుని కూర్చున్నాడు. ఆమె పక్కనే, ఎవరో ఒక్క బల్పుగా కొంచెంపొట్టిగావున్నాడు- కూర్చున్నాడు. ఆమె కానట్టుందే! పిన్ని మొహం ఇంకా లేతగా వుండాలే!...ఈమె మొహం కొంచెం ముదురుగా వుంది!...... ఒంటినిండా నగలు మెరుస్తున్నాయి! ఆమె కాదేమో! పోలికలు ఒకలాగే వున్నవా కొంపదీసీ ఏదా? బెజవాడలో వుండి తనదగ్గరికి రాకుండా వుంటుందా?

సినిమా వొదలకముందే బైటికి వెళ్ళి నుల్చుని చూడాలి, తేలిపోతుంది. దగ్గరికెళ్ళి అడగాలంటే సిగ్గు. వాళ్ళెవరో ఏతే నవ్వుతారు, కొంతమంది కొప్పడివచ్చు కూడా.

సినిమా వొదలటానికి కింకా పది నిమిషా లుండగానే కుర్రాణ్ణి, 'రాను బావా' అంటున్నా బైటికి లాక్కొనివచ్చాడు భాస్కర్రావు. రెప్ప వాల్చకండా, చూస్తూ నుల్చున్నాడు గేటు దగ్గర. సినిమా వొదిలారు. జనం మెల్లిగా గుంపులు గుంపులుగా జంటలు జంటలుగా వెళ్లిపోతున్నారు. అరుణ వచ్చింది. హాలు ఖాళీ ఐపోయింది. ఆమె కనపడలేదు. భాస్కర్రావు నొచ్చుకున్నాడు, దగ్గరికి వెళ్ళి అడగనందుకు. మళ్ళీ పిన్ని కాదేమో అనిపించింది. తను, ఆమెని చూసినప్పుడు ఆమెకూడా తనవంక చూసినట్టు జ్ఞాపకం. ఆమె పిన్ని ఐతే! తనని గుర్తుపట్టి పోలుబైట చూసేది కాదా? భాస్కర్రావు తన భార్యతో ఇదంతా చెప్పాడు. ఆమె చప్పరించేసింది. "ఆమే ఐతే, మిమ్మల్ని గుర్తుపట్టేవుండేది; పలకరించేది మీస్తారూ! మీకు పిచ్చి. పదండి పోదాం, ఇప్పటికే పదవుతోంది" అంది. భాస్కర్రావు నిరాశతో బైలుదేరాడు. అతని కళ్ళముందు, వొంటినిండా ధగధగ మెరిసే నగలతో, రాణీలా కళకళలాడుతూ పిన్నే కనిపిస్తోంది. ఆమె బెజవాడలో నే వుంటే కనపడకపోదు—అని తీర్మానించుకుని, మనస్సు సమాధాన పర్చుకున్నాడు.

[ఇంకా వుంది]

మా మామయ్య


వా. స. మూర్తి

మా మామయ్య పదహారణాల ఆంధ్రుడు — అవునా కాదా అనేది వివాదాస్పద విషయమే ననుకోండి. అయినా మా మామయ్య తాను పదహారణాల ఆంధ్రుణ్ణే అని చెప్పుకుంటాడు. మా మామయ్య ఆంధ్రత్వం ఆవేళ గట్టిగా గాడ్పులు వీచినా, సమయానికి వర్షం కురవకపోయినా దీనికి అరవలే ఏదో చేసి ఉంటారనేటంత ధోరణిలో చీటికీ మాటికీ అరవలను తిట్టడంలోనూ, ఎంతటి నాయకుడైనా ఉట్టి వెధవ అనడంలోనూ ముఖ్యంగా వ్యక్తమవుతూ ఉంటుంది. అరవల సొంత తిండైనా అరవల ఇడ్లీ, సాంబారు లేనిదే మామయ్యకు రోజు గడవదు. ఇదేమిటని ఎవరైనా అడిగితే ఇడ్లీ అసలు మన మినపకుడుములే ననీ, అరవదేశానికి పోయి ఈ రూపంలో తిరిగివచ్చాయనీ, అలాగే సాంబారు కూడా మన పప్పుపులుసే ననీ కాబట్టి తాను తినేవి మినపకుడుములూ, పప్పుపులుసే నని చెప్పి తన ఆంధ్రత్వం మీద మచ్చపడకుండా చూసుకుంటాడు. తన పదహారణాల ఆంధ్రత్వానికి ఇంకొక ప్రబల నిదర్శనంగా ఆంధ్రరాష్ట్రంకోసం జరిగిన ఉద్యమంలో తాను పాల్గొనడం చూపిస్తాడు మామయ్య. పొట్టి శ్రీరాములు గారి పూర్ణాహుతి సందర్భంలో జరిగిన కల్లోలంలో తనూ ఉన్నాడు. ఆ వేళ తుపాకి గుండ్లకైనా సిద్ధపడి ముందుకువచ్చానంటాడు మామయ్య — ఆ వేళ తుపాకి కాల్పులవరకూ వ్యవహారం వస్తుందంటే అసలు వీధిలోకి అడుగుపెట్టేవాడా అనేది అనుమానమే కాని — ఆనాడు కల్లోలం లేవదీసిన గుంపులలో మాత్రం ఉన్నాడు. అందువల్ల తాను తుపాకిగుండ్లకు గుండె చూపి నిలబడ్డానంటే మనం ఒప్పుకోవలసేవస్తుంది. ఈ సందర్భంలో ఆరోజే ఇంకొక చిన్న విషయం జరిగింది. దాని సంగతి మా మామయ్యకూ, నాకూ, ఈ ఊరి అరవ హోటలు ప్రొప్రయిటరికీ, ఒక సెర్వర్‌కీ తప్ప మరొకరికి కూడా తెలియదు.

ఆ వేళ మామయ్య గుంపులతోబాటు తిరుగుతూ 'ఆంధ్రరాష్ట్రం కావాలి', 'పొట్టి శ్రీరాములుకు జోహార్', 'ఆంధ్రమాతాకీ జై' అంటూ అరుస్తూ ముందుకుపోసాగాడు. జనం కొట్లూ బజార్లు ఆపివేస్తున్నారు. దుకాణాలు మూయించివేస్తున్నారు. ఈ హడావుడిలో నా మామయ్య దృష్టి ప్రక్కనున్న అరవహోటలుమీద పడింది. ఆ హోటలు ప్రొప్రయిటరు అప్పటికే హడలిపోయి, తలుపులు వేసుకొని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఒకమూల నక్కి చూస్తున్నాడు. మామయ్యకు అరవహోటలు చూసేసరికి వీరావేశమెత్తుకువచ్చింది. 'ఈ హోటలుమీద పడదాం రండ్రా' అని అరిచాడు. కాని జనం కొట్లనాపుజేయడంలోనూ, కేకలు వేయడంలోనూ మునిగిపోయి మామయ్య మాట వినిపించుకోలేదు. ఇంతలో వెనకనుంచి ఎవరో లాల్చీ పట్టుకొని లాగారు. మామయ్య అదిరిపడి వెనక్కి తిరిగాడు. అరవహోటలు ప్రొప్రయిటరే. 'తమతో ఒక చిన్నపని ఉందండి, ఇలా రాండి సార్' అని పిలుచుకు వెళ్ళి దొడ్డిదైపునుంచి లోపలకు తీసుకుపోయి, మామయ్యను కూర్చోబెట్టి డజను ఇడ్లీ, గిన్నెడు సాంబారూ ఎదరపెట్టి, "నామీద దయ ఉంచండి సార్, బ్రతికి ఉన్నంతకాలం మీపేరు చెప్పుకొని బ్రతుకుతాను సార్. మా హోటలుమీదికి జనాన్ని రానీయకండి సార్, మీరు చాలా మంచివారని నాకు తెలుసు సార్," అంటూ బ్రతిమాలడం మొదలుపెట్టాడు. ఎదర ఇడ్లీ కనిపించినప్పుడు వాటిని అలాగే వదిలివేయడంకన్న మరొక అపచారం ఉండదని మామయ్య సిద్ధాంతం కాబట్టి, ఆ డజను ఇడ్లీలు సాంబారుతో ఆరగించి, గుర్రున త్రేన్చి, "సరే నీకేం పరవాలేదులే. నేను చూస్తాను" అంటూ తన ఔదార్య బుద్ధినంతా ప్రదర్శించాడు.

అది మొదలుకొని మామయ్య కాఫీహోటలులో ఫ్రీయే. హుషారుగా ఉంది మామయ్య పని. కాని కొంతకాలం గడిచాక ప్రొప్రైటరు ఎదురుతిరిగాడు. మామయ్య మామూలుగానే ఇడ్లీ సాంబారు సేవించి వచ్చివేస్తున్నాడు. ప్రొప్రయిటరు 'డబ్బులుసార్' అన్నాడు. మామయ్య ఉలిక్కిపడ్డాడు. తన చెవులను తానే నమ్మలేకపోయాడు. 'ఏమిటే' అన్నాడు ఆశ్చర్యపోతూ. 'డబ్బుల్ సార్' అని మళ్ళీ చెప్పాడు ప్రొప్రయిటరు. 'ఏమిటే' అన్నాడు మళ్ళీ మామయ్య ఇంకా అర్థం చేసుకోలేక, "సరిగా వినబడ్డంలేదా సార్, తిన్నదానికి బిల్లు చెల్లించి పొమ్మంటున్నాను సార్" అన్నాడు ప్రొప్రయిటరు గట్టిగొంతుకతో. మామయ్య కళ్ళు పైకి వచ్చాయి. ఆనాటి ప్రొప్రయిటరేనా ఈనాడిలా మాట్లాడుతున్నది! "ఏమిటి, ఎవరి నడుగుతున్నావో తెలుసా?" అన్నాడు మామయ్య నిజమైన చిరాకుతో. "ఆ తెలుసుసార్. ఇక ఊరికే పెట్టేదిలేదు సార్" అన్నాడు ప్రొప్రయిటరు. "నిన్నెంత అపాయంనుంచి తప్పించానో అప్పుడే మరచిపోయావా? - నాకు కోపంవస్తే - " "కోపంవస్తే ఏమీ పరవాలేదుసార్. నేనే అనవసరంగా భయపడ్డానాదినం. మా అరవలని మీ ఆంధ్రులు ఏం చేస్తారో అని భయపడ్డాను. కాని ఎక్కడా మీ ఆంధ్రులు మా జోలికే రాలేదుసార్. ఇప్పటివరకూ మీకు పెట్టినదానికి చాలా నష్టం వచ్చింది. ఇక పెట్టేదిలేదు. అట్టే మాట్లాడితే నలుగురితోనూ చెప్పి ఇన్నాళ్లూ తిన్నదానికికూడా డబ్బు వసూలు చేస్తాను సార్" అన్నాడా ప్రొప్రయిటరు ఖండించినట్లుగా. మామయ్యగొంతుకలో పచ్చివెలగకాయ పడింది. 'తస్సాదియ్యా, జిత్తులమారితనంలో అరవలకు అరవలే సాటి' అని లోపల తిట్టుకొని డబ్బు చెల్లించి బయటపడ్డాడు. అప్పటినుంచీ మళ్ళీ మామయ్య ముసుపు చెల్లించవలసి వస్తోంది. మరి అటు ఇడ్లీ సాంబారును వదలలేడాయె. తనకు

4 ఔషధములు చేరినట్టిది



అనాసిన్ శాస్త్రయుక్తంగా నాలుగు ఔషధముల కలయికతో తయారింప బడినది. త్వరితంగ బాధనివారణకై హామీయిచ్చుటకు కారణం, ఇందులో కలసియుండు ఈ ఔషధములే.

1. క్వైనైన్: అధిక శక్తినిచ్చు ఔషధమని మరియు జ్వర నివారిణియని ప్రఖ్యాతిగాంచిన ఔషధ సమ్మేళనం. జ్వరాన్ని తగ్గించడంలో సాటిలేనిది.

2 కఫీన్: ఉత్సాహానికి మరియు చిక్కిపోయినందుకు తగిన ఔషధమని విరివిగా వాడబడుచున్నది.

3 ఫినాసిటిన్: తీవ్రమైన బాధా నివారిణి మరియు జ్వర నివారిణియని ఖ్యాతిచెందినది.

4 అసిటైల్ సాలిసిలిక్ ఆసిడ్: ఇది తలనొప్పి, మరియు అలాటి వివిధ బాధలను పోగొట్టుటకు ఉపయోగబడుచున్నది.




వైద్యశాస్త్ర రీత్యా ఏక సమ్మేళన శక్తిచేత అనాసిన్ సూత్రం, త్వరితంగాను, నిరపాయంగాను, దృఢంగాను, బాధలనుండి, తలనొప్పి, జలుబు జ్వరం, దంతపు పోట్లు, కండరముల పోట్లు, వాయువు నొప్పులు మొదలగు బాధలను నివారించును.

ఎల్లప్పుడును

అనాసిన్

బిళ్ళలే

కావలెననికోరండి



2 మాత్రలుగల

అరటలమీదఉన్న కక్షనంతా రోజూ ఆరిడ్జీ, సాంబారూ జఠరాగ్నిలో పడవేయడం ద్వారా తీర్చుకుంటున్నాడు.

రాజకీయాలంటే పడిచావడంలో ఆంధ్రులను మించినవారు లేరనేందుకు ఉదాహరణగా మామయ్య కనిపిస్తాడు. మామయ్య పత్రికా పఠనం నియమపూర్వకంగా 'టైటిల్' దగ్గరనుంచీ, 'ఎడిటెడ్, ప్రింటెడ్ అండ్ పబ్లిష్డ్ బై -' వరకూ చదువుతాడు. ఆంధ్రరాజకీయాలన్నీ మామయ్యకు కరతలామలకమే. ఎప్పుడు ఏ నాయకుడు ఏ మరొక నాయకుణ్ణి ఏవిధంగా తిట్టిందీ, ఆ మరొక నాయకుడు ఎటువంటి తిట్లతో జవాబు చెప్పిందీ; ఎప్పుడు ఏ నాయకుడు ఒక గట్టి ప్రకటనను చేసిందీ, మళ్ళీ అదే నాయకుడు అదే ప్రకటనను అంతే గట్టిగా ఖండించుకున్నదీ; ఎప్పుడు ఏ నాయకులు భుజాలు భుజాలు రాసుకుంటూ భాయీ భాయీ అంటు తిరిగిందీ, మళ్ళీ అదే నాయకులు ఒకరిమీద ఒకరు కారాలూ మిరియాలూ నూరుతూ బద్ధశత్రువులయిందీ; ఏ పార్టీలు ఏ పార్టీలనుంచి పుట్టాయో, ఏ పార్టీల వెనక ఏ వర్గాలవారున్నారో, వారి నాయకులెన్ని ముఖాలు మార్చారో, వారి పుట్టుపూర్వోత్తరాలూ, వాళ్ళనుగురించి ఉన్న పుకారులూ అన్నీ మామయ్యకు బాగా తెలుసు. అందువల్లే, అంత అపారజ్ఞానం ఉండబట్టే మామయ్య ఎంతటి నాయకుడైనా 'ఉట్టి వెధవ' క్రింద జమకట్టి వేయగలుగుతున్నాడు. నాయకులందరూ మా మామయ్య సలహా పొందవలసిన అవసరం ఎంతైనా కనపడుతుంది. కాని అన్యాయమేమంటే ఎన్నడూ ఏ నాయకుడూ కూడా మామయ్య సలహా తీసుకున్న పాపాన పోలేదు సరికదా, అతనికి [illegible] మామయ్య ఉచితంగా ఇచ్చే సలహాలు గ్రహించరు. మీటింగులలోనైనా మాట్లాడనీయరు. ఇది అన్యాయ మంటారా, మరీ అన్యాయ మంటారా, మరీ మరీ అన్యాయమంటారా, మీరే చెప్పండి. అందువల్ల అటువంటి మీటింగులలో తాను చెప్పవలసి ఉండిన గంభీరోపన్యాసాలన్నీ మా ముందూ, మా అత్తయ్య ముందూ ఇస్తూఉంటాడు మామయ్య.

ఆ వేళ పేపరురావడం ఆలస్యమయింది. చీకటిపడిపోయింది. (మా అమలాపురానికి పేపరు సాయంత్రమే వస్తుంది లెండి.) మామయ్యకు మన నాయకులమీద కోపం పొంగుకు వచ్చింది. ఈ నాయకులంతా ఈ కోనసీమను నిర్లక్ష్యం చేస్తున్నారు. వారి నేం చేయాలో మామయ్యకే తోచ లేదు. తానే అధికారంలో ఉంటేనా అమలాపురానికి రైలు వేయించి ఉండును. అప్పుడు ఈ ఇబ్బందులు ఉండకపోను. పేపరు రావడం ఇంతఆలస్యం కాకపోను! ఏమైనా, ఎన్ననుకున్నా పేపరు ఇంకా వచ్చేటట్లు లేదు కాబట్టి, అంతవరకూ కూర్చోవడం ఎందుకని ముందర భోజనాలు చేసి వేశాం. ఇంతలో పేపరూ వచ్చింది. అందరికీ ఒక్కసారే పేపరు చూడాలనిపిస్తుంది. అందరికీ ఆతురతే. అప్పుడప్పుడు పేచీలుకూడా రావడంకద్దు. కాని మామయ్యదే అథారిటీ కాబట్టి, ముందు పేపరంతా తాను సమగ్రంగా చదివేవరకు ఇంకొకరి చేతిలోనికి పోనీయడు. అంతవరకు వేచిఉండటానికి మా కోపిక ఉండదు కాబట్టి మామయ్య వెనకాలనిలబడి, మామయ్య విసుగుకుంటున్నా, పేపరు విశేషాలు చదివివేయడం మా కలవాటు. మామయ్య కొన్నికొన్ని విశేషాలు పైకి చదువుతున్నాడు.—నందికొండ ప్రాజెక్టు నిర్మాణం త్వరలోనే ప్రారంభం - కృష్ణా గోదా రెగ్యులేటర్ పని మందకొడిగా సాగుతున్నదా? - గోదావరి ప్రాజెక్టులను గురించి ఇన్వెస్టిగేషన్ —

"మాడండ్రా కొద్దికాలంలో మన ఆంధ్రదేశం ఎంతగా మారిపోతుందో," అంటూ మొదలు పెట్టాడు మామయ్య పేపరు ప్రక్కన పెట్టి.

అప్పటికి అత్తయ్య వంటింటికి తాళం పెట్టి వచ్చికూర్చుంది. "ఎలా మారిపోతుందండీ, చెప్పండీ" అంది.

"ఎలా మారిపోవడమేమిటి? మన ఆంధ్ర రాష్ట్రంలో పోలినరాష్ట్రం ఇండియాలో మరొకటి ఉండగలదా అని. మనకు కృష్ణా, గోదావరీ, పెన్నా, తుంగభద్రావంటి నదులున్నాయే అవే మనపాలిటి కల్పవృక్షాలనుకో. ఇన్ని నదులు ఏ ఒక్క రాష్ట్రంలోనూ ఉండడం అరుదు. ఇక నాటిమీద ప్రాజెక్టులు - చిన్న చిన్న ప్రాజెక్టులమాట అటుంచు, రామపాదసాగరం నందికొండ, సిద్ధేశ్వరం, పులిచింతల, గండికోట, సోమశిల ప్రాజెక్టులు - కట్టేశామనుకో అప్పుడు ఎన్ని లక్షల ఎకరాలు అదనంగా సాగులోకి వస్తాయో విన్నావా? కొన్ని అంచనాల ప్రకారం ఎనభైలక్షల ఎకరాలు అదనంగా సాగులోకి వస్తాయి. మెట్టలన్నీ మాగాణులైపోతాయి. దానికితోడు జపానీస్ వరి సాగు పద్ధతి బాగా ప్రచారంలోకి వచ్చివేస్తుంది. ట్రాక్టర్లు వగైరాలు బాగా వాడుకంలోకి వస్తాయి. ఇక అప్పుడు ఎంత పంట పండుతుందో ఊహించు. వెనక మన చిన్నతనంలో చూశామే ధాన్యం బస్తా అయిదారు రూపాయలకు రావడం సరిగా అలాంటి ధరలే వస్తాయి. రైతులకీ నష్టం ఉండదులే. బస్తా ధరతగ్గినా, మొత్తంమీద ఎక్కువ పండడంవల్ల ఇప్పటికన్న ఎక్కువ ఆదాయం వస్తుంది అప్పుడు. ఇవే కాదు తోటలూ ఎక్కువైపోతాయి. కటికదరిద్రుడుకూడా ఆపూట కూడుతో పండో ఫలమో వేసుకోకుండా తినడు"—

మా మామయ్య ఇలా వర్ణిస్తూంటే మానోరు ఊరసాగింది. ఆసక్తితో వినసాగాము.

"అప్పుడీ అక్కల్లో మొగం చూసేదెవరు? మంచి పన్నాలే మనం తినడం. - అది అలా ఉంచు. ఇక కొన్నాళ్ళకు తుంగభద్రనుంచి ఎలెక్ట్రిసిటీ వస్తుంది. ఇటు మాచ్ ఖండ్ నుంచి వస్తుంది. ఆపైన రామపాదసాగరం, నందికొండ, పులిచింతల, మొదలైన ప్రాజెక్టులన్నీ పూర్తి అయ్యాక కొన్ని లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి తయారవుతుంది. అప్పుడు చూడు - మన ఇల్లు ఎలా మారిపోతుందో ఆలోచించావా? అమెరికాలో జరుగుతున్నట్లు చెప్పుకుంటారే ఆవిధంగా ఉంటుంది. అన్నిటికీ ఎలెక్ట్రిసిటీయే. ఒక మీట నొక్కుతావు, నీళ్లు కాగిపోతాయి; ఒక మీట నొక్కుతావు, అన్నం ఉడికిపోతుంది; ఒక మీట నొక్కుతావు కూర వేగిపోతుంది; ఒక మీట నొక్కుతావు, మెషీన్ గిన్నెలుతోమి, కడిగి ఇస్తుంది; ఇంకొక మీట నొక్కుతావు? బట్టలు ఉతికి ఆరబెట్టి ఇస్తుంది ఒక మెషీన్. ఇక నేను క్షౌరంకోసం తంటాలుపడే నవసరం ఉండదు. ఎలెక్ట్రిక్ షేవర్ తీసి ఒకసారి ఇటూ అటూ రాస్తాను, అంతే గడ్డం సాఫ్ అయిపోతుంది. ఒకటేమిటి - ఇటు వాల్తేరు నుంచి మద్రాసువరకూ, బెజవాడనుంచి హైదరాబాదువరకు రైళ్లు ఎలెక్ట్రిసిటీమీదే నడుస్తాయి ఎలెక్ట్రిక్ రైలంటే ఎంత హాయిగా ఉంటుందనుకున్నావు! ఎంత వేగంగా పోతుందనుకున్నావు! అప్పుడు ఈ దిక్కుమాలిన లంకణాల బోట్లలో తిరగవలసిన పని ఉండదు. ఇంత ఎలెక్ట్రిసిటీ తయారుకావడంవల్ల చిన్నచిన్న పల్లెటూళ్ళకు కూడా వస్తుంది. గ్రామాల్లోకూడా ఎలెక్ట్రిక్ లైట్లూ, ప్రతి ఇంటా రేడియోలూ ఉంటాయి. ఎక్కడపడితే అక్కడ ఫాక్టరీలు తయారవుతాయి. [illegible] ఫాక్టరీలు, సైకిలు ఫాక్టరీలు, ఆ ఫాక్టరీలూ ఈ ఫాక్టరీలూ ఇక

మా మామయ్య

చెప్పాలా - మన కోనసీమలో కూడా నూనె ఫాక్టరీలూ, సబ్బు ఫాక్టరీలు వగైరాలు లేస్తాయి. మనపట్టణాలు ఇప్పుడున్నదానికంటె నాలుగైదురెట్లు పెరిగిపోతాయి. కొత్తపట్టణాలు బయలుదేరుతాయి. ఎక్కడ చూసినా తారురోడ్లూ, సిమెంటురోడ్లే. ఎన్నో కొత్తకాలేజీలు వస్తాయి. ఎన్నో సినిమాహాళ్లు బయలుదేరుతాయి. స్టూడియోలు తయారవుతాయి. టెలివిజనూ, సినిమాస్కోపూ కూడా వస్తాయి. ఇంటింటికీ టెలిఫోన్లు ఉంటాయి. ప్రతి పెద్ద పట్టణానికీ ఒక 'ఏరోడ్రమ్' ఉంటుంది. ఈ కోనసీమకు కూడా ఆలమూరు వంతెన పడడంవల్ల రాకపోకలెక్కువైపోతాయి. అప్పుడు గోదావరి భయమే ఉండదు."

"అవును ఆ వంతెన ఎప్పుడు పడుతుందంటారు? దేవుడు ఈ దిక్కుమాలిన డెల్టాలో ఎందుకు వేశాడా అనిపిస్తోంది. ఎటుపోయినా గోదావరి తప్పదాయె. ఎప్పుడు నడిగోదావరిలో నావ బుడుంగుమంటుందోనన్న భయమే" అంది అత్తయ్య.

"ఇక ఆ భయం ఉండదులే. తిన్నగా కారుమీద కాకినాడో, రాజమండ్రీయో వెళ్ళతావు. అక్కడినుంచి ఎలెక్ట్రిక్ రైలెక్కి బెజవాడ మూడుగంటల్లో చేరుకుంటావు. మరీ అర్జంటైతే కాకినాడలో విమానమెక్కి గంటసేపటిలో బెజవాడ దగ్గర వాల్తావు—"

మామయ్య భవిష్యత్ స్వప్నాలు వింటూంటే అత్తయ్య గాలిలో తేలిపోయింది. "ఈ ఇరవైఏళ్లూ ఒక్కసారిగా గడచిపోతే బాగుండును. ఆ చెప్పినవన్నీ ఒక్కసారిగా నిజమైపోతే బాగుండును!" అంది ఉత్సాహం పొంగిపోతూ.

తన ఉపన్యాస ప్రభావం బాగా పడిందని గ్రహించి మామయ్య సంతృప్తి చెందాడు. "తొందరపడతావేం, వెర్రి దానా. అన్నీ చూస్తావు, ఎటొచ్చీ కాస్త ఆలస్యంపడుతుంది అంతే."

"ఏమండీ మరి రామపాదసాగరానికి చాలా డబ్బు అవుతుందటని మీరే చెప్పారు. అంత డబ్బు ఎక్కడనుంచి వస్తుందండీ" అని ప్రశ్నించింది అత్తయ్య. (మా అత్తయ్య తక్కువది కాదండోయి. పైకి ఏమీ తెలియనట్లున్నా మా మామయ్య ఉపన్యాసాల ప్రభావంవల్ల ఒక రాజనీతిజ్ఞురాలై కూర్చుంది!)

"ఎక్కడనుంచేమిటి? ప్రజలనుంచే వస్తుంది. ప్రాజెక్టు కట్టితే అనుభవించేది మనమేకదా. రూపాయి పెట్టితే రెండు రూపాయలు వస్తుందంటే రూపాయి పెట్టడానికి ఎవడు వెనకదీస్తాడు? ప్రభుత్వం కట్టడానికి సిద్ధమైందంటే ప్రజలు ఎంత దుబ్బైనా భరించడానికి తయారే-అన్నట్లు చెప్పడం మరచిపోయాను. రేపు చీకటితోటే లేచి రాజమండ్రీ వెళ్ళాలి."

"ఎందుకు?"

"రామపాదసాగరం ప్రాజెక్టు సభకు రమ్మని ఆహ్వానం వచ్చింది."

"మీకే!"

"ఊఁ. మనమంటే ఏమనుకున్నావ్! రేపు వెళ్ళి రామపాదసాగరం ప్రాజెక్టు కోసం పెద్ద ఆందోళన లేవదీయాలి. ప్రభుత్వంచేత ఊఁ అనిపించివేయాలి."

"అయితే రామపాదసాగరం ప్రాజెక్టు కట్టడం అసాధ్యమేమో? లేక ఎవరో అది కట్టడమూ ఇక్కడనుంచి రంగాని (రంగూను)కి వంతెన కట్టడం ఒకటే నన్నాడని మీరే చెప్పారుకదూ. అదీకాక నందికొండ ప్రాజెక్టు కట్టబోతున్నారన్నారు. అటువంటప్పుడు ఇదికూడా కట్టడానికి ఒప్పుకుంటారా?" అని ప్రశ్నించింది అత్తయ్య. (మా అత్తయ్య సామాన్యురాలు కాదని చూస్తున్నారుగదూ.)

"అక్కడే ఉంది తమాషా", అన్నాడు మామయ్య ముందుకు వంగి చిటికవేస్తూ. అన్ని ప్రాజెక్టులకోసం ఒక్కసారే ఆందోళన లేవదీస్తే ఏ ఒక్కటీ కట్టడం జరగదు. అందువల్ల ముందు ఒకదానికి ఆందోళన లేవదీసి దానికి ఒప్పుకునేటట్లు చేయాలి. ఆపైన రెండోదానికి ప్రారంభించాలి. వచ్చినది రాబట్టి ఆపైన రానిదానికోసం పోరాడాలి. అదే ఉపాయం. నందికొండకు ఎలాగైనా ఒప్పుకుంది ప్రభుత్వం. ఇక ఇప్పుడు రామపాదసాగరానికి ఆందోళన లేవదీయాలి. రేపు సభలో చూడు ఏం చేస్తామో. ఎంత ఆందోళన లేవదీస్తామో!- ఒరే, అబ్బాయి, తెల్లవారగట్ల మూడుగంటలకు అలారం పెట్టరా. మొదటి బస్సుకు వెళ్ళాలి."

నేను అలారం పెట్టాను.

"ప్రయాణం ఖాయమే నన్నమాట?" అని అడిగింది అత్తయ్య.

"ఆ, ఖాయం కాకపోతే! ఆహ్వానం వచ్చిన తర్వాత వెళ్ళకపోతే ఏం బాగుంటుంది? వెళ్లి చాలా హంగామా చేయాలి."

"అయితే త్వరగా పడుకోండి. లేకపోతే తెల్లవారగట్ల లేవడం కష్టమవుతుంది" అంది అత్తయ్య.

అంతా పడుకున్నాం. గాలి లేదు ఉక్కపోత ఎక్కువగా ఉంది. చాలా సేపటివరకూ నిద్రే పట్టలేదు. ఏ ఒంటిగంటకో నిద్రపట్టింది. మరి కాసేపటికి అలారం గణగణ మోగడం మొదలుపెట్టింది. మామయ్య లేస్తాడేమో చూశాను. లేవలేదు. అలారం మ్రోగుతూనే ఉంది. ఆఖరికి నేనే లేచి అలారం ఆపుచేశాను. వెళ్ళి మామయ్యను తట్టాను. కదలలేదు. పిలిచాను. కదలలేదు. దొర్లించాను. "ఊఁ— ఊఁ" అంటూ ఒకసారి ఇటు దొర్లాడు. 'ఏమిటీ' అంటూ ఒకసారి అటు దొర్లాడు.

"రాజమండ్రీ వెళ్ళవూ?" అని అడిగాను.

"లేదు" అన్నాడు మామయ్య.

"అదేమిటి సభకు వెళ్తానన్నావే. అలారం పెట్టమన్నావు."

"రాత్రంతా నిద్రే లేదు. ఇప్పుడే కాస్త కునుకుపడుతోంది. ఇప్పుడు నిద్ర పాడు చేసుకొని ఎవడు పోతాడు?"

"మరి ఆహ్వానం వచ్చిందన్నావు! సభకు వెళ్ళవలసిందే నన్నావు!"

"ఆహ్వానాలకేంలే. డబ్బు వదిలించడానికి. ఇంతకీ మనం వెళ్లకపోయినంతలో సభ ఆగిపోదు. అసలు ఈ సభ జరగకపోయినా వచ్చిన నష్టమేమీ లేదు. ప్రాజెక్టువల్ల ప్రయోజనముంటే ప్రభుత్వమే చేస్తుంది. ప్రయోజనం లేకపోతే మనం ఎంత నోరు చించుకున్నా కదలదు. అంతా ప్రభుత్వానికే వదలడం మంచిది. పైగా ఈ సభకి పోయిరావడానికి ఖర్చు ఎవడు ఇస్తాడు? అంతా చేతి చమురే. ఆ సభకు వెళ్ళినా మన మాట వినేవాడుండడు. ఏ పార్టీ అనాయకులో పెత్తనం చెలాయిస్తారు. ప్రభుత్వం దగ్గరకు పోయే ప్రతినిధి వర్గాలలో కూడా వాళ్లే ఉంటారు. చందాలు చెల్లించడానికి మనం కావలసివస్తుంది. వెధవ చందాలతో చచ్చిపోతున్నాం. ఎన్నని భరించడం? అంతా ప్రభుత్వానికే విడిచిపెట్టి హాయిగా నిద్రపోదాం," అంటూ మామయ్య పక్కకు తిరిగి గుర్రు పెట్టడం మొదలుపెట్టాడు.

* * *

ఇప్పటికీ మామయ్య - తానొక పైసా ఖర్చుపెట్టడానికిగాని, వీసమెత్తు కృషి చేయడానికిగాని సిద్ధపడకపోయినా- అన్ని ప్రాజెక్టులూ తయారైపోతాయి, పల్లెలు పట్టణాలయిపోతాయి, మన తెలుగుదేశం స్వర్గతుల్యమయిపోతుందని గట్టిగా విశ్వసిస్తూనే ఉంటాడు. ★

వనితాలోకం

మైనారిటీ తీరని సంస్కారమా?

కొమ్మూరి ఉషారాణి

'మైనారిటీతీరని మన సంస్కారం' అంటూ విశాఖపట్నం నుంచి యం. లక్ష్మీదేవిగారు యిలా వ్రాస్తున్నారు:—

"మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి చక్కబెట్టుకోడం కోసం మాత్రమే స్త్రీలు ఉద్యోగాలు చెయ్యాలీ అంటె ఒప్పుకోవడం కష్టం. వాస్తవానికి స్త్రీలు ఉద్యోగాలు చేసినా ఆర్థికస్థితి చక్కబడుతుందని తోచదు. అయితే ఇంతమాత్రాన స్త్రీలు ఉద్యోగాలు చెయ్యరాదని నేను చెప్తున్నాననుకోకండి. ఆర్థికస్థితి ఒక్కటే కారణం చెప్పకూడదని నా వుద్దేశం.

"నిజానికి మధ్యతరగతి స్త్రీలకి ఉద్యోగాలు చేసే అవకాశాలు బొత్తిగా తక్కువున్నాయి. ఎంతసేపూ బి. ఏ., ఎం. బీలు పాసైనవాళ్ళకి టీచర్ల ఉద్యోగాలనీ డాక్టరీ అనీ, లేకపోతే నర్సింగు అనీ చెప్పవలసి వస్తోంది. మధ్యతరగతి సంసారాలలో ఆడపిల్లల చదువులు చాలావరకు స్కూలు ఫైనలు, ఇంటర్మీడియేట్ తో నిలిచిపోతున్నాయి. వీరంతా ఏంచెయ్యాలి? వీరికేం ఉద్యోగాలు దొరుకుతాయి? ఎలిమెంటరీ స్కూళ్లలో ఉద్యోగాలుచేసి వీరు భర్తలకి ఎంత సాయం చెయ్యగలరు? ఈపద్ధతిని ఆలోచిస్తే స్త్రీలు – ఉద్యోగాలు అనే సమస్య నేలవిడిచిన సాముకింద తయారవుతుందనుకుంటాను.

"స్త్రీలు విద్య విజ్ఞానం సంపాదించాలని చెప్పటానికి ఎన్ని కారణాలున్నాయో, స్త్రీలు ఉద్యోగాలు చెయ్యాలీ అని చెప్పటానికి అన్ని కారణాలు వున్నాయంటాను. సంస్కారమనేది విద్యాలయాలకు వెళ్లి చదివినంతమాత్రాన లభించేది కాదు. చదువులు చదవకపోయినా చక్కని సంస్కారాన్ని అలవరచుకున్న స్త్రీలు మన సమాజంలో అక్కడక్కడ కనపడకపోరు. అయితే పూర్వ సంస్కారం క్రమక్రమంగా అంతరించిపోయి కొత్తసంస్కారం మన సమాజంలో అలవడుతోంది. ఈనాటి మన సమాజంలో, అంటే మనం మనవాళ్లూ మన బంధువులు, మన మిత్రులు మన పరిసరాల మధ్యలో, మన ప్రవర్తన, మన వ్యవహారవిధానం జాగ్రత్తగా పరిశీలించి చూసుకుంటే—మన సంస్కారానికి మైనారిటీ తీరలేదనిపిస్తుంది.

"స్త్రీ జాతిఅంతా పద్దెనిమిదేళ్లు నిండని మైనర్లుగా కాలం వెళ్లబుచ్చుతున్నారంటే, చాలామందికి ఆగ్రహం రావచ్చును. కానీ ఒక్కసారి నగరం దాటి దేశంలో అడుగుపెట్టి చూడండి. ఎంత యీడువచ్చినా, ఎన్నెన్ని కష్టసుఖాలు చవిచూసినా, లేక కొడుకులు కూతుళ్లు మనుమలు మనుమరాళ్లతో ఎంత కలకలలాడుతున్నా ఏ స్త్రీని చూడండి— మైనారటీతీరని వాళ్ళలాగే ప్రవర్తిస్తున్నారంటాను.

"కట్నాలబాధవల్ల యువతులు పడుతున్న బాధల్ని, ఈబాధలకి గల కారణాల్ని చూసి, వీటన్నిటికీ మూలమైన మన పెద్దల ఆర్థిక దృష్టినీ సంస్కారాన్ని గమనించికూడా, మనకేదో ఉన్నతమైన సంస్కారం ఉందంటే ఎలాగు నమ్మటం? ఒక్కసారి మన పల్లెటూళ్లలో ఒక్కపెళ్లికి వెళ్లి చూస్తే చాలు, ఈ సంస్కారంతో మొహంమొత్తిపోతుంది. ఈ సంస్కారానికి మూలం ఏదో ఉన్నత హైందవసంప్రదాయం అనుకునే దేదీకాదు. ఈ సంస్కారానికి మూలం విత్తం, హోదా, అంతస్తు—గొప్ప. మన విద్యావిధానం గమనించినా, ఉద్యోగాలకీ విద్యకీగల సంబంధంచూసినా, నిత్యజీవితంలో లెక్కకు వస్తున్న సంస్కారాన్ని చూసినా—ఏ ఒక్కటీ గౌరవ

ప్రదమైన జీవనానికి గానీ, సమగ్రమైన వ్యక్తి వికాసానికి గానీ ఉపకరించేదిగా కనపడదు. మన ఆర్థిక వ్యవహారాలలో గానీ, కుటుంబ వ్యవహారాల లో గానీ సరైన సంస్కారం అలవడాలంటే ముందు జీవితంలో కొన్ని ముఖ్య అంశాలపట్ల మన వైఖరీ, లోకంకట్టే మూల్యమూ మారాలి. ఇలాంటి మార్పుకి మన సమస్యలే సరైన పరిష్కారమార్గాన్ని సూచిస్తున్నాయని నా వుద్దేశం.

"తెల్లారి లేస్తే సంసారికి రోజెలా గడుస్తుందా అనే బాధ ఉండనే ఉంటుంది. ఈనాడు సంసారులందరికీ బెంగపుట్టించే ముఖ్య సమస్య పిల్లల భవిష్యత్తు అని నా వుద్దేశం. మగపిల్లల చదువులూ ఉద్యోగాలు, ఆడపిల్లల చదువులూ పెళ్లిళ్లు - పెళ్లిళ్లకు కట్నాలు. కట్నాల బేరాల, వేలంపాటలు ఎంత దారుణంగా ఉన్నాయో అందరికీ తెలిసిన విషయమే. ఈ ఆచారంవల్ల మధ్యతరగతి కుటుంబాలు చితికిపోతున్నాయి. ఆడపిల్లల సుఖం మంటగలిసి పోతోంది.

"మధ్యతరగతి కుటుంబాలలో తల్లిదండ్రులు ఈ విధంగా ఆలోచించవలసి వస్తోంది. ఉద్యోగాలకు అవకాశం కలిగించేవరకూ ఆడపిల్లలకు చదువులు చెప్పించటమా? లేక ఆ డబ్బు కట్నం రూపంలో పోసి పెళ్ళి చేసి ఆడపిల్లల బరువుని మరొకరి మీదికి గెంటెయ్యడమా? అని. చుట్టూ పదిమంది యిళ్లల్లో చూస్తూ ఆడపిల్లల్ని బొత్తిగా చదువు మానిపించలేక, చదువు మొదలెట్టించి తుదంటా కొనసాగించలేక, చివరయిటు చదువుకీ డబ్బుపోసి, అటు కట్నాలూ యివ్వవలసి వచ్చేసరికి తాహతు చాలక తల్లిదండ్రులు సతమతమౌతున్నారు.

"ఈ పద్ధతీ ఈ సంస్కారమూ మారిపోవడానికి ఒక్కటే మార్గం కనబడుతుంది. మన ఆర్థిక వ్యవస్థలోనూ సమాజ వ్యవస్థలోనూ స్త్రీల స్థితిలో మార్పు రావాలి — రావడానికి అవకాశం ప్రత్యక్షంగా కనబడుతుంది. స్త్రీలు ఉద్యోగాలు చెయ్యడం అతి సామాన్యమైన విషయం అయిందనుకోండి. అప్పుడు పెద్దల మాట ఎలావున్నా, పిన్నలే కట్నాలవిషయంలో బుద్ధి మార్చుకుంటారని నా నమ్మకం.

"మగపిల్లలకంటె ఆడపిల్లలు ఏదో పెద్ద బరువన్నట్లు ఆలోచించినంత కాలం మన సంస్కారమూ కట్నాలూ మనల్ని రక్షించలేవు - ఆర్థిక దుస్థితికి లోబడక తప్పదు. ఆడపిల్లలూ మగపిల్లలతో సమానమే ననుకునే రోజున, చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న ఆడపిల్లలే ఎదురుకట్నం అడిగారంటే, ఆ కొంత మర్యాదా తీరిపోతుంది.

"కూతుర్ని పెళ్ళి భారమే కాదు, స్త్రీలను సంరక్షించవలసిన బాధ్యతను తండ్రులెంత కాలం భరిస్తూ వుంటారో అంత కాలం మన జీవనవిధానం అధోగతిపాలే. స్త్రీలను సంరక్షించడమనే కర్తవ్యాన్ని మగవాళ్ళు పెట్టుకోవడం ఆడవాళ్ళ సంస్కారానికే కాదు, మగవాళ్ల సంస్కారానికి కూడా మేలు కాదు. సమాజంలో పరస్పరం ఆధారపడి జీవించవలసిన స్త్రీ పురుషులు, పరస్పర సంరక్షణకు సిద్ధపడాలి. అప్పుడే మన సంస్కారానికి మైనారిటీ తీరి ప్రాజ్ఞత లభించినట్లు అని నా అభిప్రాయం."

ఇదీ లక్ష్మీదేవిగారి లేఖ. స్త్రీల ఉద్యోగాల సమస్యలో ఆర్థికసమస్య ముఖ్యం కాదనీ, సంస్కారం ముఖ్యమనీ లక్ష్మీదేవిగారంటున్నారు.

— శ్రీమంతుల కుటుంబాలలో స్త్రీలకి ఉద్యోగం చెయ్యవలసిన అవసరముంటూ వుండదు. ఇక పాటకవర్గంలో స్త్రీలకి 'ఉద్యోగాలు' చెయ్యాలా అనే సమస్యే లేదు; వారిలో చాలామంది భర్తలతో సమానంగా పనులు చేసుకుని డబ్బు సంపాయిస్తారు. ఇక స్త్రీలకి ఉద్యోగాలు చెయ్యవలసిన అవసరముంటూ వుంటే, అది మధ్యతరగతి కుటుంబాలకే. ఆర్థిక దుస్థితిని తొలగించటమే గాకుండా ఉద్యోగాలు చెయ్యటం వల్ల వారు పొందగలిగే యితర లాభాలున్న మాట నిజమే. ఆ విషయా లెలావున్నా, ముందు అవసరాన్ని బట్టి ఆర్థికదుస్థితిని ఎదుర్కోవటమే స్త్రీలు ఉద్యోగాలు చెయ్యవలసిన అవసరాన్ని ఎక్కువగా కల్పిస్తుందని తోస్తుంది. ఈరోజున కొంతమందైనా స్త్రీలు ఉద్యోగాలలోకి, ముఖ్యంగా టీచర్ ఉద్యోగాలలోకి ప్రవేశించగలిగారంటే కారణం ఆర్థికబాధ నివారించుకోవాలనే. ఆర్థికబాధో, లేక స్వయంగా తమ రెక్కలమీద ఆధారపడక తప్పని పరిస్థితో - ఇవే లేకపోతే ఇప్పటికి ఆట్టేమంది స్త్రీలు ఉద్యోగాలలో చేరివుండరు.

స్త్రీలు ఉద్యోగాలు చేసినా ఆర్థిక దుస్థితి చక్కబడదంటే ఒప్పుకోవటం కష్టం. ఆడది ధనార్జన చేసి భర్తకి సహాయం చేయటం మాట ఎలావున్నా, వివాహమయితే గానీ పూటగడవదని బాధపడుతూ ఎవరినో ఒకరిని కళ్లుమూసుకుని ముడిపెట్టుకోకుండా పెళ్ళిఅయినా కాకపోయినా స్వతంత్రజీవనోపాధి అనేది కల్పించుకోవటములో ఎంత సుఖం వుంది!

ఇక మధ్యతరగతి స్త్రీలకి ఉద్యోగాలు చేసే అవకాశం తక్కువంటే దానికి ఆక్షేపణ ఏముంది? అవకాశాలు తక్కువున్నాయి గదా అని అవసరం అవగింజంతయినా తగ్గదు. ఆడవాళ్ళకి ప్రత్యేకించబడిన ఉద్యోగాలే వారు చెయ్యాలని ఎక్కడవుంది? ఒక్క టీచర్లుగా డాక్టర్లుగానే కాక స్టెనోగ్రాఫర్లుగా గుమాస్తాలుగా సెక్రటరీలుగా ఉద్యోగాలు చెయ్యవచ్చును. అవి దొరకటమే ఒక సమస్య అంటారేమో! ఉద్యోగాలు స్త్రీలకి ఎవరిస్తారు అని తర్కించుకుంటూపోతే లాభం లేదు. ఇచ్చేవాళ్లు లేకపోతే, యిది పురుషులకు మటుకు సమస్య కాదా?

ఎలిమెంటరీ స్కూలు టీచరు పనిచేసే స్త్రీ భర్తకి సహాయపడదనటము హాస్యాస్పదం. ఎలిమెంటరీ స్కూళ్లల్లో పనిచేసే పురుషులు పెళ్ళాన్నీ పిల్లలనీ పోషించుకునేందుకు ప్రయత్నించగా లేనిది, స్త్రీ భర్తకి సహాయం చేస్తే తప్పేముంది? వెయ్యి రూపాయిల జీతగాడి భార్య యాభయి రూపాయిలు తెచ్చి అతనికి తోడ్పడాలని ఎవరూ అనరు. భర్త జీతం కొద్దిదయినప్పుడే ఆమె సహాయపడగలదు.

స్త్రీల ఉద్యోగం విషయం నేల విడిచిన సాము ఎన్నటికీ కాదు. ఉన్న పరిస్థితికి దాసోహమనకుండా వారు ఉద్యోగాలు చెయ్యవలసిన అవసరం ఎటువంటి పరిస్థితుల్లో లాభదాయకంగా పరిణమిస్తుందో అర్థంచేసుకోవాలి. ఈ సందర్భంలో ఉద్యో

మైనారిటీ తీరని సంస్కారమా?

కాలంటే కేవలం ఆఫీసుల్లో చెయ్యవలసిన వేననీ, నెలజీతంమీద ఆధారపడేవనీ అనుకోవటం పొరపాటని చెప్పాలి. స్త్రీలు ఆఫీసులకి వెళ్ళవలసిన అవసరం లేకుండా ఆడపిల్లలకి ట్యూషన్లు చెప్పవచ్చు, కుట్టుపని మొదలైనవి అనేకం చెయ్యవచ్చు. మధ్య తరగతి కుటుంబంలోని స్త్రీ తనభర్తకీ పిల్లలకీతప్ప మరెవ్వరికీ ఎటువంటి పని చేసినా పరువుతక్కువనే మూఢ నమ్మకం వదిలేస్తేచాలు, స్త్రీలు లాభదాయకంగా చేయగలిగే పనులు అనేకమున్నాయి.

చదువువేరు సంస్కారం వేరు అని అనటం పరిపాటే. సంస్కారం అనేది విద్యాలయాలకు వెళ్ళటం వల్లా గ్రంథాలు చదవటంవల్లనే అలవడుతుందనుకోవటం పొరపాటే కావచ్చు. ఏమీ చదువుకోని స్త్రీలు ఒక్కొక్కప్పుడు చదువుకున్న వారికంటె మెలుగని పిస్తుంటారు కూడా. అంతమాత్రంచేత విద్యాలయాలకువెళ్ళి చదువుకోవటం వృథాఅనుకోవటం తప్పు. సంస్కారమనేది పూర్తిగా విద్యమీద ఆధారపడకపోయినా, విద్యవల్ల కలిగే లాభాలు లేకపోలేదు. అది వ్యక్తుల యొక్క సంస్కారాన్ని ఎప్పుడో ఒకప్పుడు నిరూపిస్తుంది. విద్యకలిగిన సంస్కారం చక్కగా రాణింపుకు వస్తుంది.

పూర్వ సంస్కారం అంతరించిపోయి కొత్త సంస్కారం అలవడుతున్న మన సమాజంలో యువతుల బాధలు అలాగే వుండిపోవటం నిజంగా విచారించవలసిన విషయమే. లక్ష్మీదేవి రమ్మన్నట్లు ఈ కట్నాల సమస్య బాధకరంగానే వుంటోంది. ఇందువల్లే ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యడం మరింత అవసరం.

మన సంస్కారానికి మూలం విత్తం కాదా అవుతున్నమాట నిజమే. కానీ వారన్నట్లు ఆడపిల్లల చదువు విషయమే తల్లితండ్రులకు బెంగ పుట్టించే ముఖ్య సమస్య అయితే, పరిష్కారం కష్టం కానే కాదు. చదువుకంటె కట్నంసమస్య వీరి నెక్కువ పీడించటంవల్లే స్త్రీల స్థితి యిలా వుంది. కట్నాలరూపంలో పెళ్ళిళ్ళకయ్యే ఖర్చులు ఆడపిల్లల చదువుకోసం వ్యయం చేస్తే, మన సమాజం చాలామటుకు బాగుపడగలదని చెప్పవచ్చు. మిగతావిషయాలెలా వున్నా, ఆమె ఉన్నతవిద్య నభ్యసించడమూ లేదా వృత్తి ఉద్యోగాలలో శిక్షణ పొందడమూ జరుగుతుంది. ఈ రకమైన మార్పు మన సమాజానికి మంచిది కాదని ఎవ రనగలరు!

ఆడపిల్లల చదువుకయ్యే ఖర్చులు కట్నం రూపంలో పోసి వారి బరువుని మరొకరి మీదికి గెంటెయ్యాలని చూసే తల్లితండ్రులు లేకపోలేదు, కొల్లలుగా వున్నారు. అటువంటి వారే ఏ సమస్యనూ పరిష్కరించలేకుండా వున్నారు. పోతే ఎంత కట్నంతో భర్త యింట్లో అడుగు పెట్టినా, మధ్యతరగతి స్త్రీలు దారిద్ర్యాన్ని ఎదుర్కోవటం తప్పటంలేదు. భర్త దుస్థితిని చూసి సహాయం చెయ్యలేక దారిద్ర్యాన్ని పంచుకోవటమే తప్ప ఆమెకి వేరే మార్గం లేకుండా పోతోంది. అటువంటి సమయాలలో పురుషుల నిస్సహాయస్థితిని జూచి విచారించిగానీ విసుక్కునిగానీ లాభం లేదు.

చుట్టూ పదిమందినిజూచి తమ పిల్లల చదువు మాన్పించలేక చదువులకీ కట్నాలకీ కూడా ధనం వ్యయం చెయ్యవలసిరావడం విచారించవలసిన విషయమే. ఎక్కడయినా అప్పయినా చేసి అమ్మాయిని ఆర్థిక చిక్కులు లేని కుటుంబంలో యిస్తే ఏ చిక్కులూ రావంటారేమో! అటువంటివారిని డబ్బిచ్చి కొనుక్కున్నా ఆ అల్లుళ్లు కూతుళ్లను ఏమంత గౌరవంగా చూస్తారు చెప్పండి?

స్త్రీలు ఉద్యోగాలు చెయ్యటం అతి సామాన్యమైన విషయమయినప్పుడు, డబ్బు విలువనిబట్టే స్త్రీ పురుషు లిద్దరూ జీవిత భాగస్థులని ఎన్నుకునే రోజులు మటుకు తప్పకుండా పోతాయి. ఆడపిల్లలూ మగపిల్లలతో సమానమనుకుని వారిని చదివించటమేగాక స్వతంత్ర జీవనోపాధిని కల్పించటానికి తల్లితండ్రులు ప్రయత్నించాలి. అప్పుడే కట్నాల సమస్యకూడా తీరిపోతుంది.

కూతుళ్ల పెళ్ళిభారాన్ని మోయవద్దని తండ్రులతో ఎంత ఘోషించినా ఆ బాధ్యతని వారు ఎలాగూ మరువలేరు. నచ్చిన వరుణ్ని ఎన్నుకోవటానికి ఆడపిల్లకి ఎంత స్వతంత్రం యిచ్చినప్పటికీ, ఆమె మంచికోసమే ఒకొకప్పుడు తండ్రి కలుగజేసుకోవలసి వస్తూంటుంది. కూతురు సంరక్షణ విషయం తండ్రి ఎలా విస్మరిస్తాడు? అలా విస్మరించమనడం అన్యాయమని తోస్తుంది. కూతుళ్లను చదివించి ఉద్యోగాలు చెయ్యనిస్తే వారిని సంరక్షించే భారం కొంత తీరిపోయేమాట నిజమే. కానీ అలా జరగనంత మాత్రాన జీవనవిధానం ఎలా అధోగతిపాలవుతుందో అర్థంకావటంలేదు. సమాజంలో స్త్రీలకు సంరక్షణ ఎక్కువ అవసరమని పురుషులు అపోహపడినంత మాత్రాన మన సంస్కారానికి ప్రాజ్ఞత లభించలేదనటమూ అన్యాయమేమో! తమను సంరక్షించవలసిన భారం కేవలం పురుషులదే కాదనీ, యిటు తండ్రికిగానీ అటు భర్తకిగానీ తాను పూర్తిగా బరువయ్యే పరిస్థితి తప్పించుకునే అవకాశముందనీ స్త్రీలు గ్రహిస్తున్నారు. తండ్రి ఎంతకాలం అనవసరమైన సంరక్షణ భారం పైన వేసుకుంటాడో, భర్త ఆమెని ఎంత బరువుగా చూచుకుంటాడో అనే విషయాలని అంతపట్టించుకోనవసరము లేదు. పోనీ, వాళ్ళు ఆ సంరక్షణభారం మీద వేసుకోనంత మాత్రాన సంస్కారానికి మైనారిటీ దానంతటదే తీరిపోతుందని మటుకు ఎలా చెప్పగలం?

బి. చిన్నయ్యగారు (సహడోల్, వింధ్యప్రదేశ్) ఇలా వ్రాస్తున్నారు:

"స్త్రీలు - ఉద్యోగములనెడి తర్కం జరుగుచున్నప్పటినుండి యిప్పటికి తీవ్రముగనున్న నిరుద్యోగ సమస్య ప్రళయ రూపము దాల్చునేమో యనిపించుచున్నది.

పూర్వకాలమునుండియు విద్యావతులయిన స్త్రీలు లేకపోలేదు. పాండిత్యములో, శాస్త్రజ్ఞానములో భర్తలను మించిన స్త్రీలెందరు లేరు! చరిత్రలో వీరకాంతల ప్రతాపము లెన్ని వినలేదు? అంతేకాదు, సర్వతోముఖముగా పురుషులతోబాటు స్త్రీలుకూడ తమ శక్తిసామర్థ్యముల ప్రకటించిరి. కాని, యిప్పటివలె గాక వారు తమ వ్యక్తిత్వమును నిలుపుకొనిరనుటలో నతిశయోక్తి కనిపించ

మైనారిటీ తీరని సంస్కారమా?

జని దలంతును. విద్యావాంఛయనునది మానవ జాతికే ప్రకృతిసిద్ధము. స్త్రీని విద్యనుండి దూరము సేయుట, పుష్పమునుండి పరిమళ మును వేరుసేయుట. స్త్రీలు విజ్ఞానులయి యుండుట, గౌరవింపబడుట దేశౌన్నత్య మునకు చిహ్నములు. స్త్రీయొక్క విద్య, విజ్ఞానము, సౌహృదములపై జాతియొక్క భవితవ్య మాధారపడియున్న దని వేరుగా వ్రాయనక్కరలేదు.

"కాని నిత్యము చూచుచున్నది వేరు. విద్యావతులయిన స్త్రీలు తమ సహజత్వ మును గోలుపోవుచున్నారు. వేషభాషల లోనే గాక హృదయ పరివర్తనముగూడ వచ్చుచున్నది. విద్య నేర్చినప్పటికి స్త్రీ తన చపలత్వమును వీడుటలేదు. తన వ్యక్తి త్వమును నిలుపుకొనలేక పోవుచున్నది. ఏది వాంఛనీయమో యదియే దూరమగుచున్నది.

"ఇటువంటివార లుద్యోగమున ప్రవే శించిన వాతావరణ మెవ్విధముగానుండునో యూహింతురుగాక. స్త్రీయే పదవీస్వీకార ము జేసిననాడు తన సహజత్వము గోలుపోవు నని నాతలంపు. పదవితోబాటధికారము, అధికారముతోబాటు క్రూరత్వము సిద్ధించు ను. అన్నియుద్యోగములో కేవలము గానుం డవు. కాఠిన్యమును గొన్ని సమయములందు వహించవలసివచ్చును. మృదు, మాధుర్య ములకు నిలయమైన స్త్రీయే కాఠిన్యమును బూనిన నిక గత్యంతర ముండదు మృదుత్వ మన్నదిమానవునికికరవగును. లాలిత్యమన్నది ఛాయామాత్రమై నిలచును. మధురమైన లాలిపాటల నిటుపై బాలబాలికలు విననోచు కొనరు కాబోలు! కాఠిన్యమె యుగ్గుపా లతో నేర్తురేమో!! నిరాదరణకు లోటులేని దినములు రానున్నవి కాబోలు!

"ఉద్యోగవాంఛ యెన్నాళ్ళుండును నీ స్త్రీలకు? ప్రవేశించునంతవరకే. ప్రవే శించిన తరువాత యనేక సమస్య లెదురుగా గలవు. ఉద్యోగమన్నది స్వాతంత్ర్యమును గోలుపోవుటే. నౌకరుగానున్న వ్యక్తి యొక్క అభిప్రాయమును గాని, సలహాను గాని, యధికారులు వినరు, లెక్కసేయరు. వ్యక్తియొక్క స్వతంత్రభావము లానాడు బూజుపట్టవలసినదే. వెనకటికొక యాంగ్ల కవి యిట్లు వ్రాసినాడు. "పసిబిడ్డ యొక నాడు ప్రాకుచు నాడుకొనుచున్నాడు. ఇంతలో రంగు రంగుల సీతాకోకచిలుక యొకటా సమీపముననే వ్రాలినది. ఆ రంగులజూచి యా శిశువెంతయో మురిసి పోయినాడు. దాని నెవ్విధముగనైన తన దిగా జేసికొనవలెనన్న కోర్కె తీవ్రమయి నది. దానిని పట్టుకొనుటకు ముందుకు, అటు, ఇటు ప్రాకి, నేలపై చేతులతో జరచి నాడు. కాని, సీతాకోకచిలుక యెగిరి ఇంకొకచోట వ్రాలినది. దానితో నా బాల హృదయములో నుత్సాహము ద్విగుణీకృత మయినది. చాల శ్రమపడిన తరువాత చేతికి జిక్కినదా భ్రమరకీటకము. కాని యేమి ప్రయోజనము. ఆనందమునకు బదులు విచార మాక్రమించుకొన్న దా స్థానమున. చేతిలోనున్నది రంగు రంగులతో రమ్య ముగానున్న సీతాకోకచిలుక కాదు; ఊడిన ఱెక్కలు, కాళ్లు, రక్తము." వాంఛ మానవు నెవ్విధముగా భ్రమింపజేయునో, ఏ స్థితికి దెచ్చునో చెప్పుచు పై యుదా హరణ నిచ్చెను. ఇవ్విధముగా నుండు నేమో యీ స్త్రీల వాంఛా ఫలముకూడ!

ఉద్యోగవాంఛ ధనాభావము చేతనే కావచ్చును. కాదనలేము కూడ. దీనికి ప్రభుత్వమే శ్రద్ధతీసికొని గృహపరిశ్రమ లను, లలిత కళలను వృద్ధిపరిచి మధ్యతరగతి కుటుంబీకుల బాధల తీర్తురుగాక. ఆనాడు స్త్రీ తన గృహమునే స్వర్గసీమ జేయగలదు."

ఇది శ్రీ చిన్నయ్యగారి వాదం

—విద్యావతియైన స్త్రీకి 'హృదయ పరి వర్తనము' కలుగుతుందట! హృదయ పరివర్తన అనే ముక్క ఏ ఉద్దేశంలో వాడారో బోధపడటంలేదు. 'విద్య నేర్చి నప్పటికి స్త్రీ తన చపలత్వమును వీడుటలే' దనడంలో అర్థం విద్యనేర్వని స్త్రీలందరకూ చపలత్వం సహజ గుణమనా మీ అభి ప్రాయం? చపలత్వమనేది వయసునిబట్టి ఉంటుందిగాని స్త్రీలకే ప్రత్యేకం ఎక్కువ అనుకోడం భ్రమ. స్త్రీలపైన ఈ నేరాన్ని ఆరోపించడంలో పూర్వ కవులు తీసుకున్న లైసెన్సు అది. పదవీస్వీకారము చేసిన స్త్రీలు కాఠిన్యం వహిస్తారనటం బొత్తిగా చాద స్తంగా వుంది. అధికారంతో క్రూరత్వం సిద్ధిస్తుందా! అయితే పదవిలోవున్న పురుషు లంతా కఠినులనేనా మీ వుద్దేశం? నిజంగా మీ రనుకున్నట్టు కాఠిన్యానికి పదవులు కారణమైతే, స్త్రీలమాటకేంగానీ పురుషులు గూడా ఉద్యోగాలు మానేస్తే బాగుం టుంది. మృదుమాధుర్యములకు నిలయ మైన స్త్రీలు కాఠిన్యము వహించి లాలిపాటకు కొరత కలిగిస్తారని విచారించ కండి! మీరు అసలు అనవసరంగా గాభరా పడుతున్నారేగాని, రేడియోవాళ్లూ సినిమా వాళ్లూ ఈ లాలిపాటలను వినిపిస్తూనే వుంటారు లెండి! వీలైతే వనితాలోకం ద్వారా ఉద్యోగాలుచేసే స్త్రీలు లాలి పాటలను విస్మరించకూడదని ఒక ప్రకటన చేద్దాం.

ఉద్యోగం చేసినందువల్ల స్త్రీకి స్వంత

త్రం పోతుందని ఒకవాదం. స్వాతంత్ర్యం అనే మాటని ఏ అర్థంలో వాడుతున్నారో దాన్నిబట్టి అన్వయించుకోవాలి. ఈ రోజుల్లో స్వాతంత్ర్యం అనేది ఆర్థికస్తోమతిని బట్టే వుంటోంది. పురుషులకి ఉద్యోగాలు చెయ్యటంవల్ల స్వతంత్రం పోయిందని అనుకుంటే, ఆ స్వాతంత్ర్యమేదో ఉద్యోగాలు చెయ్యకముందే స్త్రీలకి లేదని అనుకోవలసి వస్తుంది. ★

వనజ, సంద్యాల

సంసారములో ఒడిదుడుకులు మనస్పర్థలు, రాకుండా, పిల్లలవిషయములో అజాగ్రత్త వహించకుండా, ఆరోగ్యము చెడకుండా, తమ ప్రవర్తనలో మార్పు లేకుండా, స్త్రీలు కూడా ఉద్యోగాలు చేయటానికి అవకాశము ఉందా? అసలు స్త్రీలు ప్రత్యేకించబడిన ఉద్యోగాలు, పనులు ఎందుకు చేయకూడదు? ఈ రెండు ప్రశ్నలను సావకాశంగా పరిశీలిస్తే, తప్పకుండా చేయాలనే జవాబు వస్తుంది. మొదటి విషయము కేవలము ఉద్యోగాలు చేసే స్త్రీలమీద, వారి ప్రవర్తనమీద ఆధారపడి ఉంటుంది. ఉద్యోగం చేస్తే స్త్రీలు పిల్లలవిషయములో అజాగ్రత్త వహించాలని ఉందా? పిల్లల విషయంలో ఎంతో జాగ్రత్తవహించి, ఎప్పుడూ గృహమునే కనిపెట్టుకున్నా ఎంతమంది తల్లుల బిడ్డలు సోమరులుగ, అల్లరి పిల్లలుగ తయారవడం లేదు?

కొన్ని ఉద్యోగాలు స్త్రీలు మాత్రమే చేయతగ్గవున్నాయి. వారికున్న శ్రద్ధ, సహనము పురుషునికి ఉండదు. అటువంటి వానిలో నర్సింగ్ ముఖ్యమైనది. కొన్ని తేలికయిన ఉద్యోగాలు: ఉదాహరణకు స్టెనోగ్రాఫర్, టెలిఫోన్ ఆపరేటర్, టైపిస్టు, స్త్రీలు ఏమాత్రం శ్రమపడకుండా చేయవచ్చు

శారీరకంగా స్త్రీలు ఉద్యోగాలకు తట్టుకోలేరు అన్న వాదము పేలవమైనది రేణూ చక్రవర్తిగారు ఇలా అన్నారు.

“స్త్రీలను అన్ని ఉద్యోగాలలోకి ప్రవేశపెట్టడానికి సంకోచించే అంశం ఒకటే స్థూలపరిశీలనకు గోచరిస్తుంది - విశేష దేహపరిశ్రమకు స్త్రీలు పురుషుల మాదిరిగా తట్టుకోలేరని మొదట అనిపిస్తుంది. కాని విజ్ఞాన శాస్త్రం వృద్ధిచెందుతున్న కొద్దీ ఆధునిక యంత్రాలు కార్మికుల పరిశ్రమను తేలిక పరుస్తున్నాయి. ఇప్పుడీ ఉద్యోగాలను స్త్రీలు పురుషులు సమానంగా నిర్వహించగలరు. పసుబలం వినియోగించవలసిన అవసరంపోయి యంత్ర ప్రావీణ్యం వృద్ధి అవుతోంది. ఎద్దులను కట్టి నాగళ్ళతో భూమి దున్నే బదులు ట్రాక్టరు నడపడం, రోడ్ల నిర్మాణంలో కార్మికుల శ్రమతగ్గి బుల్‌డోజరు పనిచెయ్యడం ప్రారంభమైన ఈ రోజుల్లో, శారీరకమైన ఈ వ్యత్యాసాలు క్రమంగా అంతరిస్తున్నాయి.”

కాని మనది పేదదేశము. పాశ్చాత్యదేశాల్లో లాగ శాస్త్రము అభివృద్ధి అవలేదు. అనుకూలమైన వాతావరణం, తృప్తికరమైన పరిస్థితులు మన సమాజంలో గాని ఉద్యోగాలు ఇచ్చే సంస్థలలో గాని ఏర్పడలేదు. కనుక అట్టి పరిస్థితులు అనుకూలమైనప్పుడు స్త్రీలు తప్పకుండా ఉద్యోగాలకు అర్హులౌతారు. ★

అల్లాడి వైదేహిగారు యం. ఏ. బి. టి.

(లెక్చరర్, సికంద్రాబాద్)

స్త్రీలకు ఉద్యోగము చేయవలసిన ఆవశ్యకత ఉన్నదా అని చర్చించుటకంటె, ఎట్టి స్త్రీలకు ఉద్యోగము చేయవలసిన అవసరమున్నదని చర్చించుట ముఖ్యమని నా అభిప్రాయము. ఉద్యోగములు స్త్రీలకు తగునా, తగదా అని స్త్రీజాతి కంతకును చెందునట్లు చర్చించుట అసాధ్యము. దీనికి రెండువిధములుగను ప్రత్యుత్తర మీయవచ్చును. అందుచే సాంఘిక, కుటుంబ, ఆర్థిక సమస్యలను దృష్టిలో నుంచుకొని ఎట్టివారికి ఉద్యోగములు చేయవలసిన అవసరమున్నదో నిర్ణయించుట మంచిది.

కాలముతోబాటు ఆచారములు, అలవాట్లు మారుచుండుటచే సంఘములో స్త్రీల పరిస్థితిలో గూడ మార్పు కలుగుచుండును. ఒక పరిస్థితిలో స్త్రీలు పురుషులకు దాసులై, ఎటువంటి కష్టములు సంభవించినను తమ జీవితమంతయు పురుషులపై ఆధారపడుచు గడపవలసివచ్చినది. స్త్రీలు నిస్సహాయులై యుండుటయే దీనికి కారణము. భర్తనుండి వేరుపడిన స్త్రీకి నిలుచుటకు నీడగాని తినుటకు తిండిగాని సంఘములో ఆదరణగాని లేవు. అంతేకాక పూర్వకాలములో ఆర్థికముగా మన దేశస్థితి ఇంత హీనముగా నుండలేదు. మధ్యతరగతి కుటుంబములకు గూడ ఇంతయో అంతయో ఆస్తి ఆధారము లుండెడివి. మగదక్షతలేని స్త్రీలు గూడ తమతమ కుటుంబములను పోషించుకొనుచుండిరి. కాని ఈకాలములో చాల కుటుంబములు ఆస్తి ఆధారములులేక ఉద్యోగములవలన వచ్చిన సంపాదనతోనే సంసారములను గడుపవలసి వచ్చుచున్నది. ఏ కారణములచేతనో పురుషునినుండి వేరుబడిన స్త్రీలు, అవివాహితలైన స్త్రీలకు జీవనోపాధి కల్పించుకొనవలసిన అవసరము ఇప్పుడు కలుగుచున్నది. సాధారణముగా స్త్రీలు - ఉద్యోగములను గూర్చి చర్చించునపుడు ముఖ్యముగా యిటువంటి స్త్రీలను దృష్టిలో యుంచుకొనవలెను.

కాని భర్తతో కాపురము చేయువారికి ఉద్యోగము లనవసరమని చెప్పుటకుకూడ వీలులేదు. కుటుంబము పెద్దదైనందువల్ల భర్త ఆర్జన చాలని పరిస్థితిలో ఆలుమగలిద్దరూ ఉద్యోగములు చేయవలసి రావచ్చును. కలిమి గలిగిన కుటుంబములోనుండి వచ్చి విద్యాభ్యాసమునకు అవకాశముండి విద్యావంతురాలై వివాహమైన తర్వాత తన విద్య కనువగు ఉద్యోగము దొరికిన, అట్టి ఉద్యోగముచేయు స్త్రీలుకూడ కలరు. ఈ రెండు తరహాలలో మొదటి వారి పరిస్థితి చాల కష్టము. చక్కగా పరిశీలించినచో చిన్న ఉద్యోగములు చేయు స్త్రీలు ఇంటా బయటా కూడ కాయకష్టము చెయ్యవలసివచ్చుచున్నది. వారికి వచ్చిన జీతముతో పనివారిని పెట్టి పనులను ఛేయించుకొనలేరు. కాబట్టి వారు సాధారణముగా ఆరోగ్యమును గోల్పోయి బలహీనులగుట సహజము. కాని వారు ఉద్యోగము చేయవలసిన అవసరము లేకపోలేదు. ఇట్టి స్త్రీలు ఎక్కువ శరీరపరిశ్రమ అవసరము లేని యుద్యోగములు చేయుట మేలు. ★

టి. సావిత్రి (కర్నూలు)

సమాజంలో సగభాగంగా ఉండి సాంఘిక జీవనంలోను, కుటుంబ జీవనంలోను ప్రధానపాత్ర, (హక్కులు లేకున్నా,) బరువు బాధ్యతలను నిర్వహిస్తున్న స్త్రీల సమస్యలను సాకల్యంగా చర్చించుకొనుటకు ప్రత్యేక శీర్షికను ఏర్పాటు చేయడం ముదావహం.

అసలు స్త్రీ జన్మయే ఒక సమస్య. ఆడపిల్ల పుట్టిందంటే అపోహించేవారు యింకా యీ అధునాతన సమాజంలో ఉన్నారు. ఆడపిల్ల ఐశ్వర్యానికి అరిష్టసూచక మన్నమాట! ఇంక చదువుకున్న స్త్రీ ఉద్యోగుల స్థితి విద్యుత్కత్తుల మధ్య బంధింపబడినట్లు ఉంటుందంటే అతిశయోక్తి కాదు.

చదువురాని కూలి స్త్రీలకు గూడ కుటుంబ సమస్యల నేకం. సంసారం చక్కదిద్దుకోవడం, పిల్లలను సాకడం, ముదుసలులను సంరక్షించడం, అన్నిటికంటె ముఖ్యంగా కుటుంబ ఆర్థికసమస్యలో సగభాగం కృషి

మైనారిటీ తీరని సంస్కారమా?

చేయడం అన్నీ ఉన్నాయి. అన్నీ స్వయంగానే చూచుకోవాలి. ఆ పేద బ్రతుకులకు వాళ్లు పుట్టినప్పటినుండి అలవాటుపడతారు. సమాజంగూడ వారిని ఆస్థితిలో చూసి సహించడానికి బాగా అలవాటు పడింది. అందుచేత చాకలిస్త్రీలు గాని, కార్మికస్త్రీలు గాని పడే యిబ్బందులు గణనలోకి రావడంలేదు.

స్త్రీ ఉద్యోగులను రెండు తరగతులుగా విభజించవచ్చు—వివాహితలు, అవివాహితలు. ఇతర రాష్ట్రాలలోను, ముఖ్యంగా తిరుచ్చిలో, ప్రధాన నగరాలలో ను స్త్రీలు ఉద్యోగాలు చేసినంతగా మన ఆంధ్రదేశంలో ఉద్యోగాలు చేయడం లేదు.

అందుచేత స్త్రీ విద్యనే అంతంత మాత్రంగా ప్రోత్సహిస్తున్న సమాజం ఉద్యోగాల్లో స్త్రీల ప్రవేశాన్ని అనుమోదించడం కష్టమే. కాని నేటి ఆంధ్ర ప్రజల ఆర్థిక పరిస్థితులే ఈ అభ్యుదయానికి మనల్ని నడిపిస్తున్నాయి.

అవివాహితలైన స్త్రీలకు సాధారణంగా ఒంటరి సంసారం ఉండదు. ఇంట్లో ఎవరో ఒకరుంటారు లేదా ఆమె ఏ బంధువుల యింటనైనా ఉంటుంది. అలాంటి వాళ్ళకు వంట కార్యక్రమం సులభం. మానసిక వ్యాపకాలు గూడ ఉండవవసరంలేదు. వాళ్లకు ఒకే చిక్కు. తను ఆఫీసుల్లో, తను తన పరిసరాల్లో, తను చుట్టూఉన్న సమాజంలో, రోజూ తను ఆఫీసుకు వచ్చేపోయే దారిలో కలిగే అనేక అగోచరమైన ఆటంకాలను వా రెదుర్కోవలసివస్తుంది. వివాహితలకు ఈ సమస్య లేదనిగాదు. వారికి గల వైవాహిక జీవితానుభవం ఈచిక్కుల్ని ఎదుర్కోవడానికి ధైర్యాన్ని చాకచక్యాన్ని యివ్వగలుగుతుంది. ఇప్పుడిప్పుడే కార్యాలయాల్లో చేరుతున్న క్రైస్తవేతర స్త్రీలకు గుండెబెదురు తగ్గవడంలో సందేహంలేదు. అయినా చాలమంది బావర బందీ లేకుండా, చీకు చికాకులు లేని, పొంగులువారే యౌవనోత్సాహంతో తమ ఉద్యోగాలను నిర్వహించగలరు.

ఇక వివాహితల సంగతి. వారు పడే యిక్కట్లు యిన్ని అన్ని గావు. ఇంటి కార్యక్రమంలో కాస్తో, కూస్తో సహాయపడగలవారున్నా, లేక సంతానము లేనివారైనా, పెద్దగా కష్టాలపాలు గానవసరం లేదు. అవివాహితలుగా గాని, ఇతరాధారాలు కలిగియుండటం గాని ఎంతో కాలం జరగదు. సమాజం జాలి పొందవలసింది సంతానంగల ఉద్యోగులను గురించే. అటువంటి సంసారంలోని స్త్రీ మూడు ప్రధానమైన బాధ్యతలను నిర్వహించవలసివస్తున్నది. ఇంటిపని, పిల్లల పోషణ, రోజుకు ఎనిమిది గంటల ఉద్యోగం. అంటే దినములో 24 గంటలను మూడు బాధ్యతలకూ విభజించినప్పటికీ, ఆమెకు విశ్రాంతి లేకపోగా, పని యింకా కొదవే అయివుంటుంది. వంట మనిషిని పెట్టుకొనే స్తోమతఉంటే తాను గూడ యిన్ని యిడుమలపాలు గానవసరం లేదుగా! మనం పెద్ద ఉద్యోగుల సంగతి విచారించడం లేదు – విచారించ నవసరం లేదు. మధ్యతరగతి ఉద్యోగుల విషయమే ఇచ్చట ప్రస్తావిస్తున్నాం.

వంటపని శారీరక శ్రమయితే, పిల్లల పోషణ మానసిక బాధనుగూడ కలుగజేస్తుంది. సాధారణంగా పిల్ల అర్ధగంట కనిపించక పోతేనే ఆరాటపడే తల్లి, స్కూలులో ఉన్నా, ఆఫీసులోఉన్నా, హాస్పిటలులో ఉన్నా ఎంత ఆతురతపడుతుందో చెప్పనవసరంలేదు. ఏబిడ్డకైనా అస్వస్థత కలిగిందంటే ఆ మాతృహృదయం ఎంతగా తల్లడిల్లుతుందో వివరించపనిలేదు.

ఇక ట్రాన్స్‌ఫర్ల ఉద్యోగాలైతే వారి కష్టాలు భగవంతునికే ఎరుక. నాకొక మిత్రముంది. భార్యాభర్తలు చెరియొక పట్టణంలో ఉద్యోగాలు చేస్తున్నారు. (భార్యాభర్తలు గవర్నమెంటులో సర్వీసుచేస్తూంటే ఒకే ఊరిలో వారిని నియమించాలని నియమమున్నా, ఆవరం అందరికీ లభ్యం కావడం కష్టం). ఎన్నిమాసాలు గడిచినా ఇద్దరికీ ఒకేచోట స్థావరం కుదరడంలేదు. చుట్టుపట్ల అమ్మలక్కలు యీభార్య ఉద్యోగి భర్తగారియింటికి యింకా వెళ్లలేదని ముక్కుమీద వేలేసుకుంటారు.

మరొక స్నేహితురాలు: భర్త చనిపోయాడు. ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ పోషణభారం తనపైనేబడింది. ఉన్న ఊరిలో కొంపమాత్రముంది. ప్రక్క ఊరిలో ఉద్యోగం. ఆమెది హయ్యరుగ్రేడు ఉద్యోగం. వచ్చే జీతంతో యింటికి అద్దె పెట్టలేక తన ఊరినుండి రోజూ రైలులో వెళ్తుండేది. పెద్దపిల్లను చదువు మానిపించింది. పగలల్లా హడావిడే. రాత్రి గూడ హడావిడే. ప్రక్క ఊరినుండి వచ్చి వంటచేసి స్నానం చేయించి అన్నం వండుకొని తినేసరికి పది గంటలకు తక్కువ గాదు. మరల తెల్లవారుజామునే లేవాలసే యుంది. హడావిడిగా లేవడం, పిల్లలకు స్నానపానాలు, వంట, రైలు ఎక్కడ తప్పిపోతుందోననే భయం—వెసులుబాటు లేని జీవితం. వేసవికాలం ఉదయం బడి అప్పుడు ఆమె అవస్థలు చెప్పలేం.

ఇలా చెప్పుకుంటూపోతే స్త్రీలు ఉద్యోగాలకు అనర్హులు అనే వాదనను సమర్థించినట్లవుతుంది. కాని ఆ వాదనను నేను అంగీకరించను. కష్టానికి, శ్రమకు విలువలేని ఈ రోజుల్లో మన జనాభాలో అధిక శాతము అర్ధపొట్ట కూటికొరకు ఎన్నో బాధలనుభవిస్తున్నారు. అలాంటివారిలో స్త్రీలుగూడ.

దీనికి శాశ్వత పరిష్కారమార్గం నేటి సామాజిక ఆర్థికవిధానాన్ని చక్కబరచడమే. ★

వనితాలోకం సీరియల్



2

చండి ప్రకృతి ఎంత అపూర్వమైనదో, ఆమెని కోడల్నిగా తన యింటికి తీసుకుపోదామని వచ్చిన జమీందారుగారిది కూడా అలాంటి ప్రకృతే. ఆయన తాను వస్తున్నట్లు ముందుగా కబురేమీ చెయ్యకుండానే - సామాన్య కుటుంబీకుడైన చటర్జీగారింటికి వధువును చూడటానికని వచ్చాడు. ఈ సంగతి ఏమాత్రం దాగలేదు. ఊరంతా గుప్‌మంది. ఈ జమీందారుగారి నివాసం శ్యామాపురానికి ఇంచుమించు ఇరవై మైళ్ళదూరం. 'హరినారాయణ జమీందారుగారి పేరు ఈ ఊరివారికి తారకమంత్రంలాంటిదే అయినా, చర్మచక్షువులతో ఆయన్నింతకుముందు ఈ ఊళ్లో ఎవరూ చూసి యెరుగరు. ఇంత సుప్రసిద్ధుడైన జమీందారుని చూసేందుకు చటర్జీగారింటిచుట్టూ జనం చాలామంది మూగారు. రాజవైద్యుడైన చటర్జీ – రాజతుల్యుడైన జమీందారుని బయటవసారాలో కూచోపెట్టి ఆయన ఆజ్ఞకోసం ఎదురుచూస్తున్నట్లు చేతులు కట్టుకు నిలబడ్డాడు.

"తమదగ్గిర ఇంకా పెళ్ళికాని యీడొచ్చిన పిల్ల ఉన్నదని విన్నాను. ఆ పిల్లని చూసిపోదామనే వచ్చాను నేను. నాకు నచ్చితే మా అబ్బాయిల్లో ఎవరికో ఒకరికి చేసుకుంటాను" అన్నాడు హరినారాయణ బాబు.

జమీందారు ఇలా అనేసరికి ఆ రాజవైద్యుడికి గొంతు పట్టుకున్నట్లయి, మాట పెగిలిరాలేదు. గ్రుడ్లు రెండూ అప్పగించి ఏదో మహాపరాధం చేసినవాడిలా చూస్తూ నిలబడ్డాడు.

హరినారాయణగారి ఒత్తరి మీసంలోంచి, ఆతడి పెదవులమీది దవ్వేత్తుగా వచ్చిన చిరునవ్వు స్పష్టంగా కన్పిస్తోంది.

"తమరు నామాట కాదనరని తెలుసు నాకు. అయినా ఒక్క విషయం మాత్రం మరిచిపోవద్దు చటర్జీగారూ! హరినారాయణ గంగూలీ అనవసరపుమాటలు మాట్లాడేవాడు కాదు. అసలలాంటి అవసరమూ లేదతడికి. నేను ఎలాంటిపిల్లకోసమని వెతుకుతున్నానో, మీ అమ్మాయినిగురించి ఏమేమి విన్నానో, ఆ రెండూ ఒకరకంగా కొంతవరకు ఏకంకావటంవల్ల మీ అమ్మాయి నా మనస్సులో ఒక స్థానాన్ని ఆక్రమించుకుంది. ఇప్పుడిహ చూపులకుకూడా నచ్చిందీ అంటే, ఆమె మాయింట్లోకూడా స్థానాన్ని పొందగలుగుతుంది."

కొంపమునిగిందే! తనకూతురి దుందుడుకుతనమంతా హరినారాయణగారి చెవినికూడా పడిందా యేం? ఆ వదంతులన్నీ వినికూడా, నచ్చితే ఆమెని కోడల్నిగా తీసుకెళ్ళాలని చూడటానికి వచ్చాడా? చటర్జీ ఆశ్చర్యంతో మెల్లిగా ఇలా అన్నాడు — "ఈ పేదవాడి కూతురిసంగతి ప్రభువుల చెవిదాకాకూడా......"

ప్రభువులవారిముఖంలోని చిరునవ్వు పెద్దనవ్వుగా మారింది. కొంచెం పరిహాసధోరణిలోకి దిగాడాయన. నవ్వుతూ చటర్జీమాటకి అడ్డువచ్చి, "ఈ పరగణాలోని యావన్మంది సంగతులూ ప్రభువుగారి హృత్కవిలిలో వ్రాసిపెట్టి ఉంటాయని మీకు తెలియదనుకుంటాను. ఈ సంగతి ఆడపిల్లల విషయాలకికూడా వర్తించకుండా పోదు. ఎంచేతంటే తనయింట్లో అనురూపుడైన కుర్రవాడు - వరుడు - ఉన్నప్పుడు, యోగ్యురాలయిన మరొకయింటి ఆడపిల్ల అవసరం ఉండక మానదుగా! అయినా మీ అమ్మాయి మొన్న మొన్నటిదాకా పంజాబ్‌లో ఎక్కడో ఉండటంవల్ల ఆమెనుగురించి కొంచెం ఆలస్యంగా తెలిసింది. నిజానికి అసలు ఈ తెలియటంకూడా ఆమెకి ప్రతికూలంగావచ్చిన ఫిర్యాదువల్లనే తెలిసింది!" అన్నాడు.

ఇది అంతకన్న మరీఆశ్చర్యం! ఫిర్యాదా! చండినిగురించి ఏదో ఫిర్యాదు జమీందారుగారిదగ్గిరకొస్తే - అందుకోసమని!... జమీందారుగారే ఈ చిక్కు సమస్యను తేల్చిపారేశారు. "మీ సౌభాగ్యాభిలాషియైన ఎవరో మీ యిరుగు పొరుగు వ్యక్తి అయి ఉంటాడు; మీ అమ్మాయిని గురించే, ఆమెకు విరుద్ధంగా ఒక ఫిర్యాదు వ్రాసి పంపాడు. ఆమెమీద నేరారోపణచేస్తూ అందులో ఏమేం సంగతులు వ్రాశాడో, వాటిని చూసి నేనూ తెల్లబోయాను. పల్లెటూళ్ళో ఇలాంటి ఆడపిల్ల ఉంటుందనేది అసలు నా ఊహకి అందలేదు. ఆ ఫిర్యాదు పంపిన వ్యక్తి అందులో తన పేరు వ్రాసుకోటానికి సాహసించలేకపోయాడు. అంచేత ఆ వ్యక్తి ఎవరో తెలియక, ఈ ఊళ్ళో ఉండే మా ప్రతినిధికి మీ అమ్మాయిని గురించి సరియైన వృత్తాంతం అంతా భోగట్టాచేసి వ్రాసిపంపమని ఉత్తరం ద్వారా తెలియపరిచాను. తర్వాత ఆ ఫిర్యాదులోని విషయాలన్నీ అల్లికలుగా మారాయని మాత్రం మీకు చెప్పగలను. మీ అమ్మాయిలోని దోషాలుగా ఏ సంగతులయితే ఉదహరించారో, వాటినన్నిటినీ గుణాలుగా భావించాను నేను. అందుకనే ఆమెని చూడటానికని వచ్చాను. వెళ్లండి,


(30-వ పేజీ చూడండి)

అనువాదం : మద్దిపట్ల సూరి   మూలం : మణిలాల్ వంద్యోపాధ్యాయ




ఆంధ్ర హైకోర్టు స్థాపనోత్సవంలో పాల్గొన్నవారు కేంద్ర హోంమంత్రి డా॥ కట్జూ, కేంద్ర కార్మికమంత్రి వి. వి. గిరి, మద్రాసు ప్రధాన న్యాయమూర్తి రాజమన్నారు, ఆంధ్ర ప్రధాన న్యాయమూర్తి సుబ్బారావు, ఆంధ్ర ముఖ్యమంత్రి ప్రకాశంగార్లు తదితరులు.

న్యా॥ పి. ఉమామహేశంగా



ఆంధ్ర హై





ప్రధాన న్యాయమూర్తి
కె. సుబ్బారావుగారు


న్యా॥ కె. చంద్రారెడ్డిగారు





మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
పి. రాజమన్నారుగారు

హైకోర్టు సంస్థాపనోత్సవం



★ స్వయంసిద్ధ ★

మా ఇంక ఆలస్యం చెయ్యకండి. మా అమ్మాయిని ఇక్కడికి తీసుకురండి. ఎక్కువసేపు ఇక్కడ కనిపెట్టుకు కూచునే తీరిక లేదు నాకు."

ఆ రవంత వ్యవధానంలో చండిని వీలైనంతవరకు అలంకరించి తీసుకురావటానికి ప్రయత్నించారు. బయటవైపున ఉన్న పోలూ - వసారాలకీ, లోపలి యింటికీ మధ్య కొంత ఖాళీజాగా ఉంది. చటర్జీ లోపలికి కబురు చెయ్యగానే, ఆ అతిథి 'మహనీయుని గౌరవార్థమై చండి చక్కగా అలంకరించుకుని, పరిచారికతో అప్పుడే బయటవాళ్లోకివచ్చి అడుగు పెట్టింది. ఇంతలో దైవికంగా ఒక సంఘటన జరిగింది.

ఆ ప్రాంగణంలో చటర్జీగారి ఆవు కట్టేసి ఉంది. దానిప్రక్కనే కట్టేసిఉన్న లేగదూడ గంతులేస్తూ కట్టుతాడు లాక్కుంటోంది. ఒక కుర్రవాడు ఆ దూడచెవులు రెండూ పట్టుకుని దాన్ని అటూ యిటూ గుంజటం మొదలెట్టాడు. ఇంతలో ఆవు పలుపు తెంచుకుని, కొమ్ములు విసురుతూ ఆ కుర్రవాణ్ణి పొడవబోయింది. అక్కడ కూచున్నవారంతా ఏం చెయ్యటానికీ తోచక బిత్తరపోసాగారు. చండి చటుక్కున పైటకొంగు నడుముకి బిగించి, ఆ కుర్రవాడి కడ్డంగావచ్చి నిలబడి, ఆ ఆవు కొమ్ముల్ని రెండు చేతుల్లోనూ గట్టిగా పట్టుకుని, బలంగా వెనక్కి తోసేసింది. అంత బలిష్ఠమైన గోమాత ఇహ ఒక్క అడుగుకూడా ముందుకు వెయ్యలేకపోయింది. ఇంతలో వారి పాలేరువచ్చి, ఆవును తోలుకెళ్ళి మామూలుచోట కట్టేశాడు. చండి ఒక్క తోపుతోయ్యటంతో ఆ ఆవు పొగరంతా అణిగిపోయిందన్న సంగతి మాత్రం అందరికీ స్పష్టంగా తెలిసిపోయింది.

చండి అక్కడినుంచి మళ్ళీ హాల్లోకి వచ్చి, అందరికన్న ముందు తండ్రికి నమస్కరించి, తర్వాత జంకూగొంకూ లేకుండా, తమ పరగణాకంతటికీ ప్రభువయిన హరినారాయణ బాబుకి నతశిరస్కయై నమస్కరించింది. అత డిప్పటిదాకా విస్తుపోతూ చండికేసి చూస్తూ కూచున్నాడు. చండి తన పాదాలకి నమస్కరించగానే, అప్రయత్నంగా తన చేతులతో ఆమెని లేవనెత్తి, ఆమెచేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని "చేతుల నొప్పి యొక్కలేదుకదా!" అని అడిగాడు.

చండి తలవంచుకుని చిరునవ్వు నవ్వుతూ "ఊహూఁ" అన్నది.

అంతా నిశ్శబ్దం. ఎవ్వరూ ఏం మాట్లాడలేదు. అందరి చూపులూ హరినారాయణ మీద, చండీమీదనే ఉన్నాయి. గంగూలీ బాబు అయిదు నిమిషాలు ఆమె హస్తరేఖలన్నీ పూర్తిగా పరిశీలించాక "నువ్వే జయించావు తల్లీ! నువ్వు చండివిగానే రావాలి మా యింటికి" అన్నాడు.

తర్వాత చటర్జీకేసి చూస్తూ "సంశయమనక్కడనయే మీ అమ్మాయిని చూడటానికి వచ్చాను. చెవులతో వినటం, కళ్ళతో చూడటం—ఈ రెంటికీ చాలా వ్యత్యాసం ఉంది. ఈమె ఇక్కడ అడుగు పెడుతూనే నా సంశయాన్ని మొదలంట తీర్చేసింది. తన పేరును సార్థకం చేసుకుంది. నేను చూడటం అయిపోయింది. ఇంక నేను చెప్పవలసింది కూడా ఏమీ లేదు. మీ కేదయినా అడగవలసింది ఉంటే అడగండి" అన్నాడు.

"ప్రభువులయెదుట మాకింక అడగవలసిందేముంటుంది? తమ ఆజ్ఞప్రకారం పిల్లని తమసన్నిధికి తీసుకొచ్చి నిలబెట్టాను. ఇహ అన్నిటికీ తమ చిత్తం, మా భాగ్యం..."

"నేను వచ్చి మీ అమ్మాయిని ఎలా పరీక్షించి తెలుసుకున్నానో, అలాగే మీరు కూడా వచ్చి మా జమీందారుబిడ్డని చూసుకోవటం మంచిదనుకుంటాను"

"అదేమీ అవసరం లేదు ప్రభూ! తమరు దయాహృదయులై మా అమ్మాయిని చూడటానికి వచ్చారు, వచ్చిందని సెలవిచ్చారు. అలాంటప్పుడు ఇంక నేనేం యెదురు చెప్తాను?"

"అయితే ఇహ పంచాంగం తెప్పించండి. లగ్నం పెట్టిద్దాం" అని జమీందారుగారి ముఖతః ఆజ్ఞ వచ్చింది.

పంచాంగం అక్కడే ద్వారబంధంమీద ఉంది. అది ఆయనచేతులోకి రావటానికి ఎంతోసేపు పట్టలేదు. అందరూ ఆయన పంచాంగం చూసే భంగిమనే చూస్తున్నారు. ముహూర్తం ఎప్పుడు నిర్ణయిస్తారో తెలుసుకుందామనే అందరికీ ఉబలాటంగా ఉంది.

కొద్దినిమిషాల్లోనే ముహూర్తం నిర్ణయించి జమీందారుగారు అక్కడున్న వారందరికీ ఆనందంతో తెలియచేశారు. "ఫాల్గున శుద్ధ త్రయోదశి బుధవారం. చాలా బాగుంది ఆ ముహూర్తం. ఆ ముహూర్తానికి మీరు ఏర్పాట్లన్నీ పూర్తి చేసుకోండి బావగారూ!" అన్నాడు.

బావగారు! తలవనితలంపుగా వచ్చిన ఈ సంబోధన చెవుల కింపుగానే ఉంది. కాని ముహూర్తం నిర్ణయించిన తిథి చెవిని పడేసరికి చటర్జీమనస్సుకి కొంచెం గుంజాటన ఏర్పడింది. ఇంత అవ్యవధానంగా ఆడపిల్ల పెళ్ళి ప్రయత్నాలు పూర్తి చేసుకోవటం ఎలా? అతడు కొంచెం చిన్నపుచ్చుకుని, చేతులుజోడించి, తడబడుతున్న కంఠంతో తన గుంజాటన బయటపెట్టాడు. "ప్రభువులమాటకు మళ్ళీ బదులు చెప్పటం దుస్సాహసమే అనుకోండి. అయినా పరిస్థితినిబట్టి విన్నవించుకోక తప్పనిసరవుతోంది. వచ్చే త్రయోదశి అంటే ఘట్టిగా పదిహేను రోజులుకూడా వ్యవధి ఉన్నట్టు లేదు—"

జమీందారు ఈ నివేదనంతా పూర్తిగా వినకుండానే మధ్యలో అడ్డువచ్చి "ఇది ఏమంత తక్కువ వ్యవధి చటర్జీగారూ! అవసరం వచ్చిందంటే మనం రాత్రికి రాత్రి చెరువులు త్రవ్వించగలం, కుళ్లు కట్టించగలం, తోటలు వేయించగలం...మీకు తెలియనిదేముంది? హరినారాయణ గంగూలీ నోటివెంట మాట వచ్చిందంటే ఇహ దానికి తిరుగుండటానికి వీల్లేదు. ఆ ముహూర్తమే ఖాయం" అన్నాడు.

ఇంక ఆయనమాటకి ఎదురుచెప్పటానికి ఎవరూ సాహసించలేకపోయారు. తర్వాత అలా అన్న జమీందారే చండివైపుకి తిరిగి "నిన్ను ఊరికే చూసిపోదామనే ఉద్దేశ్యంతోనే వచ్చాను తల్లీ! ఇవాళ ఉత్త మాటలతోనే 'ఆశీర్వాద లాంఛనం' జరిపి వెళ్ళిపోతున్నాను. అయినా నీతో చెప్పకుండా ఉండలేకపోతున్నాను. ప్రధానంనాడు నీకు నేను 'ఇవ్వవలసిన బహుమతి. నీ ఇష్టమైనది నువ్వు కోరుకునేట్లయితే, అది నా శక్తికి మించనిదై ఉండి, దాన్ని నీనోటిమీదుగా అడిగితే చాలా సంతోషిస్తాను నేను" అన్నాడు.

అక్కడున్న వారందరికీ మళ్ళీ అమితాశ్చర్యం వేసింది. చండి ఏంకావాలని కోరుకుంది? ఆమె ఏంకోరుకుందో వినాలని అందరూ చెవులు రిక్కించుకు కూచున్నారు.

చండి ఏమీ తడబడకుండా సహజమైన కంఠంతోనే తన కోరికను తెలియచేసింది. "అలా సెలవిస్తున్నారు కనుక తమరు మా ఊళ్ళో ఒక చక్కని విద్యాలయాన్ని

స్థాపించండి. వివాహమయిన మర్నాడు భోత్సవంచేసి, తమ యింట 'గృహ ప్రార్థన ఏమీ లేదు"
సే నా నూతనవిద్యాలయానికి ప్రారంభ ప్రవేశం' చేస్తాను. ఇంతకు మించి నా అక్కడున్నవారంతా నిర్ఘాంతపోయారు!

★ స్వయంసిద్ధ ★

హరినారాయణబాబుకూడా అప్పటివరకూ ఉలుకూ - పలుకూ లేని చండిముఖంకేసి విస్తుబోయి చూస్తున్నాడు. మరుక్షణంలో ఆయనే ఆ నిశ్శబ్దతను భంగం కలిగిస్తూ "ఆశ్చర్యం! నేనిప్పటివరకు అనేకమంది ప్రార్థనలు వినిఉన్నాను. కాని నాముందు ఎవరూ ఇంత చిత్రంగా రూపించినట్టు ఇలాంటి కోరికను ఇంతధీమాగా కోరలేదు. గంగూలీ వంశానికి ఆదర్శప్రాయురాలైన వధువులాగా నువ్వు నీకాబోయే మామగారి వితరణ గర్వాన్ని ఈ కోరికతో అణచగలిగావు. నువ్వు కోరటం - ఆ కోరినదాన్ని నేను ఇవ్వటం - ఈ రెండింటి సార్థకత ఎలా పరిణమిస్తుందో అన్నదే ఇప్పుడిహ సమస్య అమ్మాయీ!" అన్నాడు.

3

హరినారాయణబాబు మాసినవెళ్ళాక - చండీ లోపలికి రాగానే - తిరుగుబాటుగా వాళ్ళా-ఇంట్లో వసేలా పడిమంది ఆమెని ముట్టేశారు. ఎవరికళ్ళలో చూసినా ఆశ్చర్యమే! ఎవరి ముఖాల్లో చూసినా ఆశ్చర్యమే! మహిషాసురమర్దనిలా ఏదో అసాధ్యకృత్యాన్ని సాధించి విజయపతాక ధరించివచ్చినట్టుంది చండి వాళ్ళ దృష్టికి. "అంత గొప్పవాడాయన. ఆయన ముందు అంత నిర్భయంగా అన్నిమాటలు ఎలా మాట్లాడగలిగావే!" అందరినోటా ఇదే ప్రశ్న.

వాళ్లు తనని చూసి ఇంత ఆశ్చర్యపోతున్నా - చండి ఆకృతిలోగాని, ఆచరణలో కాని పిసమంతైనా మార్పు కన్పించలేదు. ఆమె ఇంతకుముందు ఎంత నిస్సంకోచంగా వీధివైపు హాల్లోకి వెళ్ళిందో మళ్ళీ అంత నిస్సంకోచంగానే లోపలికి వచ్చింది. అందరి ముఖాల్లోనూ, అందరి మాటల్లోనూ ఆశ్చర్యం వ్యక్తమవుతూండేసరికి, ఇంతకుముందు జరిగిన సంఘటనకి వీరంతా నిశ్చేష్టులై ఉంటారని గ్రహించింది ఆమె కొంచెం పరిహాసంగా నవ్వుతూ "నేనేమంత ఎక్కువగా మాట్లాడాను! కాదా అంటే కాస్త జలగమీద సున్నం చల్లి వచ్చాను. అంతేగా!" అన్నది.

అందరూ నిశ్చేష్టులై చండికేసి వింతగా చూడసాగారు. ఈ చటర్జీగారి కుటుంబానికీ - అదే వీధిలోని మైత్రాగారి కుటుంబానికీ చాలా స్నేహం. చండితల్లి మైత్రాగారి భార్యని 'వదినా' అని పిలుస్తూ ఉంటుంది. దాన్నిబట్టి చండికి కూడా ఆమెని అత్తా అని పిలవటం అలవాటయింది. "విన్నావా రత్రా పిల్లదాని మాటలు!" అంటూ ఆమె వీరందరి విస్తుపాటుకీ భంగం కలిగించింది.

చండిముఖంలోని చిరునవ్వు మాయమైంది. కొంచెం అభిమానపడుతూ "ఎందుకని అత్తా? నేనేం అన్యాయంచేశానో చెప్పు. 'నేను మాటంటే దాని కిహ తిరుగుండటానికి వీల్లేదు' అని ఆయనే అన్నారుగా, నాన్న ముఖంమీద! అవసరమైతే రాత్రికి రాత్రి చెరువులు త్రవ్వించేవారు, గుళ్ళూ గోపురాలూ కట్టించేవారాయె! ఏదో దయతలచి ఈ వివాహానికి రంగువారాలైనాగడువిచ్చారు...అందుకనే నేను వారికి అసలైన జవాబు చెప్పాను" అన్నది.

"జవాబంటే జవాబా! ఇంటిల్లిపాది నీ మాటలు విని ఆశ్చర్యపోవటం కాదు, మూర్ఛపోయారనుకో...మగవాడు, పైకి ఏమన్నా అనకపోయినా మనస్సులో ఏమనుకున్నాడో ఎవరికి తెలుసు!" అన్నది మైత్రా గృహిణి.

"ఆయనంత తెల్లబోయీ ఉండరు. మనస్సులో ఏమీ అనుకునీ ఉండరు. ఇహ నా సంగతంటారూ! 'ఇది ఒట్టి సిగ్గుమాలిన పిల్ల' అని వారు అనుకోటానికి నేనైనా అనుచితమైన కోర్కె యేమీ కోరలేదు"

"ఈ కోరిక కోరి, నువ్వుమాత్రం మహా బావుకున్న దేమిటే పిల్లా? ముసిలాడు ఊరికే రెండక్షింతలగింజలు నెత్తి నేసి అవునవిపించుకుని వెళ్ళాడు కాని, చేతులో చిన్న మెత్తు బంగారమైనా పెట్టి వెళ్లాడా? ఊళ్లో బడి పెట్టిస్తే నీ కోరికలన్నీ తీరతేమిటి? నీకు ఒరిగేదేమిటే మహా?"

చండి ఈమాటకి జవాబేమీ చెప్పకుండా నవ్వి ఊరుకుంది. కాని ఆ నవ్వులోని అసలు రహస్యాన్ని ఆమెతల్లి బయటపెట్టింది. ఆమెకూడా నవ్వుతూనే "మాట వచ్చిందంటే ఇది అన్నం నీళ్లూకూడా మరిచిపోతుంది వదినా! దీని కిక్కడికి వచ్చినప్పట్నుంచీ ఆ మిషనరీవాళ్లబడి అంటే ఎంతకోపమో, ఆ మిస్సమ్మని అప్పుడెన్ని తిప్పలు పెట్టిందో మీకు తెలుసుగా ఊళ్ళో ఆడపిల్లలంతా ఆ స్కూలుకి వెళ్ళటం మొదలెట్టి, తమ దేముళ్ళని తలచుకోటం మరిచిపోయి - ఏసుక్రీస్తు కథలు చదవటం అలవాటు పడ్డారని దాని కొకటే దిగులు. ఈ దిగులు తీరటానికి అది ఎంతమంది దేముళ్ళకి ప్రాణ్ణాచారాలు పడుతున్నా పడుతుండనుకుంటా - ఏదో భగవంతుడే దాని మనస్సులోవెతను ఈ విధంగా తీర్చదలచుకున్నాడనుకుంటున్నా. దీని పెంకితనం, పట్టుదల చూసి, నే నెంత దిగులు పెట్టుకున్నానను కున్నావ్ వదినా! దాని పట్టు వదిలించటం ఎవరితరం? ఈ తీరు దిది ఎవరింట్లో పోయి పడుతుందో అని తలపుకువచ్చినకొద్దీ నా కెంతో ఆందోళన పుట్టుకొచ్చేది. అన్నం-నీళ్లూ సయించేవి కావు. ఏదో మీ అందరి ఆశీర్వాదంవల్ల తల్లి సర్వమంగళ దాని అభిమానాన్ని ఈ విధంగా కాపాడింది" అన్నది.

"నీ కూతురు ఎంత పెడసరంపిల్లయినా కానీ, దాని నోరు ఎంత మంచిది కాకపోనీ అది అసలు రాణి అయే అదృష్టంతోనే పుట్టిందన్న సంగతి అందరూ ఒప్పుకుతీరాల్సిందే అనుకో! లేకపోతే చుట్టుపక్కల పదేనిమిది గ్రామాలకీ - అసలీ ప్రాంతానికంతటికీ ప్రభువుల్లాంటివారయిన బాసలీజమీందార్ల యింటికి నీ కూతురు కోడలుగా వెళ్ళకలిగిందేనా చెప్పు?" అన్నది మైత్రాభార్య గంభీరంగా.

మర్నాడు తెలతెలవారుతూండగా ఊరంతా సందడిగా ఉన్నట్టుండటంతో, ఇళ్ళల్లోనివాళ్లంతా వీధి గుమ్మాల్లోకి వచ్చి విస్తుబోయి చూస్తూ నిలబడ్డారు. ఊళ్ళో రచ్చబండప్రాంతాల్లో ఏదో తిరునాళ్ళలా ఉంది. ఎడ్లు, బళ్ళు, కూలీలు— ఎంతోమంది జనం పోగయినా తక్కువే. అంతా ఒకటే కోలాహలం. అప్పుడే ఒకవైపునుంచి ఇటిక గోడలు కట్టడం ప్రారంభమయింది. ఇంజనీరు, తాపీ మేస్త్రీలు, లెక్కలేనంతమంది కూలీలు నిశ్శబ్దంగా నియమపద్ధతిని చకచకా ఎవరి పనులు వారు చేసుకుపోతున్నారు. నిన్నటిదాకా మైదానంలా ఉన్న ఆ ప్రదేశమంతా ఇప్పుడు ఇటికలతో, ఇసుకతో, సున్నంతో నిండిపోయింది. మరి కొంతమంది ఉద్యోగులు పైన అజమాయిషీ చేస్తున్నారు.

చండి హరినారాయణబాబుని అర్థించటం, ఆయన అలాగేనని వాగ్దానం చెయ్యటం— ఈసంగతంతా క్రితంరోజు నే ఊరంతా ప్రాకిపోయింది. అంచేత ఇదంతా కాబోయే కోడలు కోరిన అసంభవమైన కోర్కెను, సంభవమని నిరూపించేందుకు బాసలీ జమీందారు తలపెట్టిన కార్యకలాపం - అని ఊళ్ళోవాళ్లు వెంటనే గ్రహించారు. ఎక్కడ చూసినా ఈప్రస్తా

వనే! ఎవరింట్లో చూసినా చండినిగురించీ, ఖండప్రచండుడయిన బాసలీ జమీందారు గారి ఈ బ్రహ్మాండమైన ప్రయత్నాల్ని గురించీ చిత్రవిచిత్రమైన కథలుగా చెప్పుకునేవాళ్ళే.

ఎర్రచీర కట్టుకున్న సంజెపడతి అప్పుడప్పుడే పడమటి కొండమీదినుంచి క్రిందికి దిగింది. దీపకాంతులు ఇళ్లలోని చీకట్లను దూరదూరంగా తరిమివేస్తున్నాయి. సరీగ్గా యిదేసమయంలో చటర్జీ గారి దేవిడీ ముందు రెండు గుర్రాల బగ్గీ ఒకటి వచ్చి ఆగింది. తలగుడ్డ ధరించిన పంజాబీ కోచ్‌మన్ చటుక్కున దిగివచ్చి బగ్గీ తలుపులు తెరవగానే చండికి కాబోయే మామగారు హరినారాయణబాబు ముందు, ఆయన వెనుక లెదర్ బాగ్ చేతపుచ్చుకుని వారి దివాన్ రాధానాధబాపూలీ దిగారు. అతడుకూడా ఆజానుబాహువూ - హరినారాయణబాబులాగానే వయసు చెల్లినవాడూ.

కరాలీచటర్జీ బయట వసారాలో కూచుని, ఆత్మీయులతోనూ, తమ పురోహితుడితోనూ ఈ వివాహవిషయమే సంప్రదిస్తున్నాడు. బండివచ్చి వాకిలిముందు ఆగిన ధ్వని అందరూ విన్నారు. అతడు నౌకర్ని ఉద్దేశించి "ఎవర్రా వచ్చింది?" అని అడిగాడు.

ఆ సమయంలో నౌకర్లెవరూ అక్కడ లేరు. "మేమే వచ్చింది బావగారూ! అనుకోకుండా హఠాత్తుగానే వచ్చాం" అని హరినారాయణబాబే అతడి ప్రశ్నకు సమాధానం యిస్తూ, వివాహం జరగబోయే సావడిలోకి వచ్చాడు.

చాపలమీద కూచునిఉన్నవాళ్లందరూ కంగారుగా లేచి నిలబడ్డారు. ఈ సమయములో హరినారాయణబాబు వస్తాడనేది వాళ్లు ఊహించనేలేదు. తనకు కలిగిన అపరిమితాశ్చర్యాన్ని కొంతవరకు తమాయించుకుని, చేతులు జోడించి, "చిత్తం, చిత్తం, దయచేయండి. దయచేయండి. ఒరేయ్! ఎవర్రా అక్కడ? చప్పున కాళ్లు కడుక్కునేందుకు నీళ్ళు తీసుకురండిరా." అని చటర్జీ గారు లోపలికి కేకేశాడు.

హరినారాయణబాబు అతడి మాటలకి అడ్డువచ్చి, "ఆగండాగండి, మీరేమీ హడావిడి పడకండి అవేమీ అవసరంలేదిప్పుడు. అమ్మాయి చండి విద్యామందిరం నిర్మించాలని ఆజ్ఞాపించి, ఈ ముసలివాణ్ణి ఎంత ఇరకాటంలో పెట్టిందీ తెలుసుగా మీకు! ఆ అజమాయిషీ పనిమీదనే వచ్చాను అసలు. ఈ సదవకాశంలో మళ్ళీ మా తల్లిని మరోసారి చూసిపోదామనే ఉత్కంఠకొద్దీ ఇక్కడికి వచ్చాను" అన్నాడు.

పురోహితుడు ముందుకు వచ్చి, "చూడక పోవటమేమిటి? తప్పకుండా చూసి వెళ్లండి. కాని వచ్చినవారెటూ రానే వచ్చారు కనుక కాసేపు కూచోక తప్పదు. రవంత ఫలాహారం అదీ—"

హరినారాయణబాబు మళ్ళీ నవ్వుతూ "ఇప్పుడా ప్రమేయమంతా తలపెట్టొద్దు భట్టాచార్యులుగారూ! ఎందు కిప్పుడు? అనవసరం. మేము ఇలా హఠాత్తుగా అమ్మాయిని చూడాలనే సంకల్పంతోనే ఈ రావటం. అమ్మాయి ఇప్పుడేం చేస్తోంది బావగారూ?" అని అడిగాడు.

"ఈ వేళప్పుడు రోజూ పూజాగృహంలోనే ఉంటూఉంటుంది హారతి ఇవ్వటం ముగించి ధ్యానశ్లోకాలు పఠిస్తూ ఉంటుందనుకుంటాను బహుశా" అన్నాడు కరాలీ చటర్జీ

హరినారాయణబాబు ఉల్లాసంతో "'యాదృశీ భావనాయస్య సిద్ధిర్భవతి తాదృశీ' అన్నారు పెద్దలు. అయితే ఇప్పుడు చండి ఇంకా యథాస్థానంలోనే ఉండి ఉంటుందన్నమాట! మమ్మల్ని ఇద్దర్నీ ఆ పూజాగృహం దగ్గరకి తీసుకెళ్లండి బావగారూ! ఆమె తాలూకు ఒకవిధమైన రూపురేఖల్ని నిన్న చూశాను. ఇవాళ మరొక రూపాన్నికూడా చూసి ధన్యుణ్ణిఅవుతాను. మీకేం అభ్యంతరం లేదుగా!" అన్నాడు.

కరాలీబాబు సవినయంగా "తమరలా సెలవీయకండి ప్రభూ! ఇదంతా కేవలం మా మహాభాగ్యం! అయితే ఇంతకీ కొంచెం సేపు కూచునేటంత సావకాశం లేదంటారా తమకి?" అని అడిగాడు.

హరినారాయణబాబు ఇదివరకులాగానే మళ్ళీ - "నా మాటకి తిరుగనేది ఉండటానికి వీల్లేదు బావగారూ! మరో మాట. మేము ఇలాగే హఠాత్తుగా అమ్మాయి ఉన్నచోటికి వెళ్ళి, ఆమెని విస్తుబోయేట్లు చేయాలి. మేము వచ్చినట్లు ముందుగా ఆమెకి కబురు పంపవద్దు. ఈ ముసలివాళ్ళిద్దరూ మీ వెనకాలే లోపలికి వస్తున్నందుకు మీరేమీ తప్పుగా యెంచవద్దు. ఎంచేతంటే మేము కాళ్లుకూడా కడుక్కోకుండా సరాసరి పూజాగృహందగ్గరకే వస్తున్నామంటే - అది కేవలం మా చండిని చూసి పోదామనే ఉత్కంఠతోనే..." అన్నాడు.

ఈ ప్రాంతానికంతకీ రత్నంలాంటివాడీయన. వంశగౌరవంలో, అభిమానంలో, ఐశ్వర్యంలో, ధైర్యసాహసాల్లో - ప్రతి విషయంలోనూ ముందు ఈ జమీందారు గారి పేరు చెప్పి, తర్వాత ఇంకొకరి పేరు చెప్పాల్సిందే. అంచేతనే ఆయన సద్గుణాలతోపాటు - ఆయన తాలూకు కొన్ని తిక్కలక్షణాలుకూడా జనసామాన్యానికందరికీ తెలుసు. ఆయన పెదవులమీదనుంచి వచ్చినమాటకి అటు ప్రొద్దు ఇటుపొడిచినా తిరుగులేదు. ఆయన మనస్సులో ఏపని చెయ్యాలని అనుకున్నా, ఫలానాపని నేను చేస్తానని ఎవరికైనా మాట ఇచ్చినా ఇహ అది పూర్తిచేసేటంతవరకు ఊరుకోడు. కనుక ఇలాంటి జమీందారుగారికి తలవని తలంపుగా కలిగినకోర్కెను తీర్చటానికి కరాళీబాబు కంగారుపడ్డాడంటే ఆశ్చర్యమేముంది? సహజమే అది!

నడిమి వాకిలి దాటగానే కుడివైపున తూర్పు పడమరలుగా ఉన్న దొకయిల్లు. అందులోనే ఒకవైపున పూజాగృహం ఉంది. అక్కడ ఎత్తయిన వేదికమీద ఓ కలశం పెట్టిఉంది. ఆ కలశంముందు ఇత్తడిపీటమీద సాలిగ్రామాలూ, గోడని వివిధదేవతల చిత్తరువులూ, కలశానికి సరిగ్గా వెనుక పెద్ద కాళీ చిత్తరువు. వేదికముందు రాగిగంగచెంబులూ, పూలసెజ్జ, శంఖం, ఘంట మొదలైనవన్నీ అమర్చబడి ఉన్నాయి. రెండుప్రక్కలా ఇత్తడి స్తంభాలమీద దీపాలు వెలుగుతున్నాయి ఆ చిరువెల్తురులో పూజామందిరం సౌందర్యం స్పష్టంగా భాసిస్తోంది. ఆ మందిరమంతా ధూపదీపాల సుగంధంతో ఘుమఘుమాయిస్తోంది. చండి చిత్రాసనంమీద పద్మాసనం వేసుకుకూచుని, భావోద్దీపితమైన దృష్టిని దేవి చిత్తరువు మీద నిలిపి మృదుమధురంగా దేవీ స్తోత్రాన్ని పఠిస్తోంది—

'—జయా మమాగ్రతఃపాతు
విజయాపాతు పృష్ఠతః
నారాయణీ శీర్షదేశే సర్వాంగే
సింహవాహినీ
శివదూతీ ఉగ్రచండా ప్రత్యంగే
పరమేశ్వరీ
విశాలాక్షీ మహామాయా కౌమారీ
శంఖినీ శివా
చక్రిణీ జయదాత్రీచ రణమత్తా
రణప్రియా
దుర్గా జయన్తీ కాళీచ
భద్రకాళీ మహోదరీ
నారసింహీ చ వారాహీ సిద్ధిదాత్రీ
సుఖప్రదా
భయంకరీ మహారౌద్రీ మహాభయ
వినాశినీ...'

★ స్వయంసిద్ధ ★

చండి తన్మయురాలై ఇలా స్తోత్రం చేస్తోంది. తన వెనుక కొందరు వ్యక్తులు వచ్చి నిలబడ్డారన్న సంగతి ఆమె గమనించనేలేదు. స్తోత్రం పూర్తిచేసి నత శిరస్కయై ఆమె దేవికి నమస్కరించగానే "ఇందుకే నేను ఇలా హఠాత్తుగా పూజాగృహానికి వచ్చింది బావగారూ! ఇలా వచ్చాను కనుక అమ్మాయిలోని ఈ వినూత్న రూపాన్ని చూడగలిగాను" అన్నాడు హరినారాయణబాబు.

చండి తలయెత్తి చూస్తూనే చకితయై, ముందు తండ్రికి తర్వాత తన తండ్రియీడు వాడైన ఆ ఇద్దరు పెద్దలకీ పాదాభివందనం చేసింది. ఆమె పైకి ఏమీ మాట్లాడలేదు. కాని ఆమె ముఖంలో నిరుపమానమైన జ్యోతి భాసిస్తోంది.

హరినారాయణబాబు ఎంతో సంతుష్టుడై అన్నాడు — "అమ్మాయి ఈ వయస్సులోనే ఇంత తేజస్సును ఎలా పొందగలిగిందో ఇప్పుడు తెలుసుకున్నాను బావగారూ! మొన్న బాహ్యసౌందర్యాన్నే చూసి ముగ్ధుణ్ణయాను. ఇవాళ ఈమె హృదయంలో భాసిస్తున్న ఈ దివ్యజ్యోతి కేవలం కళ్లకే కాకుండా మనస్సుకు కూడా నిండుగా కన్పిస్తోంది. ఏమంటావ్ బాపూలీ? నువ్వేమీ మాట్లాడవేం?"

దివాన్ రాధానాథ బాపూలీ ఇప్పటివరకూ విముగ్ధుడిలా చండికేసే చూస్తూ నుంచున్నాడు. ప్రభువుగారి ప్రశ్నతో అతడి పరధ్యానం వదిలింది. అతడేమీ తొణక్కుండానే "అసలు మీరు అమ్మాయిని చూసిరాగానే చెప్పారుగా నాతో! మీకు మీరై ఎవర్నీ అంతలా ప్రశంసించగా నేనెప్పుడూ వినలేదు. మనిషి మొహం చూడగానే వాళ్ల అంతర్యం ఎలాంటిదయిందీ చెప్పెయ్యగలనే అపఖ్యాతి ఒకటుంది నాకు. ఆ నిదానంతోనే అమ్మాయి స్వభావం ఎలాంటిదై ఉంటుందా అని ఆలోచిస్తున్నాను ఇందాకట్నుంచీ" అన్నాడు.

"గురించావా? ఇంకా ఓ నిశ్చయానికి రాలేదా?"

"నా నిశ్చయం అయిపోయింది."

"మాటలతీరు ఎలాంటిదో వినకుండానే?"

"మేలిమి బంగారాన్ని చూడగానే తెలుసుకోవచ్చు. గీటురాయిమీద ఒరిపిడి పెట్టాల్సిన పనిలేదండీ!"

హరినారాయణబాబు పూజాగృహం ప్రతిధ్వనించేట్లు నవ్వుతూ "అయితే నేనేమీ మోసపోలేదంటావన్న మాట?" అని అడిగాడు.

"ఇంతవరకు బాబులీ హరినారాయణ గంగూలీగారు ఎన్నడూ ఎవరి చేతిలోనూ మోసపోలేదు" అని ఆయన ప్రశ్న ఇంకా పూర్తికాక మునుపే సమాధానం చెప్పేశాడు.

ఒక్క నిమిషంలో హరినారాయణగారి అందమైన ముఖం నల్లబడిపోయింది. ఆయన దివానుకేసి కోరచూపులు చూస్తూ "నువ్వేదో మెరమెచ్చులకి అన్న మాటలా ఉందిది బాపూలీ! నిజం చెప్పు ఎప్పుడూ నేనే జయిస్తూవచ్చానంటావా? అయితే మరి ఆత్మీయులదగ్గిర మోసపోయి ఇరకాటాన పడటం, అన్న మాట నిలబెట్టుకోవాలని హడావిడిగా పరుగెత్తుకు రావటం-ఇదంతా ఒకరకంగా మోసపోవటం కాదంటావా బాపూలీ?" అని అడిగాడు.

దివాన్ ఏమాత్రం తెల్లబోకుండా "అందులో మీరు మోసపోయిందేమీ లేదు. ఈవిషయమై మీతో ఇదివరకు నేనెప్పుడూ తర్కించలేదు, ఇకముందు కూడా తర్కించను. అయినా జగన్మాత మీ ప్రతిష్ఠ నిలబెడుతుంది అనటానికి ఇదే సూచన" అన్నాడు.

ఈ వృద్ధులిద్దరి సంభాషణా, తన తండ్రితో పాటు చండికూడా తెల్లబోయి వింటూ ఊరుకుంది. ఏదో నిగూఢ విషయంలా వుంది; బోధపడేట్లు లేదు.

హరినారాయణబాబు మళ్ళీ అక్కడున్న వారంతా ఉలిక్కిపడేటంత బిగ్గరగా నవ్వుతూ "ఆ మాటమీద ఆ మాటమీద మా సాంసారిక విషయాలేవో వచ్చాయి. దివాన్‌జీ ఆ విషయం ఇప్పుడు నిష్కర్షగా తేల్చి చెప్పేశారు. ఆ ప్రసక్తి అంతటితో వదిలేసి ఇహ ప్రస్తుతవిషయమే మాట్లాడతాను.........ఆ(. మొన్న నిన్ను ఒక్తినే చూసివెళ్లటం అయిందమ్మాయీ! ఈ వృద్ధుడు ఉత్త పిసినారిలా ఉన్నాడు - ఉత్తి చేతులతో వచ్చి వచ్చిందని లగ్నంకూడా పెట్టుకు వెళ్ళాడు - అని బహుశా నీ మనస్సుకి కష్టంతోచి ఉంటుందనుకుంటాను. అవునా అమ్మా?" అన్నాడు.

చండి తల పైకెత్తి "అదేమిటి! నాకసలు ఆ ఆలోచనే రాలేదు. నేను అనుకున్నది మీ రూహించినదానికి పూర్తిగా విరుద్ధం బాబా" అన్నది నిస్సంకోచంగా.

ఈ 'బాబా' అన్న సంబోధన జమీందారుగారి హృదయాన్ని చటుక్కున కదిలించింది. అతడా దౌర్బల్యాన్ని అణచుకుని "ఏమనుకున్నావమ్మా?" అని అడిగాడు.

"అసలు లగ్ననిశ్చయం, మీరు చేసుకువెళ్ళినంత ఉదాత్తంగా ఈ ప్రాంతాల్లోనే కాదు - ఈ దేశంలోనే ఎవరూ చేసుకువెళ్ళలేదనుకున్నాను."

గంగూలీ బాపూలీ ముఖంకేసి చూస్తూ "చూశావా బాపూలీ? నాతల్లి యెలా అంటున్నదో!" అన్నాడు.

"నేనందుకనే మేలిమిబంగారాన్ని చూడగానే తెలుసుకోవచ్చునని మొదట్లోనే మనవిచేశాను."

"నిజానికి నువ్వన్నమాటకి అసలైన సమాధానం ఇదీ! ఈ దేశంలో కౌర్యదక్షులికి కొదువలేదు తల్లీ! కాని వారెక్కడున్నది పతికి తెలుసుకునేవారే తక్కువ. అనేక విధాలైన దానాలు చెయ్యగలిగినవారెందరో ఉన్నారు. అయితేయేం — వారు ఏదైనా ఇచ్చేముందు—తాము ఇచ్చిన దాన్ని సార్థకం చెయ్యగలిగినవారిని చూసి ఇవ్వాలికదా! నేను మొన్న కల్పతరువులాగానే నిలబడి కావలిసింది కోరుకోమన్నాననుకో. మామూలు ఆడపిల్లలయితే ఏంకోరుకుని ఉండేవారంటావ్? అసలు ఎవరూ బహుశా నోరు తెరిచి అడగగలిగేవారుకాదు. అథవా అడిగినా సిగ్గుతో సతమతమవుతూ 'తమరేది యిచ్చినా సరే' అని మాత్రం అనగలిగేవారేమో! కాస్త ధైర్యంకల పిల్లఅయితే ఏడువారాల నగలు చేయించమనో ఇలాంటిదే మరొకటేదో అడిగేది. కాని నువ్వుమాత్రం ఈ దేశంలో ఎన్నడూ ఏ వధువూ కోరని కోర్కె కోరావు. అసలిలాంటిది కోరవచ్చునని ఎవరి ఊహకీ తట్టికూడా ఉండదు. కౌర్యదక్షులెవరో గ్రహించి వారిని ప్రేరేపించటం అంటే ఇలాంటిదే నేను ఇస్తానన్నదానిని నువ్వు సార్థకపరుస్తున్నావు. కాని ఒక్క విషయం. నేను ఇచ్చిన దానికన్న నువ్వు చేసినత్యాగమే గొప్పది. నీ జన్మభూమికోసమని, నీయీడు బాలికలకోసమని మహోన్నతమైన త్యాగంచేశావని నా ఉద్దేశం."

చండి తలవంచుకుని "మీరూరికే పొగిడి నన్ను సిగ్గుపరచవద్దు బాబా! ఈ ప్రాంతాల్లో మీ కీర్తి ఎంత చిరస్థాయిగా—"

హరినారాయణబాబు ఆ మాటకి అడ్డువచ్చి, "ఈ కీర్తి నాదికాదమ్మా నీది!... ఇహ ముఖ్యమైన పని ఇప్పుడు ముగిస్తాను.

బాపూలీ! ఏదీ ఆ బాగ్ తెరిచి ఇలా ఇయ్యి" అన్నాడు.

బాపూలీ తన చేతిలోని బాగ్ తెరవగానే అందులోని రత్నఖచితమైన బంగారు వస్తువులు అందరి చూపుల్నీ ఆకర్షించాయి.

హరినారాయణబాబు ఆ బాగ్‌లో చెయి పెట్టి నవ్వుతూ "ఈ వృద్ధుడు చేసే పనులన్నీ మొత్తానికేవో అసహజమైన పనులై ఉంటాయని నువ్వు ఈపాటికి గ్రహించే ఉంటావు. కనుక నా అభిరుచికి అనుగుణమైన ఆభరణాలతో నిన్ను అలంకరింప చెయ్యబోతున్నందుకు మాత్రం నువ్వేమీ అభ్యంతరం చెప్పకూడదు. ముందుగానే చెపుతున్నా" అన్నాడు.

ఇలా అంటూనే ఆయన బాగ్‌లోనుంచి అపూర్వ శిల్పంతో తయారుచేయబడిన రెండు బంగారు కంకణాలు పైకితీశాడు. అవి తయారింపులో అందంగా ఉండటమే కాక పరిమాణంలో కూడా పెద్దవిగా, ఎంతో బరువుగా ఉన్నాయి. హరినారాయణబాబే స్వయంగా ఆ కంకణాలను చండి చేతులకు పెట్టి, "ఆదిలక్ష్మికి అసలైన భూషణాలివే తల్లీ! ఈ హస్తకంకణాలు ఆమెకి ఒకప్పుడు కేవలం అలంకారాలుగానే కాక ఆయుధాలుగా కూడా ఉపయోగపడ్డాయి. ప్రాచీనకాలపు స్త్రీలు ఇలాంటి కంకణాలనే ధరించి తమ భర్తల ఆయుఃపరిమాణాన్ని ఎక్కువ చేసుకోగలిగారు. అవసరమయినప్పుడు వాటితోనే ఆత్మరక్షణకూడా చేసుకోగలిగారు. వీటితో గురిచూసి కణతలమీద ఒక్క దెబ్బకొడితే ఎంతటివాళ్లైనా తల గిర్రునతిరిగి హా-క్రొంతులయేవాళ్ళు. కాని ఈకాలపు వాళ్లుమాత్రం సగర్వంగా ధరించతగిన ఇలాంటి భూషణాలన్నిటినీ వదిలేసి—కేవలం సన్నసన్నని గాజులతో సరిపెట్టుకుంటున్నారు. పురుషులు కొందరు అంతేలే. అవసరమైతే ఆయుధంగా ఉపయోగించతగిన చేతికర్రల్ని తమ ఆరోగ్యంతోపాటు వదిలేసుకుని విలాసంగా ఎందుకూ కొరగాని చేతికర్రల్ని ధరిస్తున్నారు. అసలింతకీ నా ప్రశ్న యేమిటంటే. ఇవి నీకు నచ్చాయా?" అని అడిగాడు.

"'నీ వివాహానికి అందరూ చూసి ఆశ్చర్యపోయేట్లుగా రెండు కంకణాలు చేయిస్తాను చండీ!' అనేవారు మా తాతగారు. కాని ఆయ నిప్పుడు స్వర్గవాసులైనారు. ఆ మహాపురుషుని మనోరథాన్ని తమరు పూర్తి చేశారు బాబా! ఇహనుంచి రోజూ ఉదయం సాయంత్రం రెండువేళలా వీటిని భక్తితో కళ్ళకద్దుకుని ఇవాల్టి సంఘటనను స్మరించుకుంటూ ఉంటాను" అన్నది చండి.

హరినారాయణబాబు ఎంతో తమకంతో "విన్నావా బాపూలీ! 'మీ రింత ఖర్చుపెట్టి ఈ కంకణాల్ని అయితే చేయిస్తున్నారు కాని, ఈ కాలపు పిల్లలు వీటిని పెట్టుకో' రని వద్దన్నావుగా!" అని అడిగాడు.

"మీ తపస్సుకి సంతుష్టురాలై మీ కులదేవత మీకు నచ్చిన కోడల్ని సృష్టిచేసి ఉంచిందన్న సంగతి నేనప్పుడు ఊహించలేకపోయాను" అన్నాడు బాపూలీ.

తర్వాత మళ్ళీ బాగ్‌లోనుంచి మరో రెండు స్వర్ణభూషణాలని బయటికి తీసి, "నీ పేరుకి తగినట్లుగా నువ్వు లాంటి దానివే, నీ మామగారిని నేనూ అలాంటి వాణ్ణే, నేనిచ్చే కానుకలూ అలాంటివే. ఇవి రెండూ ఎన్నాళ్ళనుంచో మా యినప్పెట్టెలో పడివున్నాయి. మా తాతగారు మహేశ్వర గంగూలీగారు వీటిని మా నాయనమ్మకోసం చేయించారు. ఆమె అనంతరం ఈ యింటికి కోడళ్లుగా వచ్చినవారి కెవరికీ వీటిని ధరించగల శక్తిసామర్థ్యాలు లేకపోయాయి. వీటి నిప్పుడు నువ్వుధరించి, గంగూలీ వంశంలో లోపించిన శక్తిసామర్థ్యాలను నువ్వే పునరుజ్జీవింప చెయ్యాలి" అన్నాడు హరినారాయణబాబు.

మేలిమిబంగారంతో తయారైన ఈ ఆభరణాలు ఇంచుమించు రెండువందల కాసుల బరువున్నాయి. వాటిల్లోని హారాన్ని చండి మెడలో వేసి, శిరోభూషణాన్ని ఆమె శిరస్సున ధరింపచేసి, "ఇప్పుడు మాతల్లి సాక్షాత్తు మహాలక్ష్మిలా ఉంది" అన్నాడాయన.

చండి ఒకొక్కరికే అందరికీ నమస్కరించి శిష్టాచారాన్ని పాటించింది. క్రొత్త వస్త్రాలు కాని, క్రొత్త ఆభరణాలు కాని ధరించినప్పుడు చాలామంది ఆడపిల్లలు పెద్దలకందరికీ ఇలా నమస్కరించటం సంప్రదాయం. ఈ సంప్రదాయం హిందువులందరికీ సుపరిచితమైనదే...

"వాహ్! ఈ ఆభరణాల బరువుతో మా తల్లి రేమాత్రం క్రుంగిపోలేదు" అన్నారు జమీందారుగారు.

కరాలీచటర్జి నవ్వుతూ "ఇలాంటి విషయాల్లో మా అమ్మాయి ఏం ఫర్వాలేదు. ప్రభువులు వింటే ఆశ్చర్యపోతారేమో! మణుగు బియ్యం మూటనైనా సరే మాఅమ్మాయి సులాగ్గా ఒకచేత్తో పైకెత్తటం, దింపటం చాలాసార్లు చేసింది" అన్నాడు.

"మణుగు బరువు మోయటం అనేది మన అమ్మాయికి తృణప్రాయం బావగారూ! కాని ఆమె శిరస్సున ఎంత బరువును ఎత్త సంకల్పించుకున్నానో నేను, ఆ విషయం తర్వాత తెలుసుకోగలుగుతారుమీరు. అయినా నాకు తెలుసు. మన అమ్మాయి దానికైనా ఏమాత్రం వెనుకంజ వెయ్యదు. ఇప్పుడిహ నీకు యింకోవస్తువు నిస్తానమ్మాయీ! ఇదే నా చివరికానుక, అన్నిటికన్నా యెక్కువైన కానుక"

అంటూ ఆయన సర్పాకృతిలో ఉన్న ఓ విచిత్రవస్తువును బాగ్‌లోంచి పైకి తీశాడు. ఆవస్తువును చండి ముందుపెట్టి, "ఇదేమిటో చెప్పకోగలవా అమ్మాయీ!" అని అడిగాడు.

చండి ముఖం చాటుచేసుకుని, చిరునవ్వు నవ్వుకుని "కొరడా యేమో అనుకుంటాను" అన్నది.

"నిజమే కనుక్కున్నావమ్మాయీ! కొరడాయే అది! ఇలాంటి కొరడా నువ్వెప్పుడైనా చూశావా?"

"చూశాను. మా తాతగారు ఓసారి నాకు ఇలాంటి కొరడానిచ్చారు. కాని అది చర్మంతో—"

"ఇది బంగారంతో తయారైనది. ఇది నీకు నేను ఎందుకిచ్చానో తెలుసా? మా యింట్లో ఒక అలవిమాలిన గాడిద ఉన్నాడు. వాడిని నువ్వు అదుపులోకి తీసుకురావాలి. అందుకే నీకిప్పుడీ కొరడా యిస్తున్నది!"

చండి నవ్వుతూ "ఇంట్లో గాడిదని అదుపులో పెట్టడానికైతే చర్మంతో తయారైన కొరడా చాలు. బంగారంతో చేసింది దేనికి?" అని అడిగింది.

హరినారాయణబాబు కౌతుకోజ్జ్వలమైన చండి ముఖంకేసి చూశాడు. తర్వాత తన సౌమ్య ముఖాన్ని కఠినంగా మార్చుకుని, "నేను ఎవర్ని గురించి నీకు చెప్పానో అది మామూలు గాడిద కాదు. బంగారపు గాడిద. అంచేత అలాంటి గాడిదని అదుపులో పెట్టడానికి ఈ బంగారపు కొరడాయే అవసరం. ఇదుగో తీసుకో అమ్మా! పట్టుకో. దీంతోపాటు నేను చెప్పిన మాటలు కూడా గుర్తుంచుకో" అన్నాడు.

చండి చెయ్యి చాచి ఆయన చేతిలోంచి ఆ విలక్షణమైన బంగారపుకొరడా అందుకుంది......

(ఇంకా వుంది)

★

బొమ్మరిల్లు

నక్కగారి అక్కసు

(గేయనాటిక)

స్థలం — చిట్టడవి ప్రాంతంలో

రామూ :

గోపీ! గోపీ! రారా గోపీ!
అదుగో! చూడటు! బలే తమాషా!

గోపీ :

ఏదీ? ఎక్కడ? ఎటురా? రామూ!

రామూ :

అటే! అటే! నీ వొచ్చినవైపే

గోపీ :

అటో, ఎటో; నే నెరుగను పోరా!
ఏం జరిగిందో చెప్పరాదురా?

రామూ :

కుందేలొక్కటి చెంగులు వేస్తూ
ముందు ముందు పరుగెడుతోంది!
నక్క ఒక్కటి తికమకపడుతూ
వెనుక వెనుక పరుగిడుతోంది!

గోపీ :

ఆటలాడుకుంటున్నాయేమో
మన కెందుకులే పదరా పోదాం

రామూ :

కుందేళ్ళకు మరి నక్కల కెప్పుడు
పుట్టుకతో నే వైరమురా.
ఆట కాదు రది వేటర గోపీ;
ఏమి జరుగునో చూదాం పదరా!
అదుగో! ఆ పొదచాటున చూడటు
మాటలు జోరుగ వినవస్తున్నాయ్!

గోపీ :

చాటుమాటుగా చేరి అచ్చటికి
సంగతేమిటో తెల్సుకువద్దాం
గుట్టుగ సర్వం వినవచ్చును ఆ
చెట్టుమీద కూర్చుందాం రారా!

[యిద్దరూ చెట్టెక్కి కూర్చుని నక్క కుందేళ్ళ సంభాషణలు వింటూంటారు]

నక్క :

కుందేల! కుందేల! నీ వెంతదానివే!
అందకుండా నన్ను ఆడించుతావా!
అందినట్లే అంది పారిపోతావా!
నాయంతవాడినే వంచించుతావా!
నన్ను వంచించి ఈ భూలోకమందు
బ్రతికిపోయినవారు లేరు కుందేల!
నా నోట బడకుండ బ్రతికిపోతావ?
చూసుకో నిన్నేమి చేసివేస్తానో!

కుందేలు :

ఎందుకండీ బాబు చిందులేస్తారు?
ఎవరి ప్రాణం వారి కెంతైన తీపి.
నా వెంటబడి నన్ను వేటాడు హక్కు
తమ కెవ్వరిచ్చారో సెలవివ్వగలరె?

నక్క :

నీ తాత, ముత్తాతనాటి కాలమునుండి
వేట మా జాతులకు ఆజన్మహక్కు!
నేటి కీయుంపతో నీకింత పొగరెక్క?
నా హక్కులను గూర్చి ప్రశ్నించవా గావు!

కుందేలు :

వేటాడు హక్కు నీ జన్మహక్కయితేను
ఆత్మరక్షణ హక్కు మా జన్మహక్కు

చావలి రామచంద్రరావు

మా ప్రాణరక్షణకు మేము పసుపాల్లె
మాయండ మాదండ మా ప్రాణరక్ష.

నక్క :

చాలింక చాలించు నీ కారుకూతలూ
కాచుకో నిన్నిపుడె చీల్చి పారేస్తా.

కుందేలు :

నీ చేతనైనపని నీవు సాగించుకో;
నా చేతనైనపని నే చేసుకుంటా.

[అని కుందేలు మాయమౌతుంది. నక్క ఆతురతతో వెదుకుతుంటుంది. చెట్టుమీద రామూ, గోపీ లిద్దరూ కుందేలువిషయం మాట్లాడుకుంటారు.]

గోపీ :

రామూ! రామూ! కుందేలేదీ!
ఇప్పటికిక్కడే ఉండెనుగదరా!
చిటికెలోన మటుమాయమయిందే

రామూ :

ఏమనుకున్నావ్ కుందేలంటే?
నక్క ఎంత జిత్తులమారైనా
చిక్కదురా మరి కుందేలూ!
చెట్టూ, పుట్టా, పొదలూ బొరియలు
ప్రకృతి సర్వం దాని బలగమే.
ఎత్తులు, జిత్తులు, కత్తుల మెరపులు
కించిత్తయినా సాగవు గోపీ!

గోపీ :

ఇంతకు కుందే లేదిర రామూ!
అంతు లేదు మరి ఏమైనట్లూ?

రామూ:

అదుగో! అదుగో! అటు చూచావా?
పరిగకంప పొద పరికించావా?
నక్క వెత మా కంపకు చుట్టూ
తిరుగుతోంది చూచావా గోపీ!

గోపీ:

అదుగో! పాపం! కుందేలందులో
చిక్కుకుపోయిన తీరుగనుందే!
నక్కనోటి కాకుందేలిప్పుడు
చిక్కటపాపం తప్పదేమిరా!

రామూ :

చూద్దాం! చూద్దాం! ఏమౌతుందో!

[అనుకొని తిరిగి నక్క, కుందేళ్ళ సంభాషణలు వింటూ చెట్టుమీదనే కూర్చుని వుంటారు]

నక్క :

ఎత్తులకు, జిత్తులకు మొనగాడనే నేను
నన్ను మోసంచేసి బ్రతికిపోతావ?
చిక్కితివి కంపలో ఎక్కడికి పోగలవు?
కక్కించెదను పొగరు కాచుకో ధనవా!

[అని నక్క ఆ పరిగకంపలో దూరుతుంది. రామూ, గోపీ లిది చూచి అనుకుంటారు]

గోపీ:

నక్కదె కంపలో దూకెనురా!
చిక్కెను కంపలో చిక్కెనురా!
శరీరమంతా ముళ్ళేరా!
ఒళ్ళంతా గాయాలేరా!
కదలిన మెదలిన కన్నాకటరా;
నెత్తురు వరదలు వరదలురా!

21-7-54



'పేపర్ బాయ్'

ఫొటో: నాళం కామేశ్వరరావు; రాజమండ్రి.

రాము:

అదుగదుగో మరి వింటున్నావా?
నక్క కూత లాలిస్తున్నావా?
తిక్క కోపముతో భగ్గుమండే
నక్క తిట్లు నవు వింటున్నావా?

[తిరిగి నక్క, కుందేళ్ల సంభాషణలు వింటూ కూర్చుంటారు]

నక్క:

ఎంతవాడవు నీవు దొంగ కుందేలా?
గజదొంగవు కొంప దోపిడీదొంగవే!
వంచకుడవే నీవు అతి పాతకుడవై
మానాభిమానములు మంటగలిపావు
హింసంటె నీకెంత యిష్టమో గాని
కత్తిసత్తాపైన బ్రతుక దలిచావు.
పరిగకంపల మిలిటరీ వ్యూహాల్లో
నన్ను బంధించావు న్యాయమా నీకు?
తరతరంబులనుండి మా పూర్వులంత
అణగిమణగుండేటి ఆదర్శపరులు!
మన సంప్రదాయాలు మట్టిలో గలిపి
వచ్చి హింసావాదిగా మారినావా?
నావంటి ప్రభుజాతి కష్టాల జిక్క
ఆనందముగ చంక లెగరవేస్తావ?
పాపపుణ్యాలంటె వీసమంతైన
విలువుంటె నీవిట్లు విర్రవీగెదవ?
దేవుడంటె నీకు విశ్వాసముంటె
ప్రభుజాతిపై కుట్ర పన్నబూనెదవ?
నాస్తికుడ వత్యంత పాతకుడ వీవు
తుచ్ఛుడవు, లుచ్ఛావు, ఛీఛీ! కుందేల!

కుందేలు

ఎందుకట్లా నోరు పారేసుకుంటావు!
తిట్లల్లో నీవెంతో దిట్టవటుందే!
నీవు తిట్టనతిట్లు నీకె వర్తిస్తాయి.
నిన్ను నీవే ఎంత వర్ణించుకున్నావు!
తిట్టితిట్టే తిట్టి తెగడస్సిపోయావు!
పరిగకంపల పొన్నుపై పండుకోవోయ్!
హాయిగా నిద్రపో, తిరిగి లేవవుతే,
వెళ్ళివచ్చెద నేను నమస్తే నమస్తే!

[సంతోషంతో ఛంగుఛంగున గంతులు వేసుకుంటూ కుందేలు వెళ్ళిపోతుంది రామూ గోపీ లిద్దరూ చెట్టుదిగి అనుకుంటారు]

రామూ గోపీ:

భళీ! భళీ! భళి! భళాభళీ!
భలేగ శాస్తి జరిగెనులే!

ఆకాశవాణి

అంతే! అంతే! అబ్బాయీలూ!
దుష్టప్రభువుల దుర్గతదేరా!
ప్రజలను దోచే దుష్టప్రభువుల
జిత్తుల ఎత్తులు సాగవురా!
కుందేళ్ళనియెడు ప్రజాసమూహం
అదను చూచుకొని మెదడువాడితే,
నక్క కొటునకు చెప్పుదెబ్బగా
చక్కగ ఎత్తుకు పైయెత్తేస్తే,
ఎత్తుకు చిత్తయి చిక్కులో జిక్కిన
నక్క ప్రభువుల పాపం పండును

రామూ, గోపీ

నిజం! నిజంరా! నిజం పలికెరా!
పిల్లి శాపముల కుట్లు తెగవురా
అక్కసుతో ప్రజ అణగిపోదురా!
కుట్ర బట్టబయలౌట నిజమురా
న్యాయం ధర్మం జయిస్తుందిరా!

[అనుకుంటూ వెళ్లిపోతారు తెర వాలుతుంది]

★



మూలం: ఆల్ఫాన్స్ డాడే

జరిగిన కథ

[మా నాన్నగారు—మష్యూ ఐసెట్టీ—లాన్‌గ్యుడాక్ లో పెద్ద సిల్కు వ్యాపారి. సొంత ఫ్యాక్టరీ అవీ వుండేవి. నేను (చిన్నా) పుట్టినరోజు లగాయతూ మా కుటుంబాన్ని ఏదో ఒక ఆపద చుట్టు ముట్టేస్తూనే వుంది. చివరికి దేశంలో వచ్చిన విప్లవం మూలంగా మా నాన్నగారిస్థితి పూర్తిగా చితికి పోయింది. ఆ దెబ్బతో ఆయన మహా కోపదారి మనిషిగా తయారైనారు. నిర్జనమైన మా ఫ్యాక్టరీ ఆవరణలో నేను మా గేటు కాపలావాడికొడుకు 'రోజే' తో కలిసి 'రాబిన్‌సన్ క్రూసో' ఆట ఆడుతుండేవాణ్ణి. వాడికి బూతులూ అవీ చాలావచ్చు. వాడితో సావాసం చేసినమీదట ఆ బూతులు నాకూ వచ్చేశాయి. ఒకరోజు మావాళ్ళందరూ భోంచేస్తుండగా బండబూతు ఒకటి నానోటివెంట వచ్చేసింది. దాంతో మా నాన్నగారు మండిపడి నన్ను స్కూలుకి పంపించాలన్నారు. స్కూలులో పడేసేముందు 'కన్‌ఫెషన్' కి తీసుకెళ్ళి ప్రాయశ్చిత్తం చేయించాలని మా పెద్దన్నయ్య అన్నాడు. కొంతకాలానికి మా నాన్నగారు దివాలా తీసిన మా ఫ్యాక్టరీని అమ్మేశారు. మేము మా స్వస్థలం విడిచిపెట్టి లయన్స్ పట్టణానికి వెళ్ళిపోవలసి వచ్చింది. ఆ ప్రయాణంలో నా చిలుకను పోగొట్టుకొన్నాను. లయన్స్ పట్టణంలో నాలుగో అంతస్థు అద్దెకొంపలో నా ఆటలకి ఆస్కారం లేకుండా పోయింది. మా వంటలక్క 'ఆనీ'కి జబ్బుచేసి, స్వంతవూరు వెళ్లి పోయింది. అలా కొంతకాలం గడిచాక మా అమ్మగారి సలహామేరకు నన్నూ, మాఅన్న జాక్‌నీ, మా నాన్న చర్చి బాలగాయకుల పాఠశాలలో చేర్పించారు. అక్కడ చదువు పాదరబందీ ఆట్టే వుండేదికాదు. అక్కడా నా చదువు ఆట్టేకాలం సాగలేదు. ఒక పెద్దమనిషి సహాయంతో నేనుమాత్రం లయన్స్ స్కూలులో స్కాలర్‌షిప్ విద్యార్థిగా చేరాను. చేరిన మొదటిరోజే నా బట్టలు చూసి పిల్లలు ఎగతాళి పట్టించారు. మేష్టారికి నేనంటే ఎందుకో గిట్టలేదు. నన్ను ఆయన 'డింభకానముడ'ని పిలవటం మొదలుపెట్టాడు. నాకో పేరే తగులుకొంది. ఇలావుండగా మా పెద్దన్న 'ఎబ్బీ'కి జబ్బుచేసిందని జాబు రావటమూ, మా అమ్మా, జాక్ అన్నయ్యా అక్కడికి వెళ్ళడమూ జరిగింది. వాళ్లు వెళ్లిన కొన్ని గంటలకే పెద్దన్న పోయాడని టెలిగ్రాం వచ్చింది.]

4. ఎర్ర అట్ట కాపీ పుస్తకం

క్రైస్తవాలయాల్లోనూ అక్కడా, కొన్నికొన్నిచోట్ల రంగురంగుల అద్దాలతో అమర్చిన దీపాలు వుంటాయి. ఆ రంగు అద్దాలమీద బైబుల్‌కు సంబంధించిన యితివృత్తాలు బొమ్మలరూపంలో, చిత్రించబడివుంటాయి. అటువంటివాటిలో 'మిస్సార్' అనే అతను తయారుచేసిన కొన్ని దీపాలు చాలా ప్రాచీనకాలంనుంచి చర్చీలలో వాడుకలో వుంటున్నాయి. అతడు తయారుచేసిన దీపాలల్లో ఒక దీపం మీద, సప్తవిధ శోకాలనూ అనుభవిస్తూ వున 'మేరీ మాత'యొక్క చిత్రం ఒకటి వుంది. ఆ చెక్కిళ్లమీద చిత్రకారుడు రెండుగాడిగుర్తుల్లాంటి చారికలు చెక్కాడు. "మనకోసం 'మాత' ఎంతగా వడ్చిందో చూడమ"ని వేలుపెట్టి చూపించినట్లు వుంటుంది—ఆ చిత్రం.

దక్షిణాదికి వెళ్ళి పెద్దన్న అంత్యక్రియలు పూర్తిచేసుకొనివచ్చిన మా అమ్మ ముఖం చూసినప్పుడల్లా నాకా బొమ్మే జ్ఞాపకం వచ్చేది. బక్కచిక్కిపోయిన ఆమె చెక్కిళ్లపై సంతతధారగా కారిన

★ అనువాదం : [illegible] ★

కన్నీళ్ళు ఏనాటికీ మాసిపోనంతగా చారికలు కట్టాయి.

ఆరోజునుంచీ మా అమ్మ ముఖాన చిరునవ్వు అన్నది కనుపించటం అపురూపమైంది. గర్భశోకానికి చిహ్నంగా ఆమె ఎల్లవేళలా నల్లని దుస్తులే ధరించేది. ఆమె చూసే ప్రతిచూపులోనూ, పలికే ప్రతి పలుకులోనూ జీవితంపై ఆమెకు కలిగిన ఏవగింపు కనిపించేది. ఆవిధంగా ఆమె బాహ్యాభ్యంతరాలను ఆవహించిన శోకాతిశయం ఎన్నిరోజులు గడిచినా లవలేశమైనా తగ్గలేదు.

మిగిలిన విషయాల్లో మా యింట్లో ఏమంతగా చెప్పుకోదగ్గ పెద్ద మార్పులు రాలేదు; కాకపోతే—యింట్లో ఏమూల చూసినా బిక్కుబిక్కుమంటుండేది. సెంట్ నిజీక్ చర్చినుంచి మతబోధకుడుమాత్రం నాలుగైదుసార్లు మా యింటికి వచ్చి, మా పెద్దన్న ఆత్మశాంతికై మా అందరిచేతా ప్రార్థనలు చేయించాడు.

మా నాన్నగారు తన పాత నల్లకోటు చింపించి, నాకూ మా జాక్ అన్నయ్యకీ చెరొక సూటూ కుట్టించారు.

మా పెద్దన్న పోయిన చాలారోజులు తర్వాత ఒకనాటి రాత్రి మేమంతా పడుకోబోతున్న సమయంలో, జాక్ చాలా చిత్రంగా ప్రవర్తించటం మొదలుపెట్టాడు. పిల్లిలా చప్పుడు చెయ్యకుండా అడుగులో అడుగు వేసుకొంటూ పడకగదిలోకి వచ్చి, తెరిచివున్న తలుపుల్ని నిశ్శబ్దంగా మూసి, తాళం వేశాడు. వేసిన తాళం వూడివస్తుందేమోనని ఒకటికి రెండుసార్లు గుంజిగుంజి చూశాడు. తలుపు చెక్కల మధ్యనున్న సందులన్నిటినీ దేంతోనో కప్పేశాడు. ఈ పని అంతా పూర్తిచేసి అతిగంభీరమైన ముఖంతో నావద్దకు వచ్చాడు.

మా జాక్ అన్నయ్యలో యిటీవల—అంటే దక్షిణాదినుంచి తిరిగొచ్చినప్పటినుంచీ— ఆశ్చర్యకరమైన మార్పు ఒకటి వచ్చిందనే విషయం చెప్పటం మరచిపోయాను. ఆరోజునుంచీ వాడి ధోరణిలోనూ, వాడి పద్ధతుల్లోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. అన్నిటికంటే ముఖ్యమైనమార్పు ఏమిటంటే—నా డిప్పుడు ఏడవటం మానేశాడు! ఈమార్పు వాడిలో నిజంగా వచ్చిందనే విషయం మొదట నాకే నమ్మశక్యం కాలేదు. జిగురుసీసాలమీదా, అట్టముక్కల

★ అన్నా - చిన్నా ★

మీదా వాడికి యిదివరకు వున్న ఆ వల్లమాలిన ప్రేమ ఏమైపోయిందో, వాటిజోలికి పోవటం యించుమించు మానేశాడు. అంటే పూర్తిగా వాటికి విడాకులు యిచ్చాడని కాదు; అప్పుడప్పుడూ ఆ సరంజామా అంతా పైకి తీస్తూనే వున్నాడు; అయితేనేం ఆ పని చేస్తున్నప్పుడు వాడిలో యిదివరకు కనిపించిన ఆ తాదాత్మ్యం, ఆ ఏకాగ్రత యిప్పుడు లేవు. ఇదివరకటి రోజుల్లో అడక్కుండానే పుస్తకాలసంచీ అవీ చేసిపెట్టిన మా జాక్‌ని, యిప్పుడు అలాంటి అవసరం ఏదైనా వస్తే, వాడి ఎదుట మోకరిల్లి 'మహాప్రభో' అని బతిమలాడితే కాని వాడిచేత ఎంత చిన్న పని అయినా చేయించుకోవటం దుష్కరమౌతోంది. అంతదాకా ఎందుకు — హేట్ దాచిపెట్టుకోటానికి అట్టపెట్టె ఒకటి చేసిపెట్టమని మా అమ్మ వాణ్ణి అడిగితే, అప్పటికి వారంరోజులుగా యింకా తయారుచేస్తూనే వున్నాడు. ఈ విధంగా కలలోకూడా అనుకోని మార్పులు ఎన్నో వాడిలో వచ్చేస్తున్నాయి. అయినా మిగిలినవాళ్లు ఎవరూ యీ విషయం గమనించినట్లు లేదు. నాకుమాత్రం మొదటినుంచీ తెలుస్తూనే వుంది — వీడిలో ఏదో బ్రహ్మాండమైన మార్పు రాబోతున్నదని. మనస్సుకి యీ మాదిరి అనుమానం ఒకటి తగిలినమీదట నేను అనేకపర్యాయాలు, జాక్ ఒంటరిగా గదిలో వున్నప్పుడు వాడికి తెలియకుండా వెనకాలనుంచి చూశాను — వాడు సమయాల్లో చేతులూ, వేళ్లూ తిప్పుకొంటూ, తనలో తనే ఏదేదో మాట్లాడుకొంటూ వుంటేవాడు. రాత్రుళ్లు సరిగా నిద్రపోయేవాడు కాదు. మంచంమీద పడుకొని కాస్సేపు ఏమిటో తనలో తను గొణుక్కొనేవాడు; ఆ తరువాత వున్నట్టుండి మంచంమీదనుంచి లేచిపోయి, పెద్దపెద్ద అంగలు వేసుకొంటూ గది పొడవూ, వెడల్పూ కొలుస్తున్నవాడిలా అటునుంచి యిటు, యిటునుంచి అటు పచార్లు చేసేవాడు. ఈ లక్షణాలన్నీ చూసి, — నిజం చెప్పొద్దూ — వీడికి పిచ్చెక్కుతోందని నాలో నేను చాలా కంగారు పడ్డాను.

ఆరోజు రాత్రి వాడు తలుపులు బిగించటమూ అదీచూసి ఆ రోజుతో వాడికి పిచ్చి పూర్తిగా ఎక్కేసిందనే అనుకొన్నాను; కంగారుగా మంచంమీద లేచి కూర్చున్నాను. మా వాడు మాత్రం నా మెదడులో మెదిలే ఆలోచనలు ఏమిటో అన్నైనా ఆలోచించకుండా గబుక్కున వచ్చి, నా చేతిని తన చేతిలోకి తీసుకొని "చిన్నా! నీకో రహస్యం చెప్తానుకాని, ఎవరికీ చెప్పకుండా వుంటావా?" అని అడిగాడు.

దాంతో వాడికి పిచ్చేమీ ఎక్కబోవటం లేదని నాకు అర్థమైంది. మనస్సు తేలికపడింది. వాడికి ఏ అనుమానమూ తగలకుండా వుండటంకోసం వెంటనే "ఒట్టు! ఎవరికీ చెప్పను" అన్నాను.

"భలే! అయితే విను!... నేనొక పద్యకావ్యం రాయబోతున్నాను. 'చాలా గొప్ప కావ్యం లే!!" అన్నాడు, కళ్లు అదోమాదిరి పెట్టి.

"ఏమిటి? నువ్వే? పద్యకావ్యమే?" అన్నాను ఆశ్చర్యం పట్టలేక.

నా మాటలు వినటమే తడువుగా తను తొడుక్కున్న చొక్కా అడుగునుంచి పెద్దసైజు ఎర్ర అట్ట కాపీ పుస్తకం ఒకటి పైకి తీశాడు. దాన్ని స్వయంగా తయారుచేశాడని వేరే చెప్పనక్కరలేదనుకొంటాను. అట్టమీద మహాకావ్యం తాలూకు పేరు కూడా రాసి వుంది.

మతం! మతం!

(పన్నెండు అధ్యాయాల పద్యకావ్యం)

రచన : వి సెట్టి (జాక్)

అక్షరాలన్నీ మహా ఓపిగ్గా ముత్యాల్లా చెక్కాడు. ఆ అట్ట, ఆ సైజు, యీ పేరు, యీ ప్లాను — యివన్నీ చూసేసరికి నా తల దిమ్మ తిరిగిపోయింది.

మా అన్న జాక్; — పట్టుమని పన్నెండేళ్ళు లేని వీడు; — అస్తమానం ఏడుస్తూకూర్చునే వీడు; — జిగురు సీసాలతో సదమదమయ్యే వీడు — యీ జాక్, పన్నెండు అధ్యాయాలుగల 'మతం! మతం!' అనే పద్యమహాకావ్యం రాయబోతున్నాడా? నాకు అంతా ఆశ్చర్యంగా వుంది.

వీడు తన చిన్ని బుర్రలో యింత పెద్ద ఆలోచన

పొడుగుతున్నాడనే విషయం ఆ క్షణంవరకు రెండో కంటివాడి కెవ్వరికీ తెలియనే తెలియదు. తెలియదు కనుకనే మావాళ్ళు కాబోసు యింత మహాకవినీ, కూరలు మోసుకురమ్మని బుట్ట చేతికిచ్చి బజారుకు పంపేవాళ్ళు! మా నాన్నగారు యీ మహాకవిని పట్టుకొని యిదివరకటికంటె బిగ్గరగా, యింకా ఎక్కువ మంది వినేట్లుగా "నువ్వు ఎందుకూ పనికిరాని పొట్టి అడ్డగాడిదవిరా, జాక్!" అని తిడుతునే వున్నారు.

ఇప్పుడు అనిపిస్తోంది—ఆరోజునే మరికొంత ధైర్యం తెచ్చుకొని ఆమాట అన్న వెంటనే నేను మా జాక్‌ని గాఢంగా కౌగిలించుకోవలసిందని! వాడి ఆలోచన సామాన్యమైనదా మరి?...పన్నెండు అధ్యాయాల పద్యమహాకావ్యం వ్రాయతలపెట్టినవాడు సామాన్యుడా?

నిజాయితీకి కట్టుబడివుండాలంటేమాత్రం ఆ 'పన్నెండు అధ్యాయాల పద్యమహాకావ్యం'లో ప్రథమాధ్యాయంలోని ప్రథమగీతంతాలూకు నాలుగు పాదాలకు మించి ఒక్క అక్షరమైనా ముందుకు సాగలేదని ఒప్పుకోక తప్పదు. ఇటువంటి మహాకావ్యాల సృష్టిలో ఎప్పుడూకూడా ఆ మొదటి నాలుగుపాదాలు పూర్తిచేయటమే మహా కష్టం. అది మీకూ తెలుసు. దాన్నే కృత్యాద్యవస్థ అంటారు పెద్దలు. ఆ మాటే మా జాక్ నాతో అంటుండేవాడు: "కృత్యాద్యవస్థ పడటం పూర్తిఅయింది కనుక మిగిలిన కావ్యం యింకేముంది?—అవలీలగా రాసి అవతల పడేస్తాను. కాకపోతే కొద్దిరోజులు పట్టుతుంది.—అంతేగా?" అని.

ఆ నాలుగుపాదాలు ఇవి:

"మతమా! ఓ మతమా!
నిఖిల ధరాజన సుకృత
నిగూఢ స్వాగతరుతమా!
ప్రేమా! సోదరమానవప్రేమా!"

వాడిమాటలప్రకారం, ఏదో కొద్దిరోజుల వ్యవధిలో అవలీలగా యివతలపడవలసిన ఆ మహాకావ్యం, ఎందుచేతనో ఏనాటికీ వూడిపడలేదు. ఈ సృష్టిలో చాలా విషయాలు అంతే. ఏది ఎందుకు జరుగుతుందో, ఏది యెందుకు జరగదో, ఆ జరగటానికీ యీ జరక్కపోవటానికీ కారణాలు ఏమిటో యిదమిత్థమని తేల్చిచెప్పలేం. నాకు చూడగా చూడగా పద్యాలకికూడా జాతకాలు వుంటాయి కాబోలు ననిపిస్తుంది. మా అన్నయ్య తల పెట్టిన యీ మహాకావ్యానికి పురిట్లోనే సంధికొట్టింది. ఆ తరువాత వాడు ఎన్నిసార్లో బుర్ర బద్దలుకొట్టుకు ఆలోచించాడు కాని, ఎంత ఆలోచించినా మొదట రాసిన ఆ నాలుగు పాదాలకు మించి ఏమీ రాయలేక

★ అన్నా - చిన్నా ★

పోయాడు. చివరికి వాడి ప్రాణం విసిగి, కవితాకన్యని గాలికి వదిలేశాడు. (ఆరోజుల్లో కవితాకన్యనుగురించి మాట్లాడుతూవుండటం పెద్ద ఫాషన్‌గా చెలామణి అవుతుండేది) తలపెట్టిన మహాకావ్యానికి తిలోదకాలు అర్పించి వూరుకొన్నాడు. వాడు యీపని ఏరోజునైతే చేశాడో, ఆరోజునుంచీ వాడి కళ్లవెంట వెనకటిలా ఏకధారగా నీళ్లుకారటం యథాప్రకారం ఆరంభమైంది. జిగురుసీసాలమీద వాడి మమకారం మళ్లీ తలెత్తింది.

...ఎర్రఅట్ట కాపీపుస్తకం ఏమైందంటారా? దాని జాతకమూ ఏమీ బాగులేదు.

నీయిష్టంవచ్చింది రాసుకోమని దాన్ని తెచ్చి ఒక శుభముహూర్తాన నాచేతులో పెట్టాడు మా జాక్.

ఆ పుస్తకంలో నేనేమి రాసివుంటానో మీరేమైనా వూహించగలరా? నేను అల్లిన పద్యాలు! ఈ డింభకాధముడి పద్యాలు!! పద్యాలు అల్లటమనే జాడ్యం నాకు మా జాక్ వద్దనుంచే వచ్చింది.

(ఇంకావుంది)

కురూపి

చాలారోజులనుండి తను పొదుగుతున్న గ్రుడ్లు వరుసగా పిల్లలు అవుతూ ఉంటే తల్లి బాతుకు ఎంతో ఆనందము కలిగింది. కాని ఒక గ్రుడ్డుమాత్రము పిల్లగా మారకుండా విసుగు కలిగించినా కన్నకడుపు అవడంవల్ల దానిని పొదుగుతూ కూర్చుండేది. చివరికి మిగిలిన గ్రుడ్డు మిగతా వాటికంటె పెద్దది అవడంవల్ల తోటిబాతులు అది తన జాతిది కాదని ఆగ్రుడ్డును పగలగొట్టి వేయమని సలహా యిస్తుండేవి తల్లి బాతుకు. ససేమిరా నేనా పని చేయలేను. 'అది నాకడుపున పుట్టిందే' నని వాదిస్తుండేది తల్లి బాతు.

కష్టము ఫలించింది. కొన్నిరోజులకు ఆగ్రుడ్డును పగలగొట్టుకొని ఒక బాతుపిల్ల బయటికి వచ్చింది. పిల్ల బయటకు వచ్చినందుకు తల్లికి సంతోషము కలిగినా మిగతా వాటికంటె పెద్దదిగాను అనాకారిగాను ఉండడంవల్ల అందరూ అన్నట్లు నిజంగా అది తనసంతతేనా అని సంశయం కలిగేది. కాని తనకుతాను సంబాళించుకొనేది "కడుపున పుట్టినవారందరూ ఒకలాగే ఉంటారా?" అని.

అందరిపిల్లలకంటె తన పిల్లలు తెలివిగలవాళ్లు, అందమైనవాళ్లు అని లోకంఅంతా పొగడాలని తల్లిబాతు ఎంతో తాపత్రయ పడుతూ ఉండేది. అది తన పిల్లల్ని వెంట పెట్టుకొని చిన్న చిన్న పురుగుల్ని, చేపల్ని తినడం, నీటిలో యీదడం నేర్పుతుండేది. ఆఖరిపిల్ల మిగతావాటికంటె బహు నేర్పరితనంగా మెలుగుతూ ఉంటే కు'రూపి' అయితే మాత్రం ఏం? నాపిల్ల అందరికంటె గొప్పది అవుతుంది. అని సంతోషించేది తల్లి బాతు.

రావి జయలక్ష్మి

కాని పిల్లమట్టుకు చాలా బాధ పడుతూఉండేది. తోటిబాతులు వాటిపిల్లలు 'కురూపి' అని పిలిచి దగ్గరకు రానిచ్చేవికావు. చివరకు తోబుట్టువులుకూడ దగ్గరకు రానిచ్చేవికావు. కాని తల్లినిచూచుకొని కష్టాలుమరచి దానిరెక్కల్లో చల్లగా నిద్రపోతూఉండేది మన 'కురూపి'.

'కురూపి'కి రోజురోజూ తోటి బాతులు పొడవటం ఎక్కువై పోయింది. కనీసం తల్లికూడ వాటిని ఏమీ అనలేకపోయేసరికి దానికి దుఃఖం ఎక్కువై పోయింది. ఒకనాటి రాత్రి తల్లితోకూడ చెప్పకుండా ఒంటరిగా దగ్గర అడవిలోఉన్న ఒక కొలనులోకి వెళ్ళిపోయింది.

ఆ కొలనులో ఉన్న బాతులు మన 'కురూపి'ని చూసి అసహ్యించుకున్నా దాని నమ్రతకు దయగలిగి వాటితో తిరగనిచ్చేవి. కొన్నాళ్లు వాటితో ఉంటే అది కూడ అందముగా తయారవ వచ్చునని ధైర్యం చెప్పేవి.

ఆనాడు మామూలుగా 'కురూపి' అన్ని బాతులతో ఆనందముగా ఆడుకుంటూఉండగా నాలు గైదు తుపాకీకాల్పులు వినిపించాయి. ఆ శబ్దానికి భయపడి కదలలేక కళ్లుమూసి కళ్లుతెరచేలోగా తనచుట్టూ ఉన్న బాతులన్నీ చచ్చిపడిఉన్నాయి. కొన్ని పారిపోయినాయి. కాని దాన్నెవరూ చంపలేదు. అందుకు కారణం? తను కురూపిగా ఉండడమే అని ఊహించుకుంది.

ఆ కొలనుజీవితం ప్రమాదం అని తెలుసుకుంది కురూపి. అక్కడనుండి యింకొక కొలనుకు ప్రయాణం కట్టింది. చాలా దూరం ప్రయాణం చేయడంవల్ల అలసి పోయింది. సమీపంలో ఒక పాడుపడిన గుడిసె ఒక్కటి ఉంటే అక్కడికి వెళ్ళింది తలదాచుకొన దానికి. ఇంతలో, నేస్తాలైన ఒక కుక్క, పిల్లి ఒక్కసారి దానిమీదికి

కురూపి

దుమికినాయి చంపటానికి. ఈరోజుతో సరి అని భయంతో కళ్లుమూసుకుంది కురూపి. ఆశ్చర్యం! కళ్లు తెరచి చూసేసరికి "చూడ్డానికే అసహ్యంగా ఉంది, దానిమాంసం ఎంత చేదుగా ఉంటుందో." అనుకుంటూ వెళ్ళి పోతున్నాయి నేస్తాలు. రక్షింపబడి నందుకు సంతోషించినా "హుం, కురూపిని. క్రూరజంతువులకు కూడా పనికిరాకుండా పోయాను," అని మన కురూపి విచారంతో ముందుకు ప్రయాణం సాగించి ఒక పెద్ద సరోవరం చేరుకుంది.

ఆ కొలనుపరిసరాలు చాల నిశ్శబ్దంగా ఉన్నాయి. చుట్టూ చెట్లు గుబురుగా ఉన్నాయి. అక్కడ కొన్నాళ్లు ఆనందంగా గడిపింది మనకురూపి. కాని ఒకనాడు దగ్గర ఊరునుంచి కొందరు పిల్లలు వచ్చారు ఆడుకోడానికి. ఆ పిల్లలు కురూపిని చూసేసరికి వెంట పడ్డారు పట్టుకోడానికి. వాళ్లు అదిగో కొత్తదిహంస అదెంతో ముద్దుగా ఉంది. మూడిటి కంటె కూడా ఎంచక్కా ఉంది. అంటూ తరుముతూ ఉంటే మరి కురూపికి ఆనందం ఆశ్చర్యం కలగాయి. తనని చూసే అనుకుంటున్నారు ఆ పిల్లలు తను కురూపి కదా వాళ్లెందుకు అలా పొగడ్తున్నారో అనుకుంది. వాళ్లుతనకోసం వెంట పడుతూ ఉంటే ఎంతో ఆనందం కలిగింది అంతే అందరిల్లు వాళ్లను ఎంతో శ్రమపెట్టింది తను కూడా అలసిపోయింది

"రంగుల రంగడు"

—ఫొటో. నాగం కామేశ్వరరావు, రాజమండ్రి.



సమయస్ఫూర్తి

అన్నయ్య ప్రొద్దుటి నుంచి స్నేహితుల్తో తెగ కబుర్లు చెబుతున్నాడు. అమ్మ, అన్నానికి రమ్మని ఎంతపిల్చినా ఆ 'నాద' నుండి లేచి రావటల్లేదు.

"అబ్బాయ్! చూడు పాత ఏ పుస్తకంతీసి చింపుతున్నట్టుంది.." అంది అమ్మ.

"నా పుస్తకమే...ఎందుకు తీసింది? చింపేసిందీ!..." అంటూ కబుర్లు విడిచిపెట్టి కంగారుగా లేచి లోపల కొచ్చాడు. వాడికి ఇంట్లోని ఏం చేసినా లెక్క లేదు కాని వాడి పుస్తకాలు ముట్టుకుంటే చాలు అరిచేస్తాడు. తీరా వచ్చిచూస్తే అది ఏదో పనికిరాని పుస్తకం, అది అన్నయ్యకి ఏమీ సంబంధం లేని పుస్తకం.

"ఏంరా! ఇకనైనా అన్నానికి లేస్తావా లేదా. ఏమిటా కబుర్లు? దేనికైనా ఓ అంతూదరీ ఉండాలి. ప్రొద్దుటినుంచి వాగిన వాగుడు వాగి వస్తున్నావ్." అని నెమ్మదిగా చివాట్లు పెట్టింది అమ్మ.

చాముర్తి సావిత్రి

— అప్పటికాని అన్నయ్య స్నేహితుల్ని విడిచిపెట్టలేదు. అన్నయ్య కాళ్లు కడుక్కుంటుండగానే "సుబ్బారావుగారూ" అంటూ ఎవరో పిల్చారు. మళ్ళీ అన్నయ్యకోసం ఎవరో వచ్చారు. ఇంక ఈ వాళ్లికి తెముల్చేటట్లు లేదని భయపడింది అమ్మ.

"శాస్త్రిగారూ! రండి రండి!" అంటూ ఆయన్ని లోపలికి తీసుకొచ్చి ఆయనకు కూడా అక్కడే వడ్డించమన్నాడు అన్నయ్య.

ఆ వచ్చిన శాస్త్రిగారు కూడా సాహిత్యపు మనిషేనని అన్నయ్య, ఆయనా మాట్లాడుకోవటంలో గ్రహించాను. అన్నయ్య తనకు అవకాశం దొరికితే వదలిపెట్టడు. వాక్యాన్ని ఎన్నిరకాలుగా విరిచి అతికి అంతం లేనట్లు అన్నయ్య చెప్పాడు.

నేటి రచనలు పెక్కింటిలో తెలుగుతనం ఉండటం లేదని, నానుడులూ జాతీయాలు పట్టికే పుట్టినవి కావని వాటికి వెనక ఎంతో చిత్రమైన చరిత్రలున్నాయని అంటూ ఇలా చెప్పాడు:

"వెనక మాలమ్మగారు గారి వానా వస్తేనే లేదనేది. గారి వానా వస్తే కథ లేకపోవడమేమిటని అడిగాను. దానికో కథ ఉందిలే అంది ఆవిడ" అన్నారు శాస్త్రిగారు.

"ఆకథ ఏమిటో చెప్పరూ..." అడిగాను నేను ఒకవంక మా అన్నయ్య ఏమంటాడో అని అటు మూలంగా చూస్తూ.

"వెనక ఓగొప్ప శాస్త్రజ్ఞ సాహిత్యప్రియుడైన పిరాజా ఉండేవాడు. అతనికి కథలంటే మహాప్రీతి. కథలువింటూ నిద్రపోవడాలు కూడా

...ఒక్కసారి వాళ్లకు దూరంగా ఈదుతూ నీటిలోకూర్చుంది. ఆశ్చర్యం, ఈ ప్రక్కన హంస ఒకటి వచ్చింది కొలను. నీడనీళ్లలో పడింది. చుట్టూ చూసుకుంది. ఊహుఁ. ఎవ్వరూ లేరు. మళ్ళా నీళ్లలోకి చూసింది. తాను నమ్మలేకపోయింది. అది తన నీడా! ఎంత అందముగా ఉంది తన నీడ. ఆఁ అయితే ఆపిల్లలు అన్నట్లు నిజంగా తాను మరాళమవదే! ఈసారి ఎక్కడలేని ఆనంద రెక్కలలో కలిగింది. ఆనందముతో నాట్యము చేసింది. ...గల గట్టిగా అరిచింది. దానికి జవాబుగా ఆ విశాల సరోవరము నుండి కొన్ని హంసలు అరిచినట్లు వినిపించింది. ఆనందముతో ఒక్కసారి బలముకొద్దీ పైకి ఎగిరి వాటిని కలుసుకుంది. అవి దానిని ఆదరించి వాటిలో కలుపుకున్నాయి. చెప్పలేని ఆనందముతో 'నేను కురూపిని కాను, అందాల హంసను' అని వాటితో ఆకాశములో ఎగురుతూ ఉంటే క్రిందనుండి 'అదిగో! నాలుగు హంసలు ఎగిరిపోతున్నాయి. అబ్బ! కొత్తహంస ఎంత బావుంది' అని ఎగురుతున్న తన వైపు చూస్తున్న పిల్లలని దీవిస్తూ ఎగిరిపోయింది మన కురూపి... కాదు, అందాలరాణి.

మరచిపోయేవాడట. రాజుగారికి కథలంటే మక్కువ అని తెలిసి ఎందరో గొప్ప గొప్ప కథకులు, ఆస్థానాని కొచ్చి కథలు చెప్పి రాజును మెప్పించేవారు. రాజు కథ చెప్పిన వారికల్లా తలో అగ్రహారం చొప్పునా ఇస్తూ అఖండమైన గౌరవం చేసేవాడు. ప్రతివాడూ తనకూ ఓ అగ్రహారం లభిస్తుందని రాజుకు కథచెప్పడానికి తయారై వచ్చి, సత్కారాలతో, అగ్రహారాలతో వెళ్ళిపోయేవాడు. ఇట్లా కొన్నాళ్లు గడిచేసరికి రాజ్యంలో చాలాభాగం కథకులకే అంకితమైపోయింది. మరికొన్నాళ్ళు పోతే రాజ్యం పూర్తిగా కథకులకే పోతుందని భయపడి, మంత్రి, "రాజును ఈపిచ్చినుంచి మరల్పడం ఎట్లా" అని ఆలోచించాడు.

కథకులు కథ చెబుతూంటే రాజు ఒక్కడే వినేవాడు. మంత్రి ఎప్పుడూ ఆదరి దాపులకైనా పోయి ఎరుగడు. ఈకథలు చెప్పేవాళ్ళ దగ్గర రాజును వశపరచుకొనే శక్తిఏదో ఉన్నదని మంత్రి ఊహించి తానుకూడ రెండు మూడుసార్లు కథవిన్నాడు. మంత్రికి అప్పటికో ఉపాయం తోచింది.

కథకుడువచ్చి కథ చెబుతూంటే, మంత్రికూడ దగ్గరకూర్చుని జాగ్రత్తగా వింటూ నిమిష నిమిషానికీ అడ్డుప్రశ్నలు వేయనారంభించాడు. దాంతో కథయందు రాజుగారికి ఏకాగ్రత చెడిపోయేది. ఎంత రసవంతమైన కథయినా రాజుకు క్రమంగా, పేలవంగా, నిస్సారంగా అనిపించసాగింది. ఇట్లా కొన్నాళ్ళయేసరికి కథలపై ఆదరణ తగ్గిపోయింది. మంత్రి అడ్డుప్రశ్నలతో ఎంతకీ కథ పూర్తికాకపోవడంతో రాజుగారికి మరికొన్ని సందేహాలు కలగ నారంభించాయి. చెప్పే కథలన్నీ చాలా అసందర్భంగానూ, అర్థరహితంగానూ ఉంటున్నట్లు రాజుకు అనిపించింది. రసవంతమైన కథలు చెప్పేవాళ్లు అయిపోయారనీ, ఇక వచ్చేవాళ్ళంతా వట్టి చెత్తసరుకని రాజు తేల్చివేసికొని, ఈకథకులు అదేపనిగా రావటాన్ని అరికట్టేందుకు మార్గమేదైనా ఆలోచించుమని మంత్రి నడిగాడు.

ఇంతవరకు తన తెలివి బాగా పనిచేసినందుకు సంతోషించిన మంత్రి—"రాజుగారిని మెప్పించే రసవంతమైన కథలు చెప్పలేకపోతే వచ్చిన కథకుని తల కోటగుమ్మానికి వ్రేలాడగట్టబడుతుంది." అని ప్రకటన చేశాడు. ఈప్రకటన చాలామందిలో భయాన్ని కలిగించింది. తీరా ఒకవేళ కథచెప్పి రాజుని మెప్పించలేకపోతే అగ్రహారాలమాట దేవుని కెరుక,

★ సమయస్ఫూర్తి ★

ప్రాణానికే మోసంవస్తుందని కథకులు చాలామంది జడిశారు. తాము బాగా కథచెప్పి రాజును మెప్పించగలమనే ధైర్యమున్నా చివరికి ఏమౌతుందో అనే భయమే ప్రతివారికీ కలిగేది.

దాంతో ఇంకే కథకుడూ రాజాస్థానానికి వచ్చి కథ చెబుతానని అనలేకపోయేడు. మంత్రి తానీవిధంగా రాజ్యాన్ని కాపాడగలిగానని గర్వపడ నారంభించాడు.

ఆ రాజ్యంలోనే ఓ పల్లెలో ఒక యువ కథకుడున్నాడు. అతడు ఏనాటినుండో రాజు కో మంచి కథ చెప్పి, అతని మెప్పు పొందాలని చూస్తున్నాడు. కాని ఇంతవరకు ఎప్పుడూ అది సాధ్యపడలేదు. రాజు ఇటీవలచేసిన ప్రకటన ఈ యువ కథకుని చెవినికూడా పడింది. అది వినగానే అతనికి కొంచెం భయం కలిగింది. కాని, రాజు ఈవిధంగా ప్రకటించడానికి కారణమేమై ఉంటుందా అని బాగా ఆలోచించి, రాజుకు కథచెప్పడంలో విఫలులైన కథకులను కలిసికొని వారి అనుభవాలను తెలిసికొని ధైర్యంగా, ఆస్థానానికి వచ్చి మంత్రికి, తాను రాజుగారికి కథచెప్పి మెప్పిస్తానని, కథ చెప్పేందుకు అనుమతి ఇప్పించవలసిందనీ కోరాడు. మంత్రి మరోసారి రాజు చేసిన ప్రకటన జ్ఞాపకం తెచ్చుకోమన్నాడు. నాకా భయమేమీ లేదని ఆయువకథకుడు నిర్భయంగా చెప్పాడు.

కథ చెప్పడానికి ఒకరోజు నిర్ణయించారు. రాజు సింహాసనాసీనుడై ఉన్నాడు. యువకథకుడు రాజుకు వంగి నమస్కరించి ఉచితాసనంలో కూర్చుని: "మహారాజా! నేను కథ చెప్పగలను గాని, మీరూ నేనూ తప్ప మూడోమనిషి ఇక్కడ ఉండకుండా పంపి వేయాలి. ఈ ఒక్క కోరిక మీరు తీర్చాలి." అని అర్థించాడు ఆప్రక్కనే కూర్చుని ఉన్న మంత్రికేసి అనుమానిస్తూ చూచి. వెంటనే మహారాజు మంత్రిని అచ్చటినుంచి వెళ్ళి పొమ్మని ఆజ్ఞాపించాడు. మంత్రి అక్కడనుంచి కదిలాక ఆయువకథకుడు కథ ప్రారంభించాడు: రాజు సావధానచిత్తంతో కూర్చున్నాడు.

"ఒకప్పుడు ఒక రావిఆకు, ఒక మట్టిబెడ్డ ప్రాణస్నేహంతో ఉంటూండేవి. ఆ రెంటికీ ఎప్పుడూ విభేదం రాలేదు. పైగా వాటి రెండిటి మధ్యా ఒకనిర్ణయంకూడా ఉండేది. అదేమంటే: గాలి వీస్తే తాను ఎక్కడికీ ఎగిరిపోకుండా నిలబడడానికి మట్టిబెడ్డ రావిఆకును కాపాడాలి. వర్షమొస్తే తాను తడిసిపోకుండా కాపాడవలసిన బాధ్యత రావిఆకుది."— అని ఇంకా చెప్ప బోతూంటే ఇందాకటినుంచి సింహాసనం వెనక రహస్యంగా దాక్కొని కథవింటూన్న మంత్రి తన అలవాటు చొప్పున వెంటనే "అయితే ఒక్కసారే గాలీ వానా వస్తే అప్పు డెలాగ?" అని అడ్డుప్రశ్న వేశాడు.

ఆ యువ కథకుడు ఆ ఊహించని ప్రశ్నకు ఒక్కసారి చకితుడైనా, వెంటనే తేరుకొని నవ్వుతూ సమయస్ఫూర్తిగా 'గాలీ వానా వస్తే, అసలు కథే లేదు' అనేశాడు. దాంతో మంత్రిగారు మూతబడి పోయింది. ఆ యువ కథకుడు ఏమీ తడుముకోకుండా అంత తెలివిగా అసమాధానం చెప్పడం విని చాలా ఆనందపడి, మిగిలిన కథకూడా చెప్పించుకు విని రెండు అగ్రహారాలు బహుమతిగా ఇచ్చాడు రాజు. ★

విజ్ఞానవీధులు

"డాక్టర్"

చిట్టిప్రశ్నలకు జవాబులు

—మా రేడియో సెట్టులోని అమరిక సున్నితమే అయితే, వేర్వేరు స్టేషన్లనుంచి, వేర్వేరు మీటర్లమీద ప్రసారమయే సంగీతము మా రేడియోలో ఒకేసారి ఒక్క మాటయినా వినబడకూడదు మరి. మెల్లకన్నువారు రెండు వేపుల ఒకేసారి చూచినట్లే, రెండు ప్రోగ్రాములు ఒకేసారి అందడము అంటేనూ, సెట్టులో చిక్కేదో వుంది.

జి. మోహనరావుగారు, కరీంనగరు.

గుడ్డివారికీ, మూగవారికీ, చెవిటివారికీ, మూసులోపాలు ఉన్నవారికీ కూడా ఆలోచనలూ అనుభవాలూ — ఏవో అవి — వుంటాయని ఒప్పుకుంటారా మీరు.

ఆ అనుభవాలే కలిపేసిన పేకముక్కల లాగ చేరుకుని వారికి కలలుగా వస్తాయంటే చిత్రమేమిటీ?

కల అంటే కేవలము కనబడేదేనా? వినబడేది, శరీరానికి తగిలేది కూడానూ.

కె. యల్. యన్. శాస్త్రిగారు అయినాపురం.

కంటివెనక తెరమీదపడే బింబాన్ని నాడులు మెదడుకి తర్జుమాచేసి చెప్తాయి. బింబంలో దోషంవుంటే ఆ నరాలు కష్టపడతాయి. అదే ఆ తలనొప్పి. కళ్లజోడు పెట్టుకుంటే సరియైన బింబం పడుతుంది. అంటే తలనొప్పి పోతుంది. అన్ని తలనొప్పులూ ఈరకం కాదు!

వి. శివభాస్కరరావుగారు, విశాఖపట్నం.

డెబ్భైయేళ్ల క్రితం ఈ బాణసంచా పల్లెటూళ్లదాకా అందేదికాదు. కనక నూరేళ్ల క్రితం దీపావళికి బాణసంచ కాల్చడము లేదని అనుకోవచ్చునేమో.

కాని తాటిపువ్వుల బొగ్గుతో పొట్లాలు చేసుకుని కాల్చేవారు కాబోలు. "ఉప్పును కుంపటిలో వేసి పటపటలాడించే వారమ"ని మాయింట ముసలమ్మ చెప్తుంది.

పండరినాథ్ గారు, అనంతపురం.

విదేశీయులలో లోపాలుకి నిర్ధారణగా చెప్పడానికి అధికారమూ అనుభవమూ చాలవుగాని చూచాయగా విన్నది చెప్తాను వినండి.

అరబ్బులలో శుచితక్కువ. ఈగల దుకాణాలు అపరిమితము ఏడెనులో. ఇటలీ దేశస్థులు మనవారిలాగే స్వార్థపరులు. బస్సులకడ తొక్కులాటలూ, అవకాశము దొరికితే చాల ఎరగనివారిని మోసముచేసే చిల్లర వర్తకులూ, దొంగకళలాలను అమ్మజూపే దగాకోర్లూ, కొత్త సాయమడిగితే చాలు కాఫీ యిమ్మనే రైల్వే ఉద్యోగులూ, చేతికందితే కన్యను పాడుచేసి తప్పుకుపోయే బ్రహ్మచారులూ ఉన్నారు ఇటలీలో. యువకులసంభాషణలలో బూతులు కొల్లలు. 'పెండ్లి' అంటేమాత్రం సచ్ఛీల, అనూర్యంపశ్య కన్య కావాలి.

ఫ్రెంచివారికి ముక్కుమీద కోపము. కొంచెం అనుమానంతట్టితే చాలు. పెడమొగమైపోతారు. ఒకంతటా సమాధానపడరు.

జర్మనులు ఇంగ్లీషులో మాట్లాడితే జవాబియ్యరు. గొప్ప శిక్షణ కలవారు. వారి యువకుల సైనిక స్వభావంచూస్తే వారి కన్యలకే ఇష్టముండదట. జాత్యభిమానం అపరిమితం. జర్మనుమాట్లాడితే సంతోషించేస్తారు. అల్పసంతోషులు. కొత్త అనుమానము తట్టిందా మనవని అడకొత్తులో చెక్క. కాళ్లమీదపడినా అతర్వాత లాభం లేదు.

స్కాట్లులు లోభులని ప్రతీతి. చేజిక్కిన సొమ్ము న్యాయంగా ఇవ్వవలసినా తప్పుకోడానికే చూస్తారు. ఆంధ్రులవలె మహా జాత్యభిమానులు. ఆంధ్రసక్కాలు, ఆంధ్ర రోడ్డులాగ స్కాట్లండులో అన్ని బోర్డుల మీదా 'స్కాట్' ఉండి తీరుతుంది... మెచ్చుకున్నట్లయితే బహిరంగంగానే సంతోషిస్తారు. కుత్సితములేదు.

ఇంగ్లీషువారు: ఎరగనివారి ఎదుట తినడానికితప్ప పెదిమలు విప్పరు. సముద్రపు ఒడ్డున ఈజీచైరులో నల్లకంటి అద్దాలు పెట్టుకుని గంటలతరబడి కూర్చోగలరు. కాని ఒకచిన్నపిల్ల తనతలిదండ్రులనుండితప్పిపోతే కలగజేసుకోరు. అలాగ పోయిపోయి ఒకపిల్ల మురుగుకాలవలోపడి చచ్చిపోయింది. తోటలలో ఆడవారూ మగవారూ సరసని కూర్చునీ పడుక్కునీ గంటలకొద్దీ ముద్దులు పెట్టుకుంటారు. చూచినవారు మనకేమి? అన్నట్టుగా నడుచుకుపోతారు... తమ సరుకులు కర్చవడానికి ఎంత శ్రమైనా పడతారు.

పిలవనివారు ఇంటికి వచ్చినా, ఎరగనివారు మంచినీళ్లడిగినా ముఖం చిట్లించుకుంటారు. ఎరిగినవారు దారిలోపోతూన్నా వారిపని వారిది వీరిపని వీరిది. పలకరించుకోరు.

తమ జాతివారితో తప్ప ఇతరులతో ఒకపట్టాన మైత్రి చెయ్యరు. తమకడ సొమ్ము లేకుంటే మాత్రం చక్కగా స్నేహమూ చేస్తారూ, ఆడపిల్లలు పెండ్లీచేసుకుంటారు.

ఇంగ్లీషువారికి తమజాతి అన్నా, భాష అన్నా, ఆచారాలన్నా చాలా అభిమానము. ఏదేశమేగినా తమ పద్ధతినే అక్కడ ప్రవేశపెడతారు. ఇతరుల పద్ధతి తమ పద్ధతికంటె సౌకర్యమైనదైనా సరే దానిని గ్రహించరు. తాము పలకలేని పేర్లు తమకు కావలిసినట్లు మార్చేసుకుంటారు.

పో. రంగనాథంగారు, కాకినాడ.

జుట్టూ, గోళ్ళు ఒక జాతివే అనడంలో అర్థమేమిటంటే రెండింటికీ నరములు లేవని. నరములున్న శరీరభాగాల్ని కత్తిరించినట్లయితే బాధ తెలుస్తుంది. నరాలులేని భాగాలు కత్తిరిస్తే బాధ తెలియదు.

—వేడిచెయ్యడము అంటే ఏ కారణంవల్లనైనా శరీరములోని జీవకణాలు చాలా మట్టుకు ఖర్చై, మళ్ళీ పునర్నిర్మాణము కాని స్థితి. చలవచెయ్యడమంటే రొంప, జలుబు, నుదుటి వెనకాల ముక్కుకి వెనక, నొప్పిగా ఉండేస్థితి. పైత్యమంటే మూడు వంతులు విరేచన బద్ధకము.

—రింగులమీద ఊగి కసరత్తులు చేస్తే పొడుగు అవవచ్చును.

—ఏవస్తువునుగాని భూమి తన కేంద్రము వైపు ఆకర్షిస్తూనే వుంటుంది. పైకి ఎగరవేసినరాయియొక్క గతి బలము ఈ ఆకర్షణ శక్తిని నిరోధిస్తూ చివరికి ఖర్చైపోయే వరకూ రాయి పైకి ఎగురుతుంది. ఆ బలము అయిపోగానే భూమ్యాకర్షణశక్తివల్ల కింద పడుతుంది. ★

★ న్యూస్ రీల్ ★

(8-వ పేజీ తరువాయి)

—భారతదేశ ఆర్థిక స్థితిగతులపై రిజర్వ్ బాంక్ సమీక్ష ప్రకటించబడింది.

ఆదివారం, జూలై 11 :

—కమ్యూనిస్టుల వైఖరి మారేవరకూ జెనీవా సంప్రదింపులలో పాల్గొనడానికి తానుగాని, జనరల్ వాల్టర్ బెడెల్ స్మిత్ గాని రావడం లేదని అమెరికన్ విదేశాంగ మంత్రి డలెస్ ఫ్రెంచిప్రధానికి తెలియచేశారు.

—ఇండోచీనా సమాలోచనలలో వివిధప్రతినిధులతో సంప్రదింపుల నిమిత్తం భారతప్రతినిధి కృష్ణమీనన్ జెనీవా వెళ్లారు.

—ఇండోచీనాలో శాంతి స్థాపించడానికి జెనీవాలో జరుగుతున్న కృషి ఫలిస్తుందని భారతప్రధాని నెహ్రూ తమ అభిప్రాయం ప్రకటించారు.

—క్షతగాత్రులకు వైద్యసహాయం మొదలైన అంశాలను గురించి వియత్నాంలో ఉభయపక్షాల సైనికాధికారులమధ్యనూ ఒడంబడిక కుదిరింది.

—భారత ప్రతినిధి కృష్ణమీనన్ జెనీవాలో వియత్మిన్ డిప్యూటీ ప్రీమియర్‌తో సంప్రదింపులు జరిపారు. తరువాత ఫ్రెంచి ప్రధానితో వియత్మిన్ డిప్యూటీ ప్రీమియర్ సంప్రదించారు.

—సుప్రీంకోర్టు శాఖ ఒకటి శ్రీనగర్‌లో జూలై 26 నుండి కొన్ని రోజులపాటు అక్కడి కేసులను విచారిస్తుందని ప్రకటించబడింది.

—ఉత్తరప్రదేశ్‌లో గోధుమధరలు బాగా తగ్గిపోయినట్లు లక్నో వార్త.

—ఈజిప్టు అధీనంలో ఉన్న గాజా వద్ద ఇజ్రాయల్ సరిహద్దులో ఉభయ సైన్యాలకూ మధ్య సంఘర్షణ సంభవించింది.

—నందికొండ ప్రాజెక్టును పంచవర్ష ప్రణాళికలో చేరిస్తేగాని ఆంధ్రదేశంలో ప్రజలకూ కాంగ్రెస్‌కూ క్షేమం లేదని ఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్షులు గోపాలరెడ్డిగారు బలవంతరాయి మెహతాగారి సన్మానం నిమిత్తం పశ్చిమకృష్ణా కాంగ్రెస్ కార్యకర్తలు జరిపిన సభలో తమ అభిప్రాయం ప్రకటించారు.

—ప్రస్తుత ప్రాథమిక,మాధ్యమిక విద్యా విధానం కోరగాకుండా ఉందనీ అన్ని విద్యాలయాల్లోనూ బేసిక్ విధానం అమలు జరగాలనీ పండిట్ నెహ్రూ అలహాబాద్ సభలో ప్రకటించారు.

—బియ్యం కంట్రోల్స్ పూర్తిగా రద్దు చేయడంతో ఆంధ్ర ప్రభుత్వం ధాన్యసేకరణ సిబ్బందినీ, సివిల్ సప్లైస్‌లో అదనపు సిబ్బందినీ రెవిన్యూ డిపార్టుమెంటుకు వారి వారి పూర్వ ఉద్యోగాలకు పంపుతూ ఉత్తరువు చేసింది.

కంట్రోల్స్ రద్దుచేసినా ఇతర ప్రభుత్వాలతో చేసుకున్న కంట్రాక్టులను పాటించకపోతే ఆంధ్రప్రభుత్వానికి నష్టం వస్తుందని కేంద్రప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తెలియపరిచినట్లు కర్నూలు వార్త.

—మద్రాస్ రేడియో కేంద్రం మెరీనా బీచ్ కొత్త భవనాలలోకి మార్చబడింది.

సోమవారం, జూలై 12 :

—ఫ్రెంచి ప్రధాని ప్రత్యేకాహ్వానంపైన అమెరికన్ విదేశాంగమంత్రి డలెస్ పారిస్‌లో ఫ్రెంచిప్రధాని బ్రిటిష్ విదేశాంగ మంత్రులతో జెనీవాసమావేశం గురించి చర్చించడానికి సమ్మతించారు.

—ప్రస్తుతానికి ఇండోచీనాసమస్యను గురించి వివిధ ప్రతినిధివర్గ నాయకులమధ్య విడివిడిగా సంప్రదింపులు జరగాలని బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఈడెన్ చేసిన సూచనకు రష్యా విదేశాంగమంత్రి మాలటోవ్ అంగీకరించారు.

—ఆగ్నేయాసియా రక్షణగురించి పాశ్చాత్య ప్రభుత్వాలు రెండురకాల ఒడంబడికలు తయారుచెయ్యవచ్చునని ఆస్ట్రేలియన్ విదేశాంగమంత్రి రిచర్డ్ కాసీ తెలియచేశారు.

—ఐక్యరాజ్యసమితిలో చీనాతరఫున కమ్యూనిస్టుప్రభుత్వమే ప్రాతినిధ్యం వహించాలని ఒప్పుకుంటున్నప్పటికీ, పెకింగ్ ప్రభుత్వాన్ని సమితిలో ప్రవేశపెట్టవలసిన తరుణం ఇంకా రాలేదని బ్రిటిష్ ప్రభుత్వం అభిప్రాయపడుతున్నట్లు చర్చిల్ పార్లమెంటులో వివరించారు.

—హైడ్రోజన్ బాంబు కంట్రోల్ విషయమై వాషింగ్‌టన్‌లో అధ్యక్షుడు ఐసెన్‌హోవర్‌తో తాము చర్చించినట్లు బ్రిటిష్ ప్రధాని చర్చిల్ పార్లమెంటులో ప్రకటించారు.

—విక్రయసుంకాలను విధించే అధికారం రాష్ట్రప్రభుత్వాలకే ఉండాలనీ, ఏ రాష్ట్రాని కారాష్ట్రం అక్కడక్కడి పరిస్థితుల ప్రకారం రకరకాలుగా ఈ పన్ను విధించవచ్చుననీ పన్నుల విచారణసంఘం అభిప్రాయపడినట్లు బొంబాయి వార్త.

—బియ్యంపై కంట్రోల్స్ రద్దయినందువల్ల మద్రాసుప్రభుత్వం పూర్వకంట్రాక్టుల ప్రకారం ఆంధ్రప్రభుత్వంవద్ద బియ్యం కొనవలసిన పని లేదని మద్రాసు ఆర్థికమంత్రి సుబ్రహ్మణ్యంగారు ప్రకటించారు.

—రాష్ట్రకాంగ్రెస్‌తో ఆంధ్ర మంత్రివర్గంలోని కాంగ్రెస్ మంత్రుల సంబంధాలను పరిశీలించడానికిగాను ఒక సబ్‌కమిటీని నియమించబడనున్నట్లు విజయవాడ వార్త.

మంగళవారం, జూలై 13 :

—పారిస్‌లో అమెరికన్ రాయబారి నివాసంలో ఫ్రెంచి ప్రధాని, అమెరికన్, బ్రిటిష్ విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది.

—దక్షిణ లావోస్‌లో థాయ్‌లాండ్ సరిహద్దులో నున్న పక్సేనగరాన్ని వియత్మిన్ సైన్యాలు ముట్టడించాయి.

—థాయ్‌లాండ్‌కి అధికంగా ఆయుధ సామగ్రి సప్లై, సైనికశిక్షణ సహాయమూ వెంటనే ఇవ్వాలని అమెరికా నిర్ణయించింది.

—ఐక్యరాజ్యసమితిలో చీనా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ప్రవేశించనీయనందువల్ల నేనాలుగేళ్లుగావిషమసమస్య ఉత్పన్నమౌతున్నాయని పండిట్ నెహ్రూ అన్నారు.

—అమెరికా ఆర్థికసహాయం పొందడం కోసం సింహళ ప్రభుత్వం చీనాతో చేసుకున్న ఒడంబడికను రద్దుపరుస్తున్నదని మంత్రివర్గంనుంచి రాజీనామా నిచ్చిన సేనానాయక తెలియపరిచారు.

—మార్షల్ దీవులపై హైడ్రోజని బాంబు ప్రయోగంగురించి విచారిస్తున్న ట్రస్టీషిప్ కమిటీ ప్రతిపాదించబడిన తీర్మానాలన్నిటినీ నిరాకరించింది.

—ఉపాధ్యాయుల సహకార సంఘాల చేర్పించి వ్యవసాయానికీ పరిశ్రమల స్థాపనకీ సహాయమిచ్చి విద్యార్థులకు శిక్షణ నివ్వాలని తమిళ్నాడు కాంగ్రెస్ సబ్‌కమిటీ సూచించింది.

—మద్రాసు ప్రభుత్వంకోసం ఆంధ్ర ప్రభుత్వం సేకరించిన లక్షటన్నుల బియ్యాన్ని కేంద్రప్రభుత్వం కొంటుందని ఆంధ్ర రెవిన్యూబోర్డు ఉద్యోగి ఒకరు మద్రాసులో తెలియచేశారు.

—అతివృష్టివల్ల ఏలూరు కాలువకు గండ్లుపడి నాటిన చేలకు నష్టం వచ్చిందని ఏలూరు వార్తలు.

—ఢిల్లీలో ప్రధాని నెహ్రూతో ఆంధ్రరాష్ట్ర సమస్యలనుగురించి ముఖ్యమంత్రి ప్రకాశంగారు చర్చించి తిరిగి కర్నూలు వచ్చారు. మద్యనిషేధం గురించి మాత్రం చర్చించలేదని ప్రకాశంగారన్నారు. ★



మార్క్ ట్వేన్ చిత్రం
'మిలియన్ పౌండ్ నోట్'


'డబ్బున్న వాణ్ణి జనులు అందల మెక్కిస్తారు అతడే డబ్బు పోగొట్టుకున్నప్పుడు తృణీకరిస్తారు ధనానికి అంతులేని శక్తి ఉంది' ఈ సత్యాన్ని వ్యంగ్యపూర్వకమైన హాస్యంతో నిరూపించే చిత్రం "మిలియన్ పౌండ్ నోట్" ఇటీవల మద్రాసు వచ్చింది దీన్ని ఆర్థర్ రాంక్ ఆర్గనైజేషన్ వారు తీశారు హాలీవుడ్ నటుడు గ్రెగొరీ పెక్ కథానాయకుడుగా నటించాడు

ఈ చిత్రానికి ఆధారం మార్క్ ట్వేన్ వ్రాసిన ఒక కథ. లండన్ వీధుల్లో నిరుద్యోగిగా తిరిగే ఒక అమెరికన్ యువకునికి అయాచితంగా పదిలక్షల పౌనుల నోటొకటి లభిస్తుంది ఆ నోటు చేతిలో పట్టుకుని అతడెక్కడికి వెడితే అక్కడల్లా అపూర్వమైన గౌరవమర్యాదలు ఎదురవుతాయి ఆ నోటు ఒకసారి మాయంకాగానే అతనికి సంఘంలోగల గౌరవస్థానం పోవడం, తిరిగి అది అతని చేతిలో కనిపించగానే ప్రజలు అతనికి బ్రహ్మరథం పట్టడం మొదలుగాగల సంఘటనలతో ఈ చిత్రం చక్కని హాస్యధోరణిలో నడుస్తుంది డబ్బుకు ఎంత శక్తి ఉన్నా నిజమైన ప్రేమకు అది అడ్డం రాలేదని గ్రెగొరీ పెక్‌ను ప్రేమించిన జేన్ గ్రిఫిత్స్ పాత్రద్వారా వ్యక్తం చేయబడింది గ్రెగొరీ పెక్ చాలా ఉత్తమ నటన ప్రదర్శించాడు కొన్ని కొన్ని సన్నివేశాలలో హాస్యం, కరుణ మిళితమై ప్రేక్షకులకు ఒకవంక నవ్వు, మరొకవంక ఆందోళన కలిగిస్తాయి ఉదాహరణకు, గ్రెగొరీ పెక్ చేతిలోంచి నోటు ఎగిరిపోయినప్పుడు దాన్ని పట్టుకోవడానికి అతడు పడిన యాతన చార్లీ చాప్లిన్ శైలికి సన్నిహితంగా ఉండి ప్రేక్షకులకు హాస్యం, ఆందోళన, ఉత్కంఠ, జాలి అన్నీ ఒకేసారి కలిగించేదిగా ఉంది

మార్క్ ట్వేన్ నవలలు చాలా వాటిలో ఒక సామాన్యధోరణి కనిపిస్తుంది ముఖ్యపాత్రలను అసాధారణం, అసహజం అయిన పరిస్థితులలో పడవేసి, ఆ పరిస్థితులలో వారెలా ప్రవర్తిస్తారో వాస్తవికంగా వ్యక్తం చేస్తారు ఈ కథలో అమెరికన్ బికారికి పదిలక్షల పౌనులనోటు లభించడం అసహజం కాని అది లభించినతర్వాత అతడి ప్రవర్తన, అతడిపట్ల ఇతరుల ప్రవర్తన అత్యంతవాస్తవికంగా ఉంది మార్క్

పక్షిరాజా వారి "అగ్గిరాముడు" లో

భానుమతి.



నరసూవారి "రాజగురు" లో కె. ఆర్. రామస్వామి, గణేశన్, రంగారావు మున్నగువారు.

క్వేన్ ఆశించిన "జీవితవిమర్శ"ను సాధిస్తాయి

ఈ త్రిమ సారస్వతాన్ని ఆధారం చేసుకొని పాశ్చాత్యదేశాలవారు మంచి చిత్రాలు అనేకం తీశారు. మూలకథలో మార్పులు చేసినా రచయితఆశయాన్ని ఖూనీచేయకుండా దాన్ని స్పష్టంగా చిత్రించగలిగిన నైపుణ్యాన్ని మనవారు, ముఖ్యంగా తెలుగునిర్మాతలు నేర్చుకోవలసి వుంది ఇటువంటి చిత్రాలు సరసులకే మాసపం అందుకు సహాయకారి కాగలదు

"పిగ్మాలియన్" నిర్మాత గేబ్రియల్ పాస్కల్ ఆకస్మిక మృతి

బ్రిటిష చిత్రనిర్మాత గేబ్రియల్ పాస్కల్ ఈనెల 6వ తేదీన కాలధర్మం చెందారు. చనిపోయే నాటికి ఆయనకు 60 ఏళ్లు. మూడు వారాలు జబ్బుపడి న్యూయార్కులోని గూర్క్వ్యలు ఆస్పత్రిలో మరణించారు. ఈయన హంగరీదేశీయుడు.

బెర్నార్డుషా నాటకాలను చలనచిత్రాలుగా రూపొందించిన ప్రముఖ నిర్మాతగా, గేబ్రియల్ పాస్కల్ కీర్తిసంపాదించారు. బెర్నార్డుషా తన నాటకాలను చిత్రాలుగా తీసే హక్కును పాస్కల్‌కు దత్తంచేయడంతో పాస్కల్ వరసగా 1938లో "పిగ్మాలియన్" 1941 లో "మేజర్ బార్బారా" 1944 లో "సీజర్ ఎండ్ క్లియోపాట్రా" చిత్రాలు నిర్మించారు. రెండేళ్ళ క్రితం "ఆండ్రోక్లిస్ ఎండ్ ది లయన్" నిర్మించారు. "డెవిల్స్ డిసైపిల్" నాటకాన్ని కూడా చిత్రంతీయడానికి సంకల్పించారు. ఈయన తీసిన చిత్రాలన్నీ 'క్లాసిక్'లుగా పరిగణింపబడ్డాయి.

30 లక్షల డాలర్ల ఖర్చుతో మహాత్మా గాంధీ జీవితచరిత్రనుకూడా ఈయన చిత్రం తీయడానికి రెండేళ్ళ క్రితం సంకల్పించి, ఆ సంకల్పం కొనసాగకుండానే మరణించారు. గాంధీజీ చిత్రానికి ఆల్డస్ హక్స్లేను స్క్రిప్టురచయితలలో ఒకరుగా నియమించారు. గాంధీజీ జీవితానికి సంబంధించిన అనేక విశేషాలను ఆయన సేకరించారు కూడాను. ఆ చిత్రనిర్మాణం కొరవేరకుండా ఆయన మరణించడం విచారకరం

సినిమా వార్తలు

పక్షిరాజావారు కోయంబత్తూరులోని స్వంత స్టూడియోలో నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం "అగ్గిరాముడు" (తెలుగు) చాలవరకు అయిపోయినట్లేనట, త్వరలో విడుదల కావచ్చునని తెలుస్తోంది. దర్శకుడు శ్రీరాములు నాయుడు గారు. రచయిత ఆత్రేయ ఈ చిత్రంలో భానుమతి

★ సినిమా వార్తలు ★

ప్రధాన పాత్రధారిణి. ఎన్. టి. రామారావు నాయకపాత్ర ధరిస్తున్నారు. రేలంగి, ఆర్. నాగేశ్వరరావు, సురభి బాల సరస్వతి, ఋష్యేంద్రమణి, శ్రీ రామ్ మున్నగువారుకూడా నటిస్తున్నారు.

* * *

జోయా పిక్చర్స్ & రేవతీ స్టూడియోస్ వారు ఇదివరలో వినోదావారు తీద్దామనుకున్న "బాలసన్యాసమ్మ" కథను చిత్రం తీస్తారట. నిర్మాత, దర్శకుడు సి. సుబ్బారావు ("వయ్యారిభామ" నిర్మాత.) ఈ చిత్రానికి రచన సముద్రాల రాఘవాచార్యులు, సంగీత దర్శకత్వం రాజేశ్వరరావు, కామెరా రహమాన్, ఆర్ట్ టి. వి. ఎస్. శర్మగారు నిర్వహిస్తారు. జి. వరలక్ష్మి, జగ్గయ్య, గిరిజ, బలం, రేలంగి, సూర్యకాంతం, సురభి బాల సరస్వతి, గుమ్మడి వెంకటేశ్వరరావు, కోడూరి అచ్చయ్య చౌదరి మున్నగువారు నటిస్తారట.

* * *

నరసూ స్టూడియోస్ వారు నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం "రాజగురు" (అమృత బిందువు అనే పేరుమార్చినట్లు తెలుస్తోంది) చాలవరకు అయిందట. ఈ చిత్రదర్శకుడు ఎ. ఎస్. ఎ. స్వామి; రచయిత దేవులపల్లి కృష్ణశాస్త్రి. నటీనటులు కృష్ణకుమారి, పి. కె. సరస్వతి, శివాజీ గణేశన్, కె.ఆర్. రామస్వామి, ఎస్. వి. రంగారావు, సదాశివరావు మున్నగువారు.

* * *

జనతావారు "పరివర్తన" తాలూకు ఆఖరి సెట్టుమీద ఆఖరి దృశ్యాలు ఈ నెల 9 వ తేదీన షూట్ చేశారు. అది ఒక వీథిదృశ్యం. ఆటబొమ్మలమ్మే ఒకడు వీథిలో సామాను పెట్టుకుని "రంగు రంగుల బొమ్మలు, అందమైన బొమ్మలు" అని పాడుతూ బొమ్మలమ్ముతూ ఉంటాడు. చుట్టూ చిన్న పిల్లలు మూగి కుతూహలంతో పాటవింటూ బొమ్మలుచూస్తూ ఉంటారు. బొమ్మలమ్మేవాడుగా రామకోటి నటించాడు. ఆఖరున తీయబడిన ఈ దృశ్యాలు చిత్రం మొదట్లో వస్తాయట. ఇక ఈ చిత్రంలో తీయవలసి ఉన్నవల్లా రెండు నాట్యదృశ్యాలు. వీటితో పని పూర్తయి విడుదలకు సిద్ధం చేయబడుతుందట. ఈ చిత్రం మార్చి రెండో వారంలో ప్రారంభించబడింది.

* * *

విక్రమ్ ప్రొడక్షన్స్‌వారి "మా గోపి" దాదాపు పదివేల అడుగులపైగా, అనగా సగానికిపైగా తయారైనదని తెలుస్తోంది. ఈ చిత్రం మే నెలలోనే ప్రారంభమైనప్పటికీ నిర్మాత, దర్శకుడు అయిన బి. ఎస్. రంగాగారు షూటింగ్ శీఘ్రగతిని జరుపుతూ ఆగస్టుకల్లా పూర్తిచేయాలని భావిస్తున్నారు.

* * *

సాహిణీ ప్రొడక్షన్స్‌వారి "అమర సందేశం" (మొదట్లో పెట్టిన 'సందేశం' అనే పేరు మార్చారు.) కూడా సగానికి పైగా అయిందని తెలుస్తూంది. ఈ చిత్రానికి దర్శకుడు శ్రీ ఆదుర్తి సుబ్బారావు. అమరనాథ్, శ్రీరంజని, పద్మిని మున్నగువారీ చిత్రంలో నటిస్తున్నారు. ★

సినిమాలపై మహిళల ఆరోపణ: పరిశోధనల ఆవశ్యకం

—చామర్తి కనకయ్య

నేడు ప్రజాజీవితంలో 'సినిమా' ఒక అంతర్భాగంగా స్థిరపడి, విలసిల్లుతూన్నది. దీనిని మహోత్తమ ప్రచార సాధనమని కొందరంటే, యాంత్రిక యుగ జనులకు లభించిన ఆధునిక దృశ్యకావ్య విభాగంగా మరికొందరు పేర్కొంటున్నారు. భావి పౌరులకోసం నేటి వారు భద్రపరచిన అమూల్య ఐతిహాసిక సంపదగా మరొకరు ఉల్లేఖిస్తున్నారు. ఇది పరిశ్రమగా పరిగణించబడుతున్నా, 'కళ'గా రాణిస్తూ కళాకాంక్షితులను చేయించుకొంటున్నది. ఇది భావవ్యక్తీకరణకు, ఉత్తమ ప్రబోధానికి అద్వితీయమైన సాధనంగా, వినోద విజ్ఞాన వికాసాలకు పుట్టినిల్లుగా ప్రజాహృదయాన్ని చూరగొంటూన్నది.

ఏ దేశంలోనైనా నాగరికత ఎంత ఉచ్ఛస్థితిని అందుకొన్నదో, వికసించినదో పొరసిచూడాలంటే ఆ దేశంలో వర్ధిల్లిన కళలే శరణ్యం. అట్టి కళలలో ఈ 'సినిమా' కళ ముఖ్యమైనది.

అయితే, ఇంతటి ప్రచార ప్రభావాలు కల ఈ 'సినిమా'లు అసభ్యంగా అవినీతిదాయకంగా పరిణమిస్తున్నాయని, సున్నితమైన లేతహృదయాలను విషకలుషితం చేసివేస్తున్నవని, మద్రాసు మాజీ ముఖ్యమంత్రి శ్రీ రాజాజీ తన హయాంలో ఒకసారి వీటిని తీవ్రంగా ప్రతిఘటించి 'మొదటి శత్రువులు కమ్యూనిస్టులు. రెండు 'సినిమాలు' అని నొక్కి చెప్పారు. జనరల్ కరియప్పకూడ తమకుగల అక్కసు నంతా ఈ సినిమాలపై ఆనాడే వెళ్ళగక్కారు... ముఖ్యంగా రాజాజీ ప్రకటనే యావన్మందికీ ఒక సవాల్ గా పరిణమించింది. ఆనాడు రాజాజీని విమర్శించని వాడులేడు. అదిజరిగి చాలాకాలమైంది.

కాని......

నేడుకూడ అదేవిధమైన వ్యతిరేకత కొత్తరాహులనండి వినిపిస్తున్నది. ఆనాడు ఏ ఒక్క రాజాజీయో, కరియప్పో వ్యతిరేకిస్తే నేడు 18 వేలమంది మహిళలు, (గృహిణులు) సంతకాలతో సహా ఒక అభ్యర్థనను ప్రధాని నెహ్రూగారికి అందించారు. నెహ్రూ అందుకుని ఆలోచిస్తాననడంతో అది కొందరిలో సంచలనాన్ని కలిగించింది. వెంటనే కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు అధ్యక్షుడుగా వెనక పనిచేసిన, సర్ అగర్వాలా ఆ మహిళల ఆరోపణలు నిరాధారములైనవని ప్రకటించాడు.

పైగా ప్రభుత్వానికి ఈ సినిమా ఆపదను అరికట్టడానికి అధికారం లేకపోతే అలాటి అధికారాలను సంపాదించుకోవాలని కూడ వారు కోరడం అటు ప్రభుత్వానికి ఇటు నిర్మాతలకు ఒక రకమైన సవాల్.

'మాకు ఉత్తమ చిత్రం కావాలని ప్రేక్షకులు నిర్మాతను కోరడం, మాకు మంచి వినోదదాయకమైన హాస్యచిత్రమో, సంగీతచిత్రమో ఇమ్మని వారు అడగడం సమంజసం. సెన్సార్ నిబంధనలను మరికొంచెం కట్టుదిట్టం చేయండనో, అర్ధనగ్న దృశ్య సమన్వితాలైన అసభ్య అమెరికన్ చిత్రాల విడుదలను కొంత నిరోధించాలనో లేక పూర్తిగా వాటిని నిరోధించాలనో ప్రభుత్వాన్ని కోరడం చాలా సమంజసం. అంతే కాని సినిమాలు లేకండా చేయండని కోరడం అంత అసమంజసమూ, అసందర్భమూ మరొకటి ఉండదు.

"మా బిడ్డల నైతికారోగ్యానికి ఈనాటి సినిమాలు మహాప్రతిబంధకంగా ఉన్నాయి. అవి కనుగాయల్ని అకాలంలో అనైతికర సంబంధాలలోనికి దింపుతున్నాయి. జారత్వం, చోరత్వం వగైరాలు నేర్పి సంఘశాంతికి భంగం తెస్తున్నాయి." ఈవిధంగా ఇంకా కొన్ని విషయాలతో ఆ తల్లుల వినతిపత్రం సాగింది

ఈ చిత్రాలు సెన్సార్ బోర్డు దృష్టికి రాకుండానే విడుదలకావటంలేదే. అయితే ఈ వచ్చే చిత్రాలు దుర్మార్గుల్ని తయారు చేసేవిగా ఎట్లా ఉంటున్నాయి? సెన్సార్ బోర్డు నిద్రపోతున్నదా? అనే ప్రశ్న ఉదయిస్తుంది.

అసలు సెన్సార్ బోర్డు ఎందుకున్నది? అది ఏమి చేస్తూంటుంది? అనేవి తెలిసికొందాం.

ఫిలింలలోని లోపాలను సరిదిద్ది ఒక నిర్దుష్టమైన విధానంలో చిత్రాలను ప్రజలకందించడానికిగాను 1918 లో 'ఇండియన్ సినిమటోగ్రాఫ్ ఆక్టు'ను ప్రభుత్వం ఆమోదించి, చిత్రాల ప్రదర్శనను సర్టిఫై చేసి



జనతా వారి 'పరివర్తన' లో తండ్రి, కూతుళ్ళు—సావిత్రి, దొరస్వామి.

★ సినిమాలపై మహిళల ఆరోపణ ★

భారతీయ చిత్రపరిశ్రమలో తొలిసారిగా ప్రాముఖ్యం కలిగించుకున్నది. అది సెన్సార్ చేసే పద్ధతులను ప్రవేశపెట్టగా 1927 28 ల మధ్య ప్రొడ్యూసర్లకు సెన్సార్ బోర్డులకు సంబంధాలు ఏర్పడి, రానురాను దృఢతరమైనాయి.

కొందరు నిర్మాతలు తీసిన చిత్రాలపై సెన్సార్ బోర్డు ఒక రివ్యూ తీసుకొంటుంది. సెన్సార్ అనేది చిత్రాల స్థాయిని అభివృద్ధి పరచడానికి తోడ్పడాలి. సెన్సార్ నిబంధనలను అతిక్రమించి ఏ నిర్మాత అయినా చిత్రాన్ని నిర్మిస్తే తప్పక ఆ చిత్రం సెన్సార్ కత్తెరకు గురికాక తప్పదు. ఎప్పుడైనా, ఎక్కడైనా ఒక్కొక్కప్పుడు ఈ నిబంధనలను మించి సెన్సారు ప్రమత్తత వల్ల కొన్ని చిత్రాలు విడుదలకావచ్చును. అప్పటికీ, ప్రేక్షకుల అభిరుచిని ఈ తరహా చిత్రాలపట్ల సుముఖంగా మార్చడానికి తగు సూచనలు చేయడమే గాక ప్రజలలో చలన చిత్ర చైతన్యం విశేషంగా వ్యాప్తం కావడానికి సినిమా పత్రికలేమి, ఇతర ప్రముఖ పత్రికలేమి విశేషంగా పాటుపడుతున్నవి.

అయితే సర్ అగర్వాలా, తన ప్రకటనలో వివరించినట్లు నిజానికి గడచిన రెండు సంవత్సరాలలోను భారతీయ చలన చిత్రాలనుంచి అసభ్యకరమైన దృశ్యాలు మాటలు, పాటలు తొలగించబడ్డాయి. అయినప్పటికీ ఢిల్లీ మహిళలు చేసే ఆరోపణలలో తమ పిల్లలు దుర్మార్గులు కావడానికి సినిమాలే కారణం అనడంలో న్యాయం కనిపించదు. ఒకళ్ళు పాడుకావటానికి గాని, ఒకళ్ళు బాగుపడటానికిగాని ఏ ఒక్కటీ ఎప్పుడూ సహాయకారి కానేరదు. ఎన్నో కారణాలు జతపడితే తప్ప ఏ ఒక్క విషయమూ తన ప్రభావాన్ని ప్రత్యక్షంగా ప్రసరించ నేరదు.

సినిమాలు సంఘంలో అల్లరి చిల్లరి వ్యవహారాలను ప్రోత్సహిస్తున్నాయనే దురభిప్రాయాన్ని ఖండిస్తూ నిజానికి ఫిల్ములు పోలీసుల కర్తవ్యాన్నే నిర్వహిస్తున్నాయని, అల్లరి చిల్లరి వ్యవహారాలకు అలవాటు పడ్డవారి దృష్టిని ఆకర్షించడం ద్వారా ప్రజల సంక్షేమానికి ఇవి పాటుపడుతున్నాయని సినిమాలను భోగవిలాసాలుగా పరిగణించ కూడదని ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ చందూలాల్ షా అన్నారు.

ఇక విదేశాలనుంచి ముఖ్యంగా అమెరికా సినిమాలతో పేచీ వస్తున్నది. భారతీయ నైతిక ప్రమాణాలకు తగని చిత్రాలకు అనుమతి లభించడం లేదని, ఇక పోగా మిగిలిన చిత్రాలలో 'సెక్సు, నేరం' విషయాలకు సంబంధించిన భాగాలు నిశితంగా పరిశీలించే తరవాత విడుదలకు అనుమతి ఇవ్వబడుతున్నదని అగర్వాలా పేర్కొన్నారు.

'సెన్సార్ బోర్డు అనుమతించిన చిత్రాలలో అసభ్యకరంగా ఉన్న దానిని ఏ ఒక్కటయినా ఆ మహిళలు ఎత్తిచూపగలరా?' అని శ్రీ అగర్వాలా సవాల్ చేశారు.

కొన్ని కొన్ని చిత్రాలు వయోధికులకు మాత్రమేనని ప్రకటించబడి ప్రదర్శితమౌతుంటాయి. అప్పుడు చిన్నవారు, అవివాహితులు ఆ సినిమాలకు మరింత విపరీతంగా ఎగబడుతున్నారు. ఏది కూడదో అదే చేయాలనేకదా మానవప్రవృత్తి! ఫలానవయస్సులోపువారెవ్వరూ సినిమాలు చూడకూడదనే రూలు ఒకవేళ ప్రభుత్వం శాసనం

చేస్తుంది. అప్పుడు ఈ సమస్య మరింత క్లిష్టమైపోతుంది. పెద్దవాళ్లు సినిమాలు చూడడం మానితే తప్ప అప్పుడు పిల్లలు మానరు. పెద్దలు మానినా వారు మానక పోవచ్చు కూడా. తమతో కూడా పిల్లలను వెంటబెట్టుకోవకుండా ఇంటిదగ్గరే వారిని దిగవిడిచి వెళ్లడం ఎందరు మహిళామణులకు (గృహిణులకు), సాధ్యపడుతున్నదో ఆలోచించాలి! 'హాలులో పొగ త్రాగినవారు శిక్షింపబడుదురు' - అనే స్లైడ్ చూశాకనే చేసు ఇంకా ఎన్నో థియేటర్లలో సిగరెట్లు వెలిగించడం మనం చూస్తున్నాం. 'సినిమా వయోజనులకు మాత్రమే' అని రేపు ప్రభుత్వం ఒకవేళ చట్టంచేస్తే నైతికంగా ప్రభుత్వంతో ఈ ప్రజలలో ఎందరు సహకరించగలరు?-అప్పుడు ఈ థియేటర్ యజమానుల స్థితి ఎంత క్లిష్టంగా ఉంటుందో వేరే చెప్పనక్కరలేదు.

కాగా, సినిమా ప్రేక్షకులలో చాలా మందిలో ఇదివరలో కంటె విమర్శనా శక్తి హెచ్చింది. విద్యావిహీనులు కూడా, వినోదంకోసమే చిత్రం చూడదలిచినా చిత్రంలోని మంచి చెడ్డలు తమకు తామే నిర్ణయించుకొంటున్నారు. లోగడలోవలె ఒకే చిత్రాన్ని పదేపదే చూడడం సంభవించడంలేదు. ఎట్లాంటి స్థాయి చిత్రాన్ని ఎంతవరకూ పోషించాలి; అనేది ఎవరంతట వారే నిర్ణయించ గలుగుతున్నారు. ప్రేక్షకులు సినిమాలలో వైవిధ్యాన్ని ఆశిస్తున్నారు. ఒకే మూసలోంచి వచ్చే కథలను ఇక్కడ ఎత్తిచూపి ఇదేమని అడుగుతున్నారు. తారలపై మోజు చాలాభాగం తగ్గిపోయింది. వారుకూడ మానవమాత్రులే అనే విషయం చాలా నమ్మకంగా తెలిసి వస్తున్నది. అసభ్యాలకు, అశ్లీలాలకు మోజు రానురాను తగ్గిపోయిందనే విషయం నిర్మాతలు చాలా చప్పున గుర్తించి, ఇటీవల చాలా మెలకువతో చిత్రాలు నిర్మిస్తున్నారు. 'స్టార్ వాల్యూ' ఏమీ లాభించడంలేదు. శతదినోత్సవాల పండుగలు సన్నగిల్లినాయి. ప్రజల ఆర్థికప్రమాణం ఇదివరలో కంటె ఏమాత్రం పడిపోలేదు. అందువల్ల అది కారణంకాదు. ఎంత మంచి చిత్రమో తాను విడుదల చేస్తున్నాను కదా అని సంబరపడడానికి నిర్మాతకు వీలులేదు. దానికి ప్రజలనుండి సమాధానం రెండు రోజుల్లోనే వస్తున్నది. పైగా నేడు సినిమాలపై వచ్చే విమర్శలు మరోవిధంగా ఉన్నాయి.

“మా కులాన్ని నిమర్శించారు. మా తెగ వాళ్ళను కించపరిచారు. మా విద్యార్థులను చాలా అన్యాయంగా చిత్రించారు. అవి కత్తిరించండి” అని అడుగుతున్నారు. అటువంటప్పుడు ఈసినిమాలవల్ల నేరాలు ఎక్కువైనాయని ఆరోపించడంలో అర్థం లేదు. అది వెనక మూడేళ్లక్రితం చేసినా అప్పుడు కొంత అర్థవంతంగా ఉండిఉండేది. ఇటీవల ఉత్తమ చిత్రాలుగా పరిగణింపబడినన్ని మంచి చిత్రాలు ఎప్పుడూ ఇదివరలో రాలేదు.

అయితే ఒకసారి సెన్సార్ అయిన చిత్రంపై ప్రభుత్వం ఎట్టి బాధ్యతా వహించలేదు. ఫిలిం సెన్సారింగ్ నిబంధనలను రూపొందిస్తూ ఫిలింల విషయంలో సర్వాధికారాలు సెన్సార్ బోర్డుకే ఉండాలని, ప్రభుత్వం తుది నిర్ణయాధికారాన్ని అట్టే పెట్టుకోవడం మంచిదికాదని వెనక పార్లమెంట్ నిర్ణయించింది. తరువాత దానినే పలుచోట్ల డాక్టర్ కేస్కార్ ఉద్ఘాటించడం జరిగింది కూడ. అయినప్పుడు ప్రభుత్వానికి ఈ విషయంలో ఇక ఏమీ ప్రసక్తి లేదుకదా!

ప్రజా మనస్తత్వాన్ని కొంతవరకూ మార్చగల గుణం సినిమాలకున్నది. ఎదుటి రసాస్వాదకులనుబట్టి వారి నిబ్బరాన్నిబట్టి ఆ ప్రభావం మార్పుల్ని సంఘటించడం, లేకపోవడం ఆధారపడి ఉంటుంది. “సినిమాలవల్ల బాలయోగులయినవారున్నారట. ఈ సినిమాలవల్లనే శీలాన్ని పోగొట్టుకున్నవారుకూడ ఉన్నారట” - కాని ఒక్క సినిమా మాత్రమే సాధారణంగా ఏమీ చేయలేదు.

ప్రజాసామాన్యంలో హృదయ పరివర్తనాన్ని కలిగించడానికి ఉపయోగించే ఉత్తమ సాధనాలగు పత్రిక, రేడియో, సినిమాలలో, ఒక్క సినిమాయే ప్రముఖస్థాన మాక్రమించింది. ఇది నేడు సర్వే సర్వత్ర అంగీకరించబడిన సత్యం. చాలా కాలం స్థిరంగా నిలిచిపోగల ఉద్రేకోద్వేగాలను రసానుభూతిని కలిగించగలిగే శక్తి ఒక్క సినిమాకే గలదని - '*The world is my cinema*' లో 'రాబ్సన్' అంటాడు. అప్రతిమాన శక్తిగల 'సినిమా' ప్రజాహృదయాలలో ఎంత ప్రగాఢంగా హత్తుకుపోయేది, మనస్తత్వంలో ఎట్లాంటి పరిణామాలను తెచ్చేది - ఆ ప్రేక్షకుల వయోభేదంపైన, వారి అభిరుచులపైన, వారి ఆర్థిక సాంఘిక వ్యవస్థపైన, స్త్రీ పురుష భేదంపైన ఆధారపడి ఉంటుంది.

ఢిల్లీ గృహిణుల అభ్యర్థనను ప్రభుత్వం తీవ్రంగా ఆలోచించి తగు విధమైన చర్యకు పూనుకోదలిస్తే కొన్ని కమిటీలో మరి కొన్ని కమిషన్లో. ఏర్పడడం తథ్యం. వీటి నివారణ ఏ ఒక్క రాష్ట్రానికీ పరిమితం కాక దేశవ్యాప్తంగానే జరుగుతుందని ఆశించడంలో పొరపాటు ఉండదు. అప్పుడు సమర్థులైన ఒక పరిశోధకుల సంఘాన్ని కూడ నియమించడం అవసరం. వారు మంచి మనోవైజ్ఞానికులు కావాలి. ఒక్క సినిమాయే పిల్లలపై తమ దుష్ప్రభావాన్ని చూపుతున్నదా? ఏ వయస్సువారిపై ఏ సినిమాలు ఎట్టి ప్రభావాలను చూపుతున్నవి? అవి ఎట్లా పర్యవసిస్తున్నవి? అనే విషయాలు సాకల్యంగా పరిశీలించేందుకు ఒక నిపుణుల సంఘం(పరిశోధకులు) అవశ్యం నిర్మించవలసిన అవసరం కనబడుతున్నది. అటు శాస్త్రవిషయికంగా, పరిశోధనాపరంగా కూడ ఈ పద్ధతి ఒక ముందడుగవుతుంది. ఇటు ప్రజాశ్రేయస్సుదృష్ట్యా కొన్ని సత్పరిణామాలు కలగచేయడానికీ వీలవుతుంది.

విదేశాలలో ఈ మాదిరి పరిశోధనలు చాలాచోట్ల జరిగాయి. వెనక ఇల్లాగే జర్మనీలో సంభవించిన సంఘటనల పరిణామాన్ని వాటికి కారణమైన శక్తుల ప్రభావాన్ని డాక్టర్ క్రాకర్ విశదీకరించాడు. యుద్ధం, జూదం, జాతివిచక్షణ మొదలైనవి పిల్లల మనస్సులపై ఎట్టి భావాలను అంకితం చేసేదీ, అవి వారి హృదయాలలో ఎట్టి పరివర్తనం కలిగించేదీ, ఆ పరివర్తనం ఎంత కాలం వారి మనస్సులపై నిలిచేదీ థర్ స్టన్ పరిశీలించాడు. 'ది బర్త్ ఆఫ్ ఎ నేషన్' అనే చిత్రం అమెరికన్ బాలురకు నీగ్రోలపై ఎట్లా విముఖతను లేపింది; అది వారి మనస్సులలో 18 నెలలపాటు ఎట్లా నిలచి ఉన్నదీ అతను పరిశోధించాడు.

వట్టినే సినిమాలు చెడుదంటూ వాటిని నిర్మూలించాలనడంకంటె, ఆ చెడుకు కారణాలను పరిశోధించి ఎంతవరకు అవి అవసరమో నిర్ణయించడం న్యాయం. 'మేయర్' అనే అతను '*Sociology of Film*' అనే పుస్తకం వ్రాశాడు. బర్మింగ్ హామ్ విశ్వవిద్యాలయంలోని విద్యాశాఖ కొన్ని చిత్రాలను తీసుకొని అవి వయోధికులలో ఎట్టి పరివర్తనాన్ని కలిగించేదీ పరిశీలించిందని, బ్రిటన్ లో ఇట్లాంటి కృషి బాగా ప్రోత్సహించబడుతున్నదని ఆ గ్రంథంలో వ్రాశాడు.

కాగా చలనచిత్రాలు ప్రజల నడవడిని ఎంతవరకు తీర్చి దిద్దగలిగేదీ, అది భిన్న వయస్కులైన ప్రేక్షకులలో ఎట్టి మార్పులను తెచ్చేదీ జాగ్రత్తగా పరిశీలించి మానవ మనస్తత్వంపై చలనచిత్రాలకు గల శక్తి ప్రసాధనాలు ఎట్లాంటి మార్పులను తెస్తున్నదీ తెలిసికొని అప్పటికీ అవి సత్పరిణామాల కన్న దుష్పరిణామాలనే కలిగిస్తున్నట్లయితే సినిమా 'కళ' గా దాని స్థానాన్ని కోల్పోకుండా ఉండేటట్లు, పరిశ్రమగా దానికనవసరమైన ఇబ్బందులూ కలగకుండా ఉండేటట్లు



విక్రమ్ ప్రొడక్షన్స్ వారి "మా గోపి" లో వీణాపాణి జమున.



గొప్ప ఆదరణపొందిన చిత్రాలలో వానిని సంస్కరించి, అని ఇంతకంటె ఎక్కువగా, ప్రజాహృదయాలలో ఉన్నతమైన భావాలను, ఉత్కృష్టమైన ఆశయములను మార్చదగు ప్రయత్నించేసే అవకాశం నిర్మాతలకు, దర్శకులకు కలిగించడం ముఖ్యం. అయితే ఈ గృహిణుల అభ్యర్థన, కొందరికైనా, ముఖ్యంగా దుష్టబుద్ధితో ప్రజలను వినోదింగా రెచ్చగొట్టి నాలుగు డబ్బులు చేసికొందామనే నిర్మాతలకైనా 'బహుపరాక్' గానూ సవాల్ గానూ పరిగణించి మేలుకలిగిస్తే చాలా సంతోషం.

★

"అగ్గిరాముడు" లో భానుమతి,


పంచతంత్రం:
లబ్ధనాశము
చిత్రరచన, నిర్వహణ: విశ్వాత్ముల నరసింహమూర్తి
తన బలగాలన్నిటినీ - మరొక రోజు రాజుగారు - స్వయముగ చూస్తున్నారు.
"వీరకుమారా!, మీ పేరేమి? - యూరేమి? - మునుపే ఆహవమున ఈ - కత్తి దెబ్బ తిన్నారు?"
"రాజాధిరాజ! రవికోటి తేజ! పుట్టుక చేతను కుమ్మరి నేను! నన్ను యుధిష్ఠిరుడని పిలిచెదరు, కత్తి దెబ్బ కాదిది స్వామీ!..."
"నిజం చెప్పుకుంటే నా - కసలే నిద్దుర పట్టదు - ఒక రోజున తప్పతాగి - కుండ పెంకులపై పడగా - అయి నంతే ఈ గాయం!"
కుమ్మరి చెప్పినదానితో తానను కొన్నది తప్పని బుజువైనందుకు ఎంతో మండిపడిరి రాజుగారు
[తక్షణమే ఇద్దరు భటులను పిలిపించి]
"వీణ్ణి చూసి నేనెవడో - మహావీరుడను కొంటని, - కాదని తేలినదిప్పుడు' - కావున వీణ్ణిప్పుడే కొర- డాలతో కొట్టండి!"
కుమ్మరి దెబ్బలకు వెరచి పడెను రాజు కాళ్ళపైన.
"ఏదో ఒక యుద్ధమొచ్చు దాకా ఆగండి మీరు! అప్పుడు నా సామర్థ్యం పరీక్షించి తగిన శిక్ష వెయ్యచ్చుండి, స్వామీ!!"
"చాలు చాలు! పోరా ఇక - కుమ్మరి నువు పుట్టుకచే; - రారాజులకే లేని - లక్షణమెట్లొచ్చు నీకు? - ధైర్య సాహసాలకునూ - సద్గుణ శీలానికి నువు - ఆటపట్టువైతే ఐ- వుండవచ్చు, ఐనా సరే - నువ్వీక్షణమే యిట - నుంచి కదలి పోవాలి!"
"ఈ మాటలు అంటుంటే - వెనుకటి కా నక్క పిల్ల కథ జ్ఞాపకమొస్తోంది!"
"ఎవరా నక్క? ఏమా కథ?"
8

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Prees. 7, Thambu Chetty St, Madras.